అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 11-5-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 130 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు వెల : 6.50

నేడు బ్లాక్ డే

నల్ల రిబ్బన్లతో రెజ్లర్ల నిరసన

- కేంద్రమంత్రి స్మృతి ఇరానీకి రెజ్లర్ల సమస్యపై మౌనమెందుకు : ఏఆర్ సింధూ



వివరాలు 7లో..

అదానీపై సుప్రీంకు నివేదిక



సీల్డ్ కవర్‌లో అందజేసిన నిపుణుల కమిటీ

న్యూఢిల్లీ : అదానీ గ్రూప్‌పై అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలకు సంబంధించి విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ న్యాయస్థానానికి తన నివేదికను సీల్డ్ కవరులో అందజేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ జరుపుతుంది. అయితే సుప్రీంకోర్టు లేవనెత్తిన ...5లో

అదానీ కంపెనీలకు షాక్

- ఉద్గారాల తగ్గింపు జాబితా నుంచి ఐక్యరాజ్య సమితి తొలగింపు

వివరాలు 5లో..

గెలుపెవరిది..?

ముగిసిన కర్నాటక పోలింగ్

- 65.69శాతం పోలింగ్ నమోదు
- చెదురుమదురుగా ఘర్షణలు
- వెల్లడైన ఎగ్జిట్ పోల్స్



బెంగళూరు : చెదురుమదురు హింసాత్మక ఘటనలతో కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు బుధవారం ముగిశాయి. సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 65.69శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. కాగా, శనివారం ఓట్ల లెక్కింపు జరిగి, ఫలితాలు వెల్లడి కానున్నాయి.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న కర్టాటక అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బీజేపీ భావిస్తుండగా, ప్రభుత్వ వ్యతిరేకత పనిచేస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. 61స్థానాల్లో పట్టు కలిగిన జేడీఎస్ కీలక పాత్ర పోషించే అవకాశం వుంది. 224 అసెంబ్లీ స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ ప్రధానంగా పోటీ పడుతున్నాయి. మొత్తంగా 2165మంది అభ్యర్థులు ఈసారి బరిలో వున్నారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతతో సహా వృద్ధులు కూడా పెద్ద సంఖ్యలోనే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా ఇంటినుండే ఓటు వేసే అవకాశం వుందన్న విషయాన్ని తమకు తెలియచేయలేదని ,అందువల్లే తాము పోలింగ్ కేంద్రాలకు ఇబ్బంది పడికూడా రావాల్సివచ్చిందని సీనియర్ సిటిజన్లు, వికలాంగులు ఫిర్యాదు చేశారు. మరోవైపు, బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ ...7లో

ఎగ్జిట్ పోల్స్

	బిజెపి	కాంగ్రెస్	జెడిఎస్	ఇతరులు
యాక్సిస్ మై మీడియా	62-80	122-140	22-25	0-3
సి ఓటర్	83-95	100-112	21-29	2-6
మాట్రీజ్	79-94	103-118	25-33	2-5
సిజిఎస్	114	86	21	3
పోల్‌స్టర్	88-98	99-109	21-26	0-4
జన్ కీ బాత్	94-117	91-106	14-24	0-2
ఇటీజి	78-92	106-120	20-26	2-4
పీపుల్స్ పల్స్	78-90	107-119	23-29	1-3
సిఎన్ఎక్స్	80-90	110-120	20-24	1-3
సగటు	90	109	24	2

వైద్యుల కొరత

దేశవ్యాప్తంగా ఆస్పత్రుల వద్ద రోగుల పడిగాపులు

గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దుర్భరం

ప్రభుత్వరంగ సంస్థలను ఒక్కొక్కటిగా మోడీ ప్రభుత్వం ప్రయివేటుకు కట్టబెడుతున్నది. దేశ ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా వైద్యరంగాన్ని కూడా గాలికొదిలేయటానికి సిద్ధమైంది. ఒకవైపు నిర్వహణకు తగిన కేటాయింపులు లేక,మరోవైపు వైద్యులేక, సిబ్బందీ లేక సర్కారు దవాఖానాలు మూలనపడుతుంటే.. బాగు చేయటానికి ఏమాత్రం శ్రద్ధచూపటంలేదు. విరాళాల రూపంలో వేల కోట్ల నిధులు పీఎం కేర్స్ ఖజానాకు చేరుతున్నా..వాటిని ప్రభుత్వ దవాఖానాలకు వినియోగించకుండా ప్రయివేటుకు ధారపోస్తోంది.ప్రజలన్నా, ప్రజల ఆరోగ్యమన్నా ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపులేని వ్యవహారంగా మారింది.



న్యూఢిల్లీ : రోగులకు అవసరమైన ప్రత్యేక చికిత్సల కోసం కేంద్రం ఎయిమ్స్ తరహాలో వైద్య సంస్థలను నిర్మిస్తున్నప్పటికీ వాటిలో తగినంత మంది వైద్యులను నియమించకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. బీహార్‌కు చెందిన 21 సంవత్సరాల మిథలేష్ చౌదరి కథ వింటే రోగులు ఎంత నిస్సహాయ, దయనీయ పరిస్థితులలో ఉన్నారో అర్థమ వుతుంది. డాక్టర్ అపాయింట్‌మెంట్ ...5లో

భారత్‌లో మాతా శిశు మరణాలు ఎక్కువే

- ఆరోగ్య సంరక్షణపై తగ్గుతున్న వ్యయం : ఐరాస నివేదిక వెల్లడి



కేప్‌టౌన్ : దేశంలో గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, వారి కోసం ...5లో

ట్రంప్ దోషే...

- కాలమిస్ట్‌పై లైంగిక వేధింపులు నిజమే
- 5 మిలియన్ల డాలర్లు నష్టపరిహారంగా చెల్లించాలన్న కోర్టు



వాషింగ్టన్ : లైంగిక వేధింపుల కేసులో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దోషి అని మన్‌హటన్ న్యాయస్థానం నిర్ధారించింది. రచయిత, కాలమిస్ట్ ఇ.జేన్ కేరోల్‌పై ట్రంప్ లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం వాస్తవేమనని జ్యూరీ పేర్కొంది. ట్రంప్ ఆమెపై అత్యాచారానికి పాల్పడలేదని, కానీ లైంగిక వేధింపులు చోటు చేసుకున్నాయని కోర్టు తన రూలింగ్‌లో పేర్కొంది. మూడు గంటల ...5లో

టెన్త్‌లో 86.60 శాతం ఉత్తీర్ణత

గతేడాది కంటే 3.4 శాతం తగ్గుదల ... బాలికలదే పైచేయి

- బాలుర కంటే 3.85 శాతం అధికంగా పాస్
- 6,163 మందికే పదికి పది సీజీపీఏ
- గతేడాది కంటే 5,180 మంది తక్కువ
- 2,793 పాఠశాలల్లో వందశాతం పాస్
- 25 బడుల్లో సున్నా ఫలితాలు
- అగ్రస్థానంలో నిర్మల్, అట్టడుగున వికారాబాద్
- ఫలితాలు విడుదలచేసిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్టీ ప్రాంగణంలో బుధవారం విడుదల చేశారు. కరోనా సమయంలో 2020, 2021లో పదో తరగతి పరీక్షలను నిర్వహించలేదు. ఆ రెండేండ్లు విద్యార్థులందరినీ ప్రభుత్వం ఉత్తీర్ణులుగా ప్రకటించింది. గతేడాది 70 శాతం సిలబస్‌తో ఎక్కువ ఛాయిస్ ఇచ్చి పదో తరగతి పరీక్షలను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది వంద శాతం సిలబస్‌తో ఆరు పేపర్లకే ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ ఏడాది 86.60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది కంటే ఇప్పుడు 3.4 శాతం ఉత్తీర్ణత తగ్గడం గమనార్హం. రెగ్యులర్ విద్యార్థులు 4,84,370 మంది ...7లో



ఎంసెట్ రాతపరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 91.79 శాతం హాజరు
- పరిశీలించిన ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించే ఎంసెట్ రాతపరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తెలంగాణలో 95, ఏపీలో 18 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. తొలిరోజు 57,578 మంది దరఖాస్తు చేసుకుంటే, వారిలో 52,855 (91.79 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఇందులో ఉదయం నిర్వహించిన మొదటి విడతకు ...5లో

ప్రత్యేక కోర్టుకు ఇమ్రాన్

- అల్‌ఖదీర్ ట్రస్టు కేసులో 8రోజులు ఎన్‌ఏబీ కస్టడీకి
- తోషఖానా అవినీతి కేసులో అభిశంసన
- పాకిస్తాన్‌లో పీటీఐ కార్యకర్తల నిరసలు



ఇస్లామాబాద్ : అవినీతి కేసులో అరెస్టయిన పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను బుధవారం ఇక్కడ ప్రత్యేక కోర్టులో ...5లో

కృష్ణాలో వాటా తేల్చాల్సిందే

- 66:34 నిష్పత్తి ఇక చెల్లదు
- మా అవసరాలు పెరిగాయి
- కేఆర్ఎంబీ భేటీలో తెలంగాణ పట్టు
- 50:50 నిష్పత్తిలో వాడుకుంటాం
- కేంద్రానికి నివేదిస్తా:చైర్మెన్ శివనందన్‌కుమార్
- వాడీవేడీగా కృష్ణా నదీ బోర్డు సమావేశం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాలకు నీటి వాటా తేల్చే విషయాన్ని కేంద్ర జలశక్తిశాఖకు నివేదించాలని కేఆర్ ఎంబీ నిర్ణయించింది. జల విద్యుత్ ఉత్పత్తి, రూల్ కర్వ్, వరద సమయంలో నీటి లెక్కలకు సంబంధించి జలాశయాల ...7లో

ఆశావర్కర్లకు పరీక్షలా!

ఎగ్జామ్‌ను రద్దు చేయకుంటే పోరాటాలను ఉధృతం చేస్తాం : ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశావర్కర్ల ఎగ్జామ్‌ను రద్దు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం ఆశావర్కర్ల సమస్యపై నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాకు జయలక్ష్మి హాజరై మాట్లాడారు. 18 ఏండ్ల నుంచి ఆశా వర్కర్లు అనేక రకాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నారని, ప్రభుత్వం చేపట్టే హెల్త్ సర్వేలు, కంటి వెలుగు, పల్లె దవాఖాన పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారిని నియమించేటప్పుడు మాతా శిశు మరణాలు రాయడానికి వస్తే చాలని, గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 25 ఇండ్లు విజిట్ చేస్తే చాలని చెప్పిందని, కానీ దానికి భిన్నంగా అనేక పనులు ...5లో

అందినకాడికి దోచుడే

నిఘా లేదు.. నియంత్రణ లేదు

- లోడింగ్‌ల పేరుతో వసూళ్లు
- అధికారులు, కాంట్రాక్టర్ల సిండికేట్
- వేసవిలోనే సన్న ఇసుక కొరత
- వర్షాకాలంలో ఎలా?

'తెలంగాణ రాష్ట్రంలో ఇసుక మాఫియాకు చెక్‌పెట్టి ప్రతి ఇంటికి తక్కువ ధరకే ఇసుకను సరఫరా చేస్తాం. ఇసుక ధరలను అదుపులో పెట్టి ప్రతి సామాన్యునికి తక్కువ ధరకు ఇసుక అందిస్తాం'అని మంత్రి కేటీఆర్ పలుమార్లు ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇసుక మాఫియా కాంట్రాక్టర్ల రూపంలో రాజ్యమేలుతున్నది.

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంట్రాక్టర్లు చెప్పిందే వేదం, వాళ్లు ఎంతనుకుంటే అంత దోసుడే. ఈ దోపిడీ గురించి ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులు తప్పవు. అధికారులు సైతం కాంట్రాక్టర్లకే వంతపాడుతున్నారు. ఫలితంగా చిన్నచిన్న లారీ యజమానులకు ఇబ్బందులు తప్పడంలేదు.

డబుల్ ధమాక..

ఇసుక క్వారీలలో బడా కాంట్రాక్టర్లు అందినకాడికి దోచుకుంటున్నారు. అందుకు అధికారుల అండదండలు పుష్కలంగా ఉంటున్నాయి. ప్రభుత్వం 35టన్నులకు అనుమతిస్తే లారీలో 70టన్నులను నింపుతున్నారు.



రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కుంట్లం-2, పలుగుల, గుండ్రాజుపల్లి, పలుగుల-9, పలుగుల-10, భద్రాదికొత్తగూడెం జిల్లాలోని కత్తిగూడెం, వీరాపురం, ములుగు జిల్లాలోని అక్కనపెల్లి, మల్లారెడ్డిగూడెం, రాజపేట, కరీంనగర్, జోగులాంబగద్వాల్ జిల్లాలోని అనేక క్వారీల నుంచి హైదరాబాద్‌కు ఇసుకను సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజు ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకుని లారీలలో నగరానికి ఇసుకను తరలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 16 టైర్ల లారీలకు 35 మెట్రిక్ టన్నుల ఇసుకను, 14 టైర్ల లారీలకు 32, 12టైర్ల లారీలకు 26 మెట్రిక్ టన్నుల ఇసుకను పాసింగ్ విధానంతో కేటాయిస్తున్నది. అయితే కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై పాసింగ్ విధానానికి పాతరేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా 35 మెట్రిక్ టన్నులకు బదులు డబుల్ అంటే 70 మెట్రిక్ టన్నుల ఇసుకను తోడేస్తున్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి

ఇసుక ద్వారా ప్రభుత్వ ఖజానాకు వస్తున్న ఆదాయానికి అధికారులే గండి కొడుతున్నారు. వేసవికాలంలో ...7లో

సెప్టెంబర్ 17న కాంగ్రెస్ మ్యానిఫెస్టో

ఓబీసీ, మహిళ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డిక్లరేషన్లు విడుదల చేస్తాం

- సోమేష్‌కుమార్ నియామకంపై కోర్టుకు వెళ్తాం : ఇష్టాగోష్టిలో రేవంత్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రానున్న ఎన్నికల దృష్ట్యా సెప్టెంబర్ 17న కాంగ్రెస్ మ్యానిఫెస్టోను విడుదల చేస్తామని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అదే విధంగా ఓబీసీ, మహిళ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డిక్లరేషన్లు విడుదల చేస్తామన్నారు. హైదరాబాద్ ...5లో

కార్మిక సంఘాల పట్ల నిరంకుశత్వం

- సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా పోస్టల్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార స్వామి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేటు ఫ్యాక్టరీలలో కార్మికులు సమ్మెలు చేయకుండా ఆర్డినెన్స్ తీసుకొచ్చి అణచి వేస్తుందన్నారు. 80 శాతం ఉద్యోగుల మద్దతు కలిగి ఉన్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్, ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ గ్రూప్ సీ యూనియన్‌ల గుర్తింపును ప్రభుత్వం రద్దు చేయడం హేయమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి గుర్తింపును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్ సెక్రటరీకి మెమోరాండం ఇస్తామని తెలిపారు. 21న కామన్ పోస్టర్ రిలీజ్ చేస్తామని, 28న నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులు ధరించి మానవహారం నిర్వహిస్తామని, జూన్ 10న అన్ని సంఘాలతో కలిసి ధర్నా చేపట్ట నున్నట్టు ఆల్ ఇండియా పోస్టల్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి టి.సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు బోస్, ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు తిరుపతయ్య, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నాయకులు సుబ్బయ్య, మెడికల్ రిప్స్ అసోసియేషన్ నాయకులు ముకుంద్ కులకర్ణి, బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శ్రీరామ్, నాయకులు జి.కృష్ణ భగవాన్, బి.ఆనంద్ బాబు, ఎస్ఎ.నాయుడు, ఆర్.రాంరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రానికి 'మాల్దీవుల' జర్నలిస్టులు

అభివృద్ధి, సంక్షేమ పథకాల పరిశీలన



నవతెలంగాణ - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించేందుకు మాల్దీవుల దేశం నుంచి 17 మంది జర్నలిస్టుల బందం బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ జర్నలిస్టుల బందం నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటిం చనుంది. హైదరాబాద్ లోని భారత్ బయోటెక్, రెడ్డి ల్యాబ్స్, టీహబ్‌తో పాటు ఆయా ప్రదేశాలను సందర్శిస్తారు. ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో జర్నలిస్టు బందానికి సమాచార శాఖ, జాయింట్ డైరెక్టర్, ప్రెస్ అకాడమీ కార్యదర్శి నాగుళ్లపల్లి వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు.

బిల్కిస్ బానోకు బాసట

- సుప్రీంకోర్టుకు ప్రముఖుల బహిరంగ లేఖ
- సత్వరమే కేసును విచారించాలని వినతి

న్యూఢిల్లీ : గత ఇరవై సంవత్సరాలుగా న్యాయ వ్యవస్థపై నమ్మకంతో పోరాడుతున్న బిల్కిస్ బానోకు వేలాది మంది బాసటగా నిలుస్తున్నారు. తాజాగా మూడున్నర వేల మంది మహిళలు, పౌరులు, మేధావులు ఆమెకు మద్దతు తెలుపుతూ సుప్రీంకోర్టుకు బహిరంగ లేఖ రాశారు. బానో కేసు విచారణలో జరుగుతున్న జాప్యంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. బానోపై లైంగిక దాడికి పాల్పడి, జైలులో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న 11 మంది కామాంధులకు గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించిన విషయం తెలిసిందే. వీరి విడుదలను వ్యతిరేకిస్తూ బానో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే కేసు విచారణలో జరుగుతున్న జాప్యంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి కేసులను విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతించని పక్షంలో బాధిత మహిళలు ఎవరిని ఆశ్రయించాలంటూ బహిరంగ లేఖలో మహిళలు, పౌరులు ప్రశ్నించారు.

బహిరంగ లేఖపై రచయిత సయేదా హమీద్, చరిత్రకారులు ఉమా చక్రవర్తి, ఇర్ఫాన్ హబీబ్, పీయూసీఎల్ అధ్యక్షులు కవితా శ్రీవాత్సవ, కళాకారుడు మాయా కృష్ణారావు, సామాజిక కార్యకర్త అంజలీ భరద్వాజ్, సహేలీ ఉమెన్స్ రిసోర్స్ సెంటర్ ప్రతినిధి వాణీ సుబ్రమణ్యం, జేఎన్‌యూ ప్రొఫెసర్ నివేదితా మీనన్, భారతీయ మహిళల జాతీయ సమాఖ్య అధ్యక్షురాలు అన్నే రాజా తదితర ప్రముఖులు సంతకాలు చేశారు. బానో అభ్యర్థనను వెంటనే పరిశీలించాలని ఇప్పటివరకూ ఆరు వేల మంది పౌరులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బహిరంగ లేఖలు రాశారు. విచారణను అడ్డుకునేందుకు, పక్కదారి పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది తమకు ఆందోళన కలిగిస్తోందని బహిరంగ లేఖలో రచయితలు, మేధావులు, చరిత్రకారులు తెలిపారు.

'దేశ అత్యున్నత న్యాయస్థానంలో న్యాయం లభించకుండా చేసేందుకు తీవ్రమైన ప్రయత్నాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. బిల్కిస్ బానో ఇప్పటికీ న్యాయం కోసం నిరీక్షిస్తున్నారు. ఆమెకు న్యాయం జరుగుతుందని మేము ఇంకా ఆశాభావంతోనే ఉన్నాం' అని వారు ఆ లేఖలో తెలియజేశారు. బానోకు వారంతా సంఘీభావం ప్రకటించారు. లైంగిక దాడికి గురై న్యాయం కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. బానో ఇప్పటికే 20 సంవత్సరాలు న్యాయపోరాటం చేశారని, ఇకనైనా ఎటువంటి జాప్యం లేకుండా ఆమె అభ్యర్థనను మన్నించాలని వారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు.

నేడు దోస్త్ నోటిఫికేషన్

హైదరాబాద్ : డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యాశాఖ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లో విడుదల చేస్తారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియతోపాటు షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. మంగళవారం ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదలైన విషయం తెలి సిందే. ఇంటర్ ద్వితీయసంవత్సరంలో 2,95,550 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 1,64,598 మంది అమ్మాయిలు, 1,30,952 మంది అబ్బాయిలున్నారు. దీంతో డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

జూన్ 14 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల 14 నుంచి 22వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 14న ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్-ఏ), ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-1 (కాంపోజిట్ కోర్సు), ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-2 (కాంపోజిట్ కోర్సు), 15న సెకండ్ లాంగ్వేజ్, 16న థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్), 17న మ్యాథమెటిక్స్, 19న సైన్స్ (పార్ట్-1 ఫిజికల్ సైన్స్, పార్ట్-2 బయలాజికల్ సైన్స్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు), 20న సోషల్ స్టడీస్, 21న ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్), 22న ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం, అరబిక్) పరీక్షలుంటాయని వివరించారు.



లండన్‌లో కేటీఆర్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ - హైదరాబాద్

యూకే పర్యటనలో భాగంగా లండన్ చేరుకున్న మంత్రి కేటీఆర్‌కు ప్రవాస భారతీయులు బుధవారం ఘనస్వాగతం పలికారు. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఆయన యూకే పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈనెల 13 వరకు మంత్రి తన పర్యటనను కొనసాగిస్తారు. అందులో భాగంగా యూకేలోని పారిశ్రామిక దిగ్గజ సంస్థలతోపాటు వ్యాపార, వాణిజ్య సంఘాలతో ఆయన సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వివరించనున్నారు.

బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ గురుకులాల్లో ఆరు, ఏడు, ఎనిమిదో తరగతిలో ఖాళీల భర్తీ ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఈ మేరకు బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్య బట్టు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు 86.99 శాతం, ఏడో తరగతిలో ప్రవేశ పరీక్షకు 88.77 శాతం, ఎనిమిదో తరగతిలో ప్రవేశ పరీక్షకు 88.93 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 295 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 69,147 దరఖాస్తులొచ్చాయని, వారిలో 60,949 మంది హాజరయ్యారని తెలిపారు. ఆరో తరగతిలో 1,976 సీట్లు, ఏడో తరగతిలో 1,567 సీట్లు, ఎనిమిదో తరగతిలో 1,632 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

సృజనాత్మకం సైన్స్ బోధన

ఆ రకంగా బోధన జరిగే దేశాలు ఎంతో ప్రగతిని సాధించాయి.. : ప్రొఫెసర్ డాక్టర్ క్వాజీ అజ్హర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సైన్స్ తరగతులు సజీవమైన ఆనందమయ ప్రయోగశాలలుగా పరిశోధనా కేంద్రాలుగా మారినప్పుడే దేశం ఉజ్వలంగా ఎదుగుతుందని మిచిగన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.క్వాజీ అజ్హర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విజ్ఞానదర్శిని అధ్యక్షులు రమేష్ అధ్యక్షతన 'అమెరికాలో స్కూల్ సైన్స్ - పాఠ్యాంశాలు, పాఠ్యప్రణాళిక, పెడగాజీ ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్వాజీ అజ్హర్ మాట్లాడుతూ "సైన్స్ బోధన అనేది సృజనాత్మకంగా వైజ్ఞానికంగా ఉండాలి. వైజ్ఞానిక పద్ధతుల్లో బోధన జరిగే అమెరికా, జపాన్, జర్మనీ, చైనా వంటి దేశాలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రగతిని సాధిస్తున్నాయి. సైన్స్ నేర్చుకోవాలంటే ప్రతి అంశాన్ని ప్రయోగాత్మకంగా పరిశోధించి తెలుసుకోవాలి. సైన్స్ పద్ధతులను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలి..... " అని సూచించారు.

"అమెరికాలో నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రతి తరగతిలో సైన్స్ పద్ధతి అనేది ఒక పాఠ్యాంశంగా ఉంటుంది. పై తరగతికి పోయినా కొద్దీ బోధనా ప్రమాణాలు, పద్ధతులు పెరుగుతాయి. సైంటిస్టులు తమ ప్రయోగశాలలో ఏ విధంగా పరిశోధనలు చేస్తారో విద్యార్థులు తరగతి గదిలో అదే విధంగా పరిశోధనాత్మక విద్యను నేర్చుకుంటారు. మన దేశంలో పద్యాలను బట్టి పట్టినట్టు సైన్సును లేదా సైన్స్ సూత్రాలను వివరించి దాని కోసం ఒక ప్రయోగం చేసి చూపిస్తారు. ఇదే బోధన పద్ధతి మన కరికులంలో భాగంగా ఉంది. టీచర్లు చెప్తుంటే విద్యార్థులు వినడం మాత్రమే మన దగ్గర ఉంటుంది. కానీ అమెరికా సైన్స్ బోధన విధానాన్ని పరిశీలిస్తే అందుకు భిన్నంగా ఉంటుంది. టీచర్ సైన్స్ నేర్చుకునే విద్యార్థులకు ఫెసిలిటేటర్‌గా మాత్రమే ఉంటారు. విద్యార్థులు స్వయంగా తామే ప్రయోగాలు చేస్తూ పరిశోధనలు చేస్తారు. ఏదైనా సందేహాలు తలెత్తితే నివృత్తి చేయడానికి మాత్రమే టీచర్లు వారి వెనకాల ఉంటారు. విద్యార్థులు స్వయంగా చేస్తూ నేర్చుకుంటారు. అందుకే ఆ బోధనా విధానాన్ని అనుసరిస్తారు. దానికి అనుగుణంగానే పాఠ్యప్రణాళికలు, పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులను రూపొందిస్తారు. అందుకే అమెరికాలో ఎందరో నోబెల్ బహుమతి గ్రహీతలు తయారవుతుంటారు. అక్కడ సైన్స్ కూడా వేగంగా ఎదుగుతున్నది.... " అని తెలిపారు.

"సైన్స్ నేర్చుకోవడంలో మాతృభాష కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పిల్లలకు తమ రోజువారి జీవితంలో వాడే భాష సైన్స్ సులభంగా నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. ఫిన్లాండ్ విద్యారంగంలో అగ్రగామిగా ఉండడానికి కారణం మాతృభాషలో బోధనే. భారతదేశంలో సైన్స్ బోధన పద్ధతి పూర్తిగా మారాల్సిందే. ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులను నేర్చుకునివిద్యార్థులను వైజ్ఞానికంగా తీర్చిదిద్దాలి. వైజ్ఞానిక దక్పథాన్ని ప్రతి ఒక్క విద్యార్థికీ అలవర్చాలి. అందుకు ఉపాధ్యాయులు సృజనాత్మకంగా వైజ్ఞానిక పద్ధతుల్లో కషి చేయాలి.... " అని డాక్టర్ క్వాజీ అజ్హర్ పిలుపునిచ్చారు. ఈ సదస్సులో విజ్ఞాన దర్శనీ ప్రధాన కార్యదర్శి విజయ కందుకూరి, కోర్ టీం మెంబర్ శోభారాణి, నాయకులు రామకృష్ణ, యాదగిరి, పాఠ్యపుస్తక రచయితలు విజయ ప్రతాప్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు

బండి సంజయ్‌కి నిలువెల్లా విషం, విద్వేషం

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిలువెల్లా విషం, విద్వేషం చిమ్మే చిల్లర నేత అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ, బండి సంజయ్ అబద్ధాలకు అవిభక్త కవలలు అనీ, చదువుసంధ్యలు లేని సన్నాసి, తలబిరుసు దురహంకారి, తెలంగాణ రాష్ట్ర అభివద్ధి నిరోధక విద్రోహి అంటూ బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో తీవ్రంగా ఫైర్ అయ్యారు. తెలంగాణ పాటపైనే కాదు ఆట పైనా గతంలో ఇలాంటి తీట మాటలే మాట్లాడాడనీ, హైదరాబాద్ స్పోర్ట్స్ హబ్ అని కేంద్ర ప్రభుత్వం కొనియాడిన విషయం తెలీదా అని ప్రశ్నించారు. క్రీడల్లో తెలంగాణ ఫస్ట్ ఉందనీ, రాజకీయ రాక్షస క్రీడలో మోడీ ఛాంపియన్ అనీ ఎద్దేవా చేశారు. దమ్ముంటే మోడీ హైదరాబాద్ ఎంపీ స్థానంలో పోటీ చేసి గెలవాలని సవాలు విసిరారు. కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ ట్రూత్ లెస్, యూజ్ లెస్ అంటూ విమర్శించారు. అది నిరుద్యోగుల ఓట్లు దండుకొని ఉడాయించే డిక్లరేషన్ అంటూ ఎద్దేవా చేశారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థినుల ఆత్మహత్య



నవతెలంగాణ-వనస్థలిపురం

ఇంటర్ పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని ఒకరు, ఫెయిలయ్యానని మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు హైదరాబాద్‌లో జరిగాయి. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వనస్థలిపురం మెడికల్ హెల్త్ కాలనీలో నివసిస్తున్న వేముల వెంకన్న కుమార్తె వేముల గాయత్రి(17) హస్తినాపురంలోని నవీన జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివింది. మంగళవారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో ఆమె ఉత్తీర్ణత సాధించలేదు. దాంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.అలాగే, రాయ దుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివిన శాంత కుమారికి మార్కులు తక్కువ వచ్చాయి. దాంతో తాము ఉంటున్న బిల్డింగ్ నాలుగో అంతస్తు నుంచి దూకింది. తల్లిదండ్రులు వెంటనే విద్యార్థిని ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించండి

సీఎం కేసీఆర్‌కు ఉత్తమ్ లేఖ

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

జూనియర్ పంచాయతీ సెక్రెటరీలను క్రమబద్ధీకరించాలని ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం ఈమేరకు సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో గత 13 రోజుల నుంచి పంచాయితీ కార్యదర్శులు సమ్మె చేస్తున్నారని గుర్తు చేశారు. న్యాయపరమైన డిమాండ్లే కాబట్టి తక్షణమే వారికి మీరిచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ్‌తో ఆస్ట్రేలియా అంబాసిడర్ భేటీ

ఆస్ట్రేలియా అంబాసిడర్ బృందం బుధవారం ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయ్యారు. శాలువా కప్పి స్వాగతం పలికారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. గాంధీభవన్ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని పరిశీలించారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఆస్ట్రేలియా హై కమిషనర్ భేరి ఓ ఫెరల్, ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ సారాకిర్లె, జాక్ టేలర్ పాల్గొన్నారు.

ఇదో విప్లవాత్మక పథకం

రైతుబంధు పథకానికి ఐదేండ్లు

- అత్యంత ప్రభావితం చేసే పథకాలలో ఇదొక్కటి : ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

వ్యవసాయరంగంలో ఒక విన్నూత్నమైన, విప్లవాత్మకమైన రైతుబంధు పథకానికి నేటితో ఐదేండ్లు పూర్తయిందని రైతు బంధు సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే చెరువుల మరమ్మతులు, పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయడం, కొత్త ప్రాజెక్టులు నిర్మించడం, ఆ తర్వాత పెట్టుబడి సాయమందించడం ద్వారా వ్యవసాయాన్ని పండుగలా చేయవచ్చునే లక్ష్యంతోనే ఈ పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంవత్సరానికి ఎకరాకు రూ.10వేల చొప్పున 70 లక్షల మంది రైతులకు 10 విడుతల్లో 65,500 కోట్లు అందించడం జరిగిందని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే మొదలుపెట్టిన ఈ పథకాన్ని ప్రపంచంలోనే అత్యంత ప్రభావితం చేసే పథకాలలో ఇదొక్కటని పలువురు ప్రముఖులు కీర్తించారని గుర్తు చేశారు. పంట విస్తీర్ణంలో 2014–15లో 131.34 లక్షల నుంచి 2022 – 23 లో 209 లక్షల ఎకరాలకు పెరిగిందని తెలిపారు. వరి దిగుబడిలో ప్రథమ స్థానానికి చేరుకుందని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 7000పైగా వరి ధాన్య సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ఇంతటి అద్భుతమైన పథకాన్ని రాష్ట్ర రైతాంగానికి అందించిన సీఎం కేసీఆర్‌కు యావత్ తెలంగాణ రైతాంగం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

రైతన్నను రాజును చేసింది

మంత్రి హరీశ్ రావు ట్వీట్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

సీఎం కేసీఆర్ ఆలోచనతో ప్రారంభించిన రైతుబంధు వ్యవసాయాన్ని పండగ చేసి రైతన్నను రాజును చేసిందంటూ ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ట్వీట్ చేశారు. ఏడాదికి ఎకరాకు 10వేల చొప్పున ఇప్పటి వరకు 10 విడతల్లో రూ.65వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసి, అద్భుతమైన రైతు సంక్షేమ పథకంగా దేశానికి రోల్ మోడల్ అయిందని పేర్కొన్నారు. అందుకే సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలు, ఎత్తుకున్న జాతీయ నినాదం దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరినీ ఆలోచింప చేస్తున్నాయని పేర్కొన్నారు. అబ్ కీ బార్...కిసాన్ సర్కార్ అంటూ బీఆర్ఎస్‌ను స్వాగతిస్తున్నాయని పేర్కొన్నారు.

బోధన్ నుంచి మద్నూర్ వరకు నాలుగు లేన్ల రోడ్డు మంజూరు

- ఎంపీ బి.బి పాటిల్ చొరవకు మంత్రి వేముల అభినందన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి – హైదరాబాద్:

నిజామాబాద్,కామారెడ్డి జిల్లాల్లోని బోధన్ నుంచి మద్నూర్ వయా రుద్రూర్ వరకు(ఎన్‌హెచ్–63) 38 కిలోమీటర్ల పొడవు గల డబుల్ లేన్ రోడ్డును నాలుగు లేన్ల జాతీయ రహదారిగా మార్చేందుకు కృషి చేసిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు ఎంపీ చూపిన ప్రత్యేక చొరవ పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ 38 కి. మీ డబుల్ లేన్ రోడ్డు రూ. 750 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డుగా అభివృద్ధి చెందనుందన్నారు.

సంపాదకీయం


గొయ్యిని పూడ్చేదెవరు?

"అందరూ శాఖాహారులే... కానీ రొయ్యలబుట్ట మాత్రం మాయమైంది" అన్న చందంగా ఉంది మన నేతల తీరు! ఇప్పుడు అన్ని పార్టీలూ, వాటి నేతలందరూ జనానికి హామీల మీద హామీలు గుప్పించేవారే... కానీ విచిత్రమేమంటే వాటిలో ఏ ఒక్కటీ ఆచరణలో నెరవేరదు! తెలంగాణలోని నిరుద్యోగులను ఇప్పుడు కలవరపెడుతున్న

> సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి గతంలో చెప్పిన ఈ మాట అక్షర సత్యం. అందుకే 'నిరుద్యోగం' అనే పెద్ద గొయ్యి రాష్ట్రంలో ఉందనీ, దాన్ని పూడ్చాలనీ నేతలందరికీ తెలుసు. కానీ దాన్ని పూడిస్తే తర్వాతి ఎన్నికల్లో వారికి చెప్పుకోవటానికి ఏమీ మిగలదు. అందుకే 'ఆ గొయ్యి...' అలాగే ఉండాలని వారు కోరుకుంటారు. మరి దాన్ని పూడ్చాలంటే, పాలక పార్టీల మెడలు వంచి గొయ్యిని పూడ్చేలా చేయాలంటే ఎలాంటి పోరాటాలు నిర్వహించాలనేది తెలంగాణ యువతరం, ఇక్కడి నిరుద్యోగులే తేల్చుకోవాలి.

అంశమిదే. బీజేపీ, కాంగ్రెస్ మొదలుకుని బీఆర్ఎస్, టీడీపీ, వైఎస్సార్‌టీపీ వరకూ... చివరికి బీఎస్పీ, కేఏ పాల్ ప్రజాశాంతి పార్టీలకు కూడా ప్రస్తుతం రాష్ట్రంలోని నిరుద్యోగులే ఏకైక అజెండా. వారే ఆయా పార్టీలకు అణ్వస్త్రాలు.. అణ్వాయుధాలు. 'మేం అధికారంలోకొస్తే నిరుద్యోగులకు అది చేస్తాం.. ఇది చేస్తాం.. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం..' అనటం అన్ని పార్టీలకూ ఆనవాయితీగా మారింది.

రానున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా 'యూత్ డిక్లరేషన్...' పేరుతో కాంగ్రెస్ ఇటీవల నిర్వహించిన బహిరంగ సభలో నిరుద్యోగులకు వరాల జల్లు కురిపించింది. తమ పార్టీ అధికారంలోకి వస్తే తొలి ఏడాదే రెండు లక్షల కొలువులను భర్తీ చేస్తామంటూ పీసీసీ అధ్యక్షుల వారు నొక్కి వక్కాణించారు. ఇక్కడ చిత్ర విచిత్రమేమంటే... 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో అటు దేశాన్ని, ఇటు రాష్ట్రాన్ని అత్యధిక కాలం ఏకఛత్రాధిపత్యంగా ఏలింది ఈ హస్తం పార్టీయే కదా. అలాంటప్పుడు ఈ 'నిరుద్యోగ భారతానికి...' అసలు సిసలు కారకులెవరనే దానికి ఆ పార్టీ ఏం సమాధానం చెబుతుంది..? అలాంటప్పుడు తెలంగాణలోని నిరుద్యోగులు ఆ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మగలరా..? అనేది ప్రశ్నార్థకం.



ఇక 'దేశం కోసం' ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మటం... మత పిచ్చి లేపి పబ్బం గడుపుకోవటమే 'ధర్మం'గా భావించే కాషాయ పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలు నిరుద్యోగం గురించి మాట్లాడుతుంటే ఆ మాటలు విని 'మేధావులు.. విజ్ఞులు' సొమ్మసిల్లి పడిపోతున్నారు. 'మిత్రోన్...' అంటూ తన ప్రసంగాలను మొదలుపెట్టే ప్రధాని మోడీ... ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని 'హుళక్కనిపించి' మిత్ర ద్రోహానికి ఒడిగట్టారు. అతడి కంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్టు... బీజేపీ రాష్ట్ర చీఫ్ బండి సంజయ్... 'తెలంగాణలో అధికారం లోకి వస్తే ఏటా రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తాం...' అంటూ ఇటీవల బల్లగుద్ది మరీ చెప్పారు. తొమ్మిదేండ్ల నుంచి కేంద్రంలో అదే కమలం పార్టీ అధికారంలో ఉంది.. అలాంటప్పుడు ఖాళీలను ఎవరు భర్తీ చేయొద్దన్నారు..? ఎవరు ఉద్యోగాలివ్వొద్దని అన్నారు...? ఎవరైనా ఇలా ప్రశ్నిస్తే దేశద్రోహులైపోవటం ఖాయం. అయినా మోడీ వాగ్దానమే గాలికి కొట్టుకుపోయినప్పుడు... బండి గారి హామీ గురించి మాట్లాడటం తెలివి తక్కువతనమే అవుతుంది.

ఇక రాష్ట్రాన్ని తొమ్మిదేండ్ల నుంచి ఏకధాటిగా ఏలుతున్న గులాబీ పార్టీ... గత అసెంబ్లీ (2018) ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి అనే కొంగొత్త ప్రామీస్‌ను తెరపైకి తెచ్చి ఓట్లేయించుకుంది. ఆ తర్వాత దాని గురించి పాత్రికేయులు గుచ్చి గుచ్చి అడిగినా ఏలికల వద్ద సరైన ఆన్సరే లేకపాయే! పైగా అడిగినా ప్రతీసారీ... 'రాష్ట్రంలో నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారనే దానిపై లెక్కలు తీస్తున్నాం...' అని ఒకసారి, 'నిరుద్యోగ భృతికి విధి విధానాలు రూపొందిస్తున్నాం...' అని మరోసారి చెప్పి చేతులు దులుపుకోవటం మినహా చేసిందేమీ లేదు. ఈ లోపు శాసనసభకు మళ్లీ ఎన్నికలు వస్తుండటంతో వెయ్యక వెయ్యక ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తే అదికాస్తా టీఎస్‌పీఎస్సీ నిర్వాకం వల్ల పేపర్లు లీకై... అభ్యర్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ఇప్పటి వరకూ భర్తీ చేశామని చెబుతున్న సుమారు లక్షా 40వేల కొలువుల్లో అన్నింటికి అన్నీ శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసిన ఉద్యోగాలు కావనేది మనం గుర్తించాల్సిన అంశం.

ఈ రకంగా రాష్ట్రంలో కొలువుల భర్తీ అనేది అన్ని రాజకీయ పార్టీలకు ఒక చికెన్ ముక్కలా.. మటన్ ముక్కలా మారింది. అవసరం, అవకాశం వచ్చినప్పుడు ఆ ముక్కల్ని నంజుకు తినటం, ఆ తర్వాత కూరలో కరివేపాకులా నిరుద్యోగుల్ని తీసి పారేయటం ఆయా పార్టీలకు షరా మామూలైంది. 'మనం నడిచే దారిలో ఒక గొయ్యి ఉంది. అక్కడి నుంచి వెళ్లే వారందరూ దాన్ని పూడుస్తామంటూ ఫోజులు కొడుతూ ఉంటారు. కానీ ఎవ్వరూ ఆ పని చేయరు. ఎందుకంటే... దాన్ని ఈ రోజు పూడిస్తే.. రేపు పూడుస్తామని చెప్పటానికి, ఆ రకంగా ఫోజులు కొట్టటానికి వారికి ఏమీ మిగలదు కాబట్టి...' సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి గతంలో చెప్పిన ఈ మాట అక్షర సత్యం. అందుకే 'నిరుద్యోగం' అనే పెద్ద గొయ్యి రాష్ట్రంలో ఉందనీ, దాన్ని పూడ్చాలనీ నేతలందరికీ తెలుసు. కానీ దాన్ని పూడిస్తే తర్వాతి ఎన్నికల్లో వారికి చెప్పుకోవటానికి ఏమీ మిగలదు. అందుకే 'ఆ గొయ్యి...' అలాగే ఉండాలని వారు కోరుకుంటారు. మరి దాన్ని పూడ్చాలంటే, పాలక పార్టీల మెడలు వంచి గొయ్యిని పూడ్చేలా చేయాలంటే ఎలాంటి పోరాటాలు నిర్వహించాలనేది తెలంగాణ యువతరం, ఇక్కడి నిరుద్యోగులే తేల్చుకోవాలి.

కార్పొరేట్లకు లాభాల పంట! విత్తన రైతులకు కష్టాల తంటా!!

తెలంగాణ రాష్ట్రంలోని సాగు భూముల స్వభావం, వాతావరణం విత్తనోత్పత్తికి అనుకూలమైనది. రబీ సీజన్‌లో గాలిలో తేమ శాతం 72 నుంచి 80శాతం వరకు, పగటి ఉష్ణోగ్రత 24 నుంచి 30డిగ్రీల సెంటీగ్రేడ్ ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో తేడా 8-10డిగ్రీల సెంటీగ్రేడ్, 35డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే తక్కువగా ఉంటే వరి హైబ్రిడ్ విత్తన దిగుబడి గణనీయంగా ఉంటుంది. అందుకే తెలంగాణ సీడ్ బౌల్ ఆఫ్ ద వరల్డ్, సీడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా పేరు పొందింది. ముఖ్యంగా కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు సాధారణ రకాలు ఓపెన్-పాలినెటెడ్(ఓపీ) వరి విత్తనాలు హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తిని సాగు చేస్తున్నారు. రబీ పంట కాలంలో హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తికి అనుకూలమైనది. ఈ కాలంలో ఆడ, మగ రకాలు పుష్పించే దశలో వర్షాల బారిన పడవు. తద్వారా అధిక, మంచి నాణ్యత కలిగిన విత్తనాలను పొందవచ్చు. విత్తన ఉత్పత్తికి ఉపయోగపడే ఈ సహజ సిద్ధమైన తెలంగాణ ప్రాంతంలోని వాతావరణ అనుకూలత రైతుల ఆర్థిక అభివృద్ధి తోడ్పడటానికి బదులుగా కేంద్ర, రాష్ట్ర



గీట్ల ముకుందరెడ్డి

> ముఖ్యమంత్రి కేసీఆర్ "తెలంగాణ సీడ్ బౌల్" వంటి మాటలు చెబితే సరిపోదు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని బలోపేతం చేయాలి. రీసెర్చ్‌కు అధిక నిధులు కేటాయించాలి. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థను బలోపేతం చేయాలి. రైతులను మోసం చేస్తున్న సీడ్ కంపెనీలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. అగ్రికల్చర్ శాఖకు, మార్కెటింగ్‌శాఖకు పర్యవేక్షణ, నియంత్రణ అధికారాలివ్వాలి.అప్పుడైనా రాష్ట్రంలో రైతులకు భరోసా ఇచ్చినట్టు అవుతుంది.

ప్రభుత్వాల విధానాల కారణంగా జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు, కొద్దిమంది స్థానిక సీడ్ మిల్లు యజమానుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నది.

రైతులను మోసం చేస్తున్న సీడ్‌మిల్స్

లోకల్ సీడ్(ఓపీ) వరి విత్తనం ఎకరానికి 30 క్వింటాళ్లు (40 బస్తాలు రబీ సీజన్లో, 30బస్తాలు వానకాలం సీజన్లో) దిగుబడి వస్తుంది. ఒక ఎకరానికి విత్తనం దొడ్డు రకం 30కేజీలు, సన్నరకం 25కేజీలు అవసరం పడుతుంది. ఎకరా పెట్టుబడి సుమారు 30వేలు వస్తుంది. కౌలు భూమి అయితే రూ.12 నుండి 15 వేలు అదనం. పంట కాలం దొడ్డు రకాలు 125రోజులు, సన్న రకాలు 135రోజులు. ఈ సీజన్లో సీడ్ మిల్ యజమానులు ఏకపక్షంగా విత్తన రైతుల నుండి కొనుగోలు చేస్తామని ప్రకటించిన రేట్లు క్వింటాల్‌కు ఎన్ఎల్ఆర్ 34449(రకం), ఇతర అన్ని దొడ్డు రకాలకు రూ.2080, జెజిఎల్1798, జెజిఎల్384, కెఎన్ఎం1638 రూ.2,150తో తీసు కుంటున్నారు. బీపీటీ 5204 రూ.2,200, ఆర్ఎన్ఆర్15048 అండ్ హెచ్ఎంటీ రూ.2300 సీడ్ కంపెనీలు విత్తనాలు అమ్మే ధరలతో పోలిస్తే, వీరు రైతు నుండి కొనే ధర చాలా తక్కువ. అంతేకాకుండా క్వింటాలుకు 4కిలోల తరుగు కింద తీస్తున్నారు. రూ.50 హమాలీ చార్జీల కింద కట్ చేస్తున్నారు. డబ్బులు చెల్లించడానికి నెల నుండి రెండు నెలల సమయం తీసుకుంటున్నారు. విత్తనం కోసం ఇచ్చిన ధాన్యానికి డబ్బులు కట్ చేసుకుంటారు. సీడ్ సాగు చేసే ముందు రైతులకు అనేక మాయ మాటలతో ప్రోత్సహిస్తారు. తీరా పంట చేతికి వచ్చిన తర్వాత విత్తన రైతులను మోసం చేయడం సర్వ సాధారణంగా జరుగుతున్నది. సీడ్ డీలర్ల, ఆర్గనైజర్ల మోసాలు తక్కువేం కాదు. కొంతమంది సీడ్ డీలర్లు, ఆర్గనైజర్లు ఇటు రైతులకు అటు సీడ్ మిల్ యజమానులకు శఠగోపం పెట్టడం చూస్తూనే ఉన్నాం. రైతులకు పెట్టుబడి కోసం ఇచ్చే అప్పులపై మూడు శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. మరి ముఖ్యంగా బ్యాంకుల నుండి పంట రుణాలు పొందే అవకాశం లేని కౌలు రైతులు వీరి బారిన పడుతున్నారు. సీడ్ కంపెనీలు మార్కెట్లో తిరిగి అమ్మేటప్పుడు మాత్రం సాధారణ రకం వరి విత్తనాలు క్వింటాలకు రూ.32 వందల నుండి 10వేల వరకు అమ్ము తున్నారు. కంపెనీలు విత్తనాలు ప్రాసెస్ క్రమంలో ఖర్చులు క్వింటాల్‌కు సగటున రూ.300 వస్తుంది. దొడ్డు రకాలకు 10శాతం, సన్న రకాలకు 20శాతం తరుగు పోతుంది. ప్రాసెస్ ఖర్చులలో సగం, ఆపైగా డబ్బులు రైతుల నుండి కట్ చేసే దాన్యం, హమాలీ చార్జీల కటింగ్ రూపంలో రికవరీ అవుతాయి. రైతుల నుండి కంపెనీలు కొంటామని ప్రకటించిన ధరలకు అదనంగా క్వింటాలకు రూ.300 నుండి 500 ఇచ్చినప్పటికి, విత్తనాల అమ్మకం ధర క్వింటాల్‌కు రూ.100-200 తగ్గించినప్పటికీ కంపెనీలకు మంచి లాభాలు ఉంటాయి. రైతులకు న్యాయమైన ధరలు ఇవ్వకపోవడం కాకుండా సీడ్ మిల్లులో పనిచేసే శ్రామికుల శ్రమదోపిడీ తీవ్రంగా ఉన్నది. అంతర్ రాష్ట్ర వలస హమాలీ కార్మికులకు ఒప్పందం ప్రకారం రేట్లు ఇవ్వడం లేదు. సగం మాత్రమే ఇస్తున్నారు. లేబర్‌కు, దినసరి కూలీలకు ఇస్తున్నది రోజుకు రూ.280 మాత్రమే. ప్రమాదాలు జరిగి గాయాలైతే ట్రీట్‌మెంట్ కూడా అందించడం లేదు. చనిపోతే కుటుంబ సభ్యులను తోటి కార్మికులను బెదిరించి స్వగ్రామాలకు పంపిస్తున్నారు.

యాజమాన్య పద్ధతుల ద్వారా హైబ్రీడ్ సాగు అవసరం

మగ, ఆడగా పిలువబడే హైబ్రిడ్ వరి విత్తన ఉత్పత్తి ఖర్చు ఒక ఎకరాకు రూ.35 నుండి 40వేలు వస్తుంది. ఒక ఎకరాకు దిగుబడి వెరైటీని బట్టి 6, 10, 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పంట కాలం 5 నెలల 15రోజులు. సీడ్ కంపెనీలు క్వింటాలకు రూ.5 నుండి 9 వేలకు కొంటున్నాయి. క్వింటాలుకు 10కేజీలు కటింగ్ చేస్తున్నారు. హైబ్రిడ్ మొక్క ఎదుగుదలకు ఉపయోగించే Gibberellic acid (GA3) డబ్బులు రైతుల నుంచి కట్ చేస్తారు. ఎన్ని డబ్బులు కట్ చేస్తున్నారో రైతులకు స్పష్టంగా తెలియచేయరు. హైబ్రీడ్ వరి విత్తనం ఉత్పత్తిలో రైతులకు రిస్క్ ఎక్కువ ఫలితం తక్కువగా ఉన్నది. హైబ్రిడ్ వరి విత్తనాలను కంపెనీలు ప్రధానంగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. క్వింటాలుకు 5వేల నుండి 50వేలు, ఆపైన కూడా అమ్మగల సీడ్ కంపెనీలు ఉన్నాయి. బాస్మతి వరి సీడ్ సాగు విస్తీర్ణం కరీంనగర్ జిల్లాలో ఇటీవల సంవత్సరాలలో పెరుగుతుంది. ఖర్చు ఎకరాకు సుమారు రూ.15వేలు వస్తుంది. ఎకరాకు 22 నుండి 24 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటాల్‌కు రూ.2600లకు కొంటున్నారు. క్వింటాల్‌కు 10కిలోలు కటింగ్ చేస్తున్నారు. విత్తనం గింజల కింద ఎకరానికి రూ.1000 కటింగ్ చేస్తారు. బెరికికి గాను ఎకరానికి రూ.1200 కటింగ్ చేస్తున్నారు. మన దేశంలో వరి ప్రధాన ఆహార పంట. సుమారు 44మిలియన్ హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 3శాతం (1.32 మి.హెక్టార్లలో) హైబ్రిడ్ వరిని సాగు చేస్తున్నారు. పెరుగుతున్న జనాభాకనుగుణంగా 2025 వరకు వరి ఉత్పత్తిని 130మిలియన్ టన్నుల వరకు అభివృద్ధి చేయాల్సి ఉంది. దిగుబడి పెంచాలంటే ఇతర యాజమాన్య పద్ధతులతో పాటు హైబ్రిడ్ వరి విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉంది. దీనిని సాధించాలంటే సాగుచేసే విస్తీర్ణంలో సరాసరి 20శాతం వరకు హైబ్రిడ్ వరిని సాగుచేసుకోవాలి. హైబ్రిడ్ వరి విస్తీర్ణం పెంచాలంటే అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన హైబ్రిడ్ విత్తనం రైతులకు అందించాలి. మన దేశంలో సుమారు 40కి పైగా వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తిని చేస్తున్నాయి. విత్తనాల నాణ్యత పైనే దిగుబడి



పెరుగుదల, ఎరువులు, పురుగుమందుల వాడకం ఆధారపడి ఉంటాయి. దేశ అవసరాల్లో 60శాతం వరి విత్తనాలు తెలంగాణ నుంచి సరఫరా అవుతున్నాయి. దేశంలో సాగయ్యే అన్ని పంటల విత్తనాలు 40శాతం, హైబ్రిడ్‌లో 50శాతం తెలంగాణలో ఉత్పత్తి అవుతున్నాయి. 14 దేశాలకు విత్తనాలు ఎగుమతి అవుతున్నాయి. హైబ్రిడ్ వరి విత్తనాల ఉత్పత్తులు కరీంనగర్ జిల్లా ముందంజలో ఉంది. 80వేల ఎకరాల్లో వరి విత్తనాలు పండిస్తుండగా, ఇందులో 25వేల ఎకరాల్లో హైబ్రిడ్ రకాలు పండిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ విత్తన సంస్థలు ఇక్కడ తమ ఉత్పత్తులు చేస్తున్నాయి.

'తెలంగాణ సీడ్ బౌల్'ను బలోపేతం చేయాలి

సీడ్ కంపెనీలు మార్కెట్లో విక్రయించే విత్తనాలు రైతులు పండించే విత్తనాలు సాధారణంగా "సర్టిఫైడ్ విత్తనాలు". విత్తనాల సర్టిఫైడ్ అనేది పంటలను పండించడానికి

> రైతులకు న్యాయమైన ధరలు ఇవ్వకపోవడం కాకుండా సీడ్ మిల్లులో పనిచేసే శ్రామికుల శ్రమదోపిడీ తీవ్రంగా ఉన్నది. అంతర్ రాష్ట్ర వలస హమాలీ కార్మికులకు ఒప్పందం ప్రకారం రేట్లు ఇవ్వడం లేదు. సగం మాత్రమే ఇస్తున్నారు. లేబర్‌కు, దినసరి కూలీలకు ఇస్తున్నది రోజుకు రూ.280 మాత్రమే. ప్రమాదాలు జరిగి గాయాలైతే ట్రీట్‌మెంట్ కూడా అందించడం లేదు. చనిపోతే కుటుంబ సభ్యులను తోటి కార్మికులను బెదిరించి స్వగ్రామాలకు పంపిస్తున్నారు.

ఉపయోగించే విత్తనాల నాణ్యత నియంత్రణ కోసం చట్టబద్ధంగా మంజూరు చేయబడినది. సర్టిఫైడ్ విత్తనాలు మెరుగైన దిగుబడి, చీడపీడల నిరోధకత, కరువును తట్టుకునే శక్తి, కలుపు సంహారకాలను తట్టుకునే శక్తి మొదలైన లక్షణాలను కలిగి ఉండాలి. విత్తనాలు ఈ లక్షణాలను పొందడానికి కొన్ని సంవత్సరాల పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) ఫలితం. విత్తన వర్గాలు ప్రధానంగా ఐదు ఉన్నాయి. న్యూక్లియస్ సీడ్స్, బ్రీడర్స్ సీడ్స్, ఫౌండేషన్ సీడ్స్, రిజిస్టర్డ్ సీడ్స్, సర్టిఫైడ్ సీడ్స్. న్యూక్లియస్ సీడ్ జన్యుపరంగా స్వచ్ఛమైన విత్తనం. విత్తన అభివృద్ధిలో ఈ దశ అత్యంత ముఖ్యమైన దశ. బ్రీడర్స్ సీడ్ అనేది న్యూక్లియస్ సీడ్ సంతానం. మన దేశంలో బ్రీడర్ విత్తనాలను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, నేషనల్ సీడ్స్ కార్పొరేషన్, దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఉత్పత్తి చేస్తాయి. బ్రీడర్ సీడ్ సంతానాన్ని ఫౌండేషన్ సీడ్ అంటారు. ఫౌండేషన్ సీడ్స్ ఉత్పత్తి తప్పనిసరిగా సర్టిఫైడ్ ఏజెన్సీ ఆమోదయోగ్యంగా ఉండాలి. సర్టిఫైడ్ ఏజెన్సీ నిర్దేశాలకు అనుగుణంగా సర్టిఫైడ్ సీడ్స్‌ను పండించే పంపిణీ చేసే వ్యక్తి లేదా కంపెనీని సర్టిఫైడ్ సీడ్ ప్రొడ్యూసర్ అంటారు. రిజిస్టర్డ్ సీడ్స్ ఫౌండేషన్ సీడ్ సంతానం. సర్టిఫైడ్ సీడ్స్ ఇది చివరి దశ, ఇది రైతుకు చేరుతుంది. 1966లో నిర్దేశించిన విత్తన సర్టిఫైడ్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. విత్తన ప్రాసెసింగ్ కంపెనీలపై వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖల నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడం వలన సీడ్ కంపెనీలు తమ ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. నకిలీ విత్తనాలతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్న ఘటనలు అనేకం జరుగు తున్నాయి. సీడ్ కంపెనీలు ఎంతమంది రైతులకు సీడ్ ఇచ్చింది. రైతులతో చేసుకున్న ఒప్పందాలు ఏమిటి? తదితర వివరాలు ఏవి కూడా వ్యవసాయ శాఖ నమోదు చేయడం లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ "తెలంగాణ సీడ్ బౌల్" వంటి మాటలు చెబితే సరిపోదు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని బలోపేతం చేయాలి. రీసెర్చ్‌కు అధిక నిధులు కేటాయించాలి. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థను బలోపేతం చేయాలి. రైతులను మోసం చేస్తున్న సీడ్ కంపెనీలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. అగ్రికల్చర్ శాఖకు, మార్కెటింగ్‌శాఖకు పర్యవేక్షణ, నియంత్రణ అధికారాలివ్వాలి.అప్పుడైనా రాష్ట్రంలో రైతులకు భరోసా ఇచ్చినట్టు అవుతుంది.

సెల్: 9490098857



దిగజారుతున్న 'పత్రికా స్వేచ్ఛ'

అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్న భారతదేశంలో నానాటికీ పత్రికా స్వేచ్ఛ పరిస్థితి దారుణంగా దిగజారిపోతుండడం విషాదకరం. రిపోర్టర్స్ విత్‌ఔట్ బార్డర్స్ (ఆర్.ఎస్.ఎఫ్) అనే సంస్థ రాజకీయ, ఆర్థిక, లెజిస్లేటివ్, సామాజిక, భద్రతా సూచీలు అనబడే ఐదు అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకొని ప్రపంచ పత్రికా దినోత్సవం సందర్భంగా మే 3న విడుదల చేసిన ఆర్ఎస్ఎఫ్ 21వ ఎడిషన్ వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో 180 దేశాల జాబితాలో భారతదేశం అతి బలహీనమైన స్కోరుతో 161వ స్థానంలో నిలవడం దిగ్భ్రాంతిని కలిగిం చింది. వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారతదేశం 2016లో 133వ ర్యాంక్, 2017లో 136వ ర్యాంక్, 2018లో 138వ ర్యాంక్, 2019లో 140వ ర్యాంక్, 2020లో 142వ ర్యాంక్, 2021లో 142వ ర్యాంక్, 2022లో 150వ ర్యాంక్‌లని సాధించి ఇలా ప్రతి సంవత్సరం దిగజారుతూనే ఉంది. ఈ సంవత్సరం ఏకంగా గత సంవత్సరం కన్నా మరీ 11 స్థానాలు దిగజారి 161వ ర్యాంక్‌కి పడిపోయి అట్టడుగుకు నెట్టివేయబడడం తద్వారా భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ పరిస్థితులు ఎంతగా పతనమవుతున్నాయో అనే విషయం చాలా స్పష్టంగా విదితమవుతూనే ఉంది.

ముఖ్యంగా భారతదేశంలో ఇలా ప్రతి సంవత్సరం వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో ర్యాంకులు పడిపోవడమే తప్ప ఎగబాకిన దాఖలాలు లేకపోవడానికి 'నియంతృత్వ పాలకుల అణచివేత విధానాలే కారణ హేతువులు' అని చాలా స్పష్టంగా పేర్కొనవచ్చు. నేడు దేశవ్యాప్తంగా మీడియా సంస్థలు మొత్తం రాజకీయ రంగు పులుముకొని రాజకీయ నేతలతో సంబంధాలు ఉన్న వాణిజ్యవేత్తల నియంత్రణలోకి చేతులు మారడంతో పత్రికా స్వేచ్ఛ కొడిగట్టిన దీపంలా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూనే ఉంది. నియంతృత్వ ప్రభుత్వాల అనుకూల శక్తులు జర్నలిస్టులని ఒత్తిళ్లకు గురిచేయడమే కాకుండా వారిపై కఠిన ఆంక్షలు విధించడం, మహిళా జర్నలిస్టులపై చెప్పుకోలేని ఆకృత్యాలకు పాల్పడటం, జర్నలిస్టుల సమాచారాన్ని బహిరంగంగా ఆన్‌లైన్‌లో పొందుపరచి వారి గోప్యతకు తీవ్ర విఘాతాన్ని కలిగించడం ఇలా అనేక రకాలుగా అశాంతికి గురిచేయడం నిత్యకృత్యాలుగా కొనసాగుతుండడం విషాదకరం.



జె.జె.సి.పి.బాబూరావు
9493319690

'ఫ్రంట్ లైన్ వారియర్స్'గా పిలువబడి నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వాలు ఏనాడు పెద్దగా చర్యలు తీసుకోకపోగా తమకు అనుకూలంగా వ్యవహరించని వారిని అనునిత్యం పోలీస్ వేధింపులకు గురిచేస్తూ సివిల్, క్రిమినల్ కేసుల్లో అన్యాయంగా ఇరికిస్తూ వారిని అశాంతికి గురిచేయడం కడు విచా రకరం. మరీ ముఖ్యంగా ఏడాదికి సగటున నలుగురు జర్నలిస్టులు మరణించడం బాధాకరం. ఇలా అనేక మంది జర్నలిస్టులు విధి నిర్వహణలో ప్రాణాలు పోయినా కూడా ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం. అలాగే జర్నలిస్టులపై మరోపక్క మాఫియా బెదిరింపు ఘటనలు చోటుచేసుకోవడం ద్వారా విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి రావడం ఆందోళనాకరం. ఇలాంటి అమానుష ఘటనలు అన్ని జర్నలిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా అంతిమంగా పత్రికా స్వేచ్ఛను మరింతగా నశింపజేస్తూ ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్నాయి. ఎన్నో సమస్యలు, సవాళ్లు తలెత్తుతున్ననూ వాటన్నింటినీ జర్నలిస్టులు సమర్థవంతంగా అధిగమిస్తూనే మరింతగా ముందుకు సాగుతూనే ఉన్నారు. ఈ దృగ్విషయాలు వారి వృత్తి పట్ల అంకితభావానికి నిదర్శనంగా చెప్పొచ్చు.

ముఖ్యంగా హిందుత్వ అజెండాతో మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పత్రికా స్వేచ్ఛ మెల్లమెల్లగా పతనం కావడాన్ని స్పష్టంగా గమనించవచ్చు. పత్రికా స్వేచ్ఛలో ప్రతి సంవత్సరం నార్వే దేశం ప్రథమ స్థానంలో నిలుస్తూనే ఉండగా భారతదేశం మాత్రం ప్రతి సంవత్సరం తన పొరుగు దేశాల కన్నా మరింత లోతుగా దిగజారడం గమనార్హం. మొత్తం 180దేశాల్లో కేవలం 52దేశాల్లోనే పత్రికా స్వేచ్ఛ సజావుగా అమలు కావడం గమనార్హం. అదేవిధంగా జర్నలిస్టుల పరిస్థితులు తీవ్ర ఆందోళనకరంగా ఉన్న 31దేశాల జాబితా లోనూ భారతదేశం ఉండడంతో మీడియా పరువు మరింతగా మంటగలిసింది అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.అలాగే 42 దేశాల్లో జర్నలిస్టులు కష్టతరమైన పరిస్థితులు అనుభవించడం, 55 దేశాల్లో నిత్యం పలు సమ స్యలు అధిగమిస్తూనే ముందుకు సాగడం బాధాకరం. ఈ రకంగా ప్రతి పది దేశాలలో కేవలం మూడు దేశాలలో మాత్రమే పత్రికా స్వేచ్ఛ సజావుగా అమలు కావడం లేదనేది విస్మయాన్ని కలిగిస్తోంది.

భారతదేశంలో పాలకులు అనుసరిస్తున్న నియంతృత్వ విధానాల పర్యవసానంగా ఫోర్త్ ఎస్టేట్‌లో మిళితమైన పత్రికా స్వేచ్ఛ కేవలం నామమాత్రంగా మాత్రమే అమలు కావడం కడు గర్హనీయం. అలాగే జర్నలిస్టుల భద్రతా సూచీలో భారతదేశం ఏకంగా 172వ స్థానానికి దిగజారడం ద్వారా 'జర్నలిస్టుల భద్రతాలేమి' చాలా స్పష్టంగా విదితమవుతుంది. పత్రికా స్వేచ్ఛ నిర్బంధం విషయంలో నియంతృత్వ పాలకులు అనుసరించే విధానాల్లో మార్పు లు రానంత కాలం వరకు వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారతదేశం ర్యాంక్ మరింతగా దిగజారడమే కాకుండా ప్రపం చంలో దేశ ప్రతిష్ఠ మరింతగా దెబ్బతినే పరిస్థితులు పొంచి ఉన్నాయి. అందువల్ల పత్రికా స్వేచ్ఛకి తగిన ప్రాధాన్యత ఇచ్చే దిశగా పాలకులు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బీసీలపై బీజేపీది నిజమైన ప్రేమేనా?

"రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లిం రిజర్వేషన్‌ను రద్దుచేస్తామని, ఆ ఫలాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు దక్కేలా చూస్తాం' అని ఇటీవల చేవెళ్లలో జరిగిన 'విజయ సంకల్ప సభ'లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది. రిజర్వేషన్లపై వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేయడం బీజేపీ నేతలకు కొత్తేమి కాదు. దేశ భద్రతను కాపాడే స్థానంలో ఉన్న అమాత్యుల వారే ఇలా మాట్లాడటం అభ్యంతరకరమే. ఇటీవల కర్నాటకలో ముస్లింలకు ఉన్న రిజర్వేషన్లను రద్దుచేసి ఆ స్థానంలో రెండుశాతం ఒక్కలిగలకు మరో రెండు శాతం లింగాయతలకు బదిలీ చేస్తూ అక్కడి బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణాలో కూడా తాము అధికారంలోకి వస్తే ఈ విధంగానే చేస్తామని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణా సమాజాన్ని చీల్చడానికి, శాంతియుతంగా ఉన్న ప్రజలమధ్య చిచ్చుపెట్టేందుకు ఉపయోగపడేలా ఉన్నాయి.



ఉడుత రవీందర్
9490098487

సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన సమూహాలను సమానత్వంలోకి తీసుకురావడానికి రిజర్వేషన్లు కల్పిస్తారు. వివిధ దేశాల్లో కొన్ని జాతి ప్రాతిపదికన, మత ప్రాతిపదికన ఆర్థిక వెనుకబాటుతనం పేరుతో రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. మన దేశంలో స్వాతంత్ర్యానికి ముందే జ్యోతిబాపూలే స్ఫూర్తితో సాహుమహారాజ్ కొల్హాపూర్ సంస్థానంలో 1902లోనే బ్రాహ్మణేతర కులాల వారికి 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. ట్రావన్‌కోర్, బరోడా, మద్రాస్ ప్రెసిడెన్సీలలో కూడా బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. వేల సంవత్సరాలు సామాజిక అణిచివేతకు గురైన ఎస్.సి.లకు అంబేద్కర్ కృషి వల్ల 1935లో ప్రాతినిధ్య సంస్థల్లో రిజర్వేషన్లు వచ్చాయి. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగం ద్వారా ఎస్సీలతోపాటు ఎస్టీలకు కూడా రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. బీసీల విషయం రాష్ట్రాలకు వదిలేస్తూ కేంద్రం చేతులు దులుపుకుంది. మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు కొన్ని రాష్ట్రాలలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రాజ్యాంగానికి లోబడి రిజర్వేషన్లు కల్పించాయి. మండల్ కమిషన్ రిపోర్టు తర్వాత దేశం మొత్తం బీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బాల సుబ్రహ్మణ్యం కమిషన్ సూచనల ప్రకారం 2005లో ముస్లింలలోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన 14 కులాలను బీసీ-ఇ గ్రూపులో చేర్చడం జరిగింది. తద్వారా బీసీ-ఇ గ్రూపులో వారికి 4 శాతం రిజర్వేషన్లు కేటాయించారు. అన్ని రాకాల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు పెట్టిన 50 శాతం పరిమితికి మించకుండా బీసీ రిజర్వేషన్లు 25 నుండి 29 శాతానికి పెంచారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ నియమించిన బి.ఎస్. రాములు కమిషన్ 4శాతం ఉన్న బీసీ-ఇ గ్రూపు రిజర్వేషన్లను మరో 8శాతం పెంచి 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏప్రిల్ 2017లో సిఫారసు చేసింది.ఈ సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం చట్టసభల్లో ఆమోదించి, కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి కూడా పంపగా కేంద్రం నేటికీ ఆమోదించలేదు.

మండల్ కమిషన్ సిఫారసులను వ్యతిరేకిస్తూ బీజేపి, ఆర్ఎస్ఎస్ శక్తులు కమండల్ పేరుతో రామ జన్మభూమి, బాబ్రీ మసీదు చర్చను ముందుకు తీసుకొచ్చి ఉద్యమించి బీసీలకు తీరని అన్యాయం చేశారు.అవకాశం దొరికిన ప్రతి సందర్భంలో బీజేపి నేతలు, ఆర్ఎస్ఎస్ నేతలు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడుతూనే ఉంటారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్ల విధానాన్ని సమీక్షించాలన్న అభిప్రాయాన్ని గతంలో బహిరంగంగానే ప్రస్తావించారు. కొందరు కేంద్ర మంత్రులు, ఎంపిలు కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూనే ఉన్నారు. తద్వారా తమ సహజమిత్రులైన అగ్రవర్ణాలను సంతృప్తి పరుస్తుంటారు. మాటలే కాదు, చేతల్లో చూపడానికి అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ 103వ రాజ్యాంగ సవరణ చేశారు. ఈ సవరణను



సుప్రీంకోర్టు సైతం సమర్థించింది. అంతటితో ఆగకుండా ఈ 10శాతం రిజర్వేషన్లు ఇప్పటివరకు రిజర్వేషన్ అనుభవించని తరగతు లకు (నాన్ రిజర్వుడ్ కేటగిరీకి) మాత్రమే వర్తింపచేయాలని ధర్మాసనం పేర్కొన్నది. నిత్యం రిజర్వేషన్లపై తమ అక్కసు వెళ్లబుచ్చే బీజేపి నేతలు ఏ ఒక్కరూ ఈ తీర్పు పట్ల మాట్లాడలేదు. ఈ పరిణామాలతో ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాల్లో ప్రభుత్వం పట్ల, పాలక పార్టీ పట్ల సహజంగానే వ్యతిరేకత పెరిగింది. జనభాలో 50శాతానికి పైగా ఉన్న వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ శాతాన్ని 27 శాతం మాత్రమే అమలు చేస్తున్నాంరు. ఈ 27శాతం అమలు కూడా లోప భూయిష్టంగా ఉంది. ఉన్నత విద్యాసంస్థల్లో మెరిట్ సాధించిన బీసీ విద్యార్థులను రిజర్వేషన్ జనరల్ కేటగిరిలో కాకుండా రిజర్వేషన్ కేటగిరిలో చూపించి మోసం చేస్తున్నారు. వీటన్నింటి కారణంగా బీసీలలో ఈ వ్యతిరేకత మరింత ఎక్కువగా ఉంది. ఈ వ్యతిరేకతనుండి బయటపడటంతోపాటు, బీసీలకు దగ్గరవ్వడానికి బీజేపి దేశవ్యాప్తంగా పడరాని పాట్లు పడుతుంది. 'కడుపులో లేని ప్రేమను కౌగిలింతలో చూపాలనుకుంటుంది.' అందులో భాగంగానే కర్నాటకలో రిజర్వేషన్ల బదలాయింపు నిర్ణయం. తెలంగాణాలో కూడా ఆ విధంగానే ఈ తరగతులకు దగ్గరయ్యే ఎత్తు గడలో భాగంగానే 'షా' ఈ వ్యాఖ్యలు చేశారనిపిస్తుంది. బీసీలకు తమ పట్ల పెరుగుతున్న వ్యతిరేకతను తగ్గించుకోవడంతోపాటు ముస్లింల మీదికి బీసీలను ఉసిగొల్పి తద్వారా హిందువుల ఓట్లను దండుకోవడమే అసలు లక్ష్యం. 'ఒక్క దెబ్బకు రెండు పిట్టలు' అన్నట్లు హిందూ ఓట్ల పోలరైజేషన్ చేసుకోవడం, బీసీలలో వ్యతిరేకతను తగ్గించుకోవడం. దీంతో ముస్లింలు తమ రిజర్వేషన్లు అనుభవిస్తున్నారనే భావన పెరిగి బీసీలకు, ముస్లింలకు ఘర్షణలు సృష్టించాలనే కుట్రలు దాగి ఉన్నాయి. హైదరాబాద్ పాతబస్తీ లాంటి చోట మతఘర్షణలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

రిజర్వేషన్లు సర్వజనులందరిని సమానంగా మార్చలేకపోవచ్చు కానీ అసమానతల సమాజంలో కొంతైనా ఊరటనిస్తాయి. సామాజిక, ఆర్థిక అసమానతలు ఉన్నంతకాలం దేశంలో రిజర్వేషన్ల అవసరం కచ్చితంగా ఉంటుంది. గ్లోబలైజేషన్, ప్రయివేటైజేషన్ పుణ్యమా అని రిజర్వేషన్లు సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. అన్ని రకాల రిజర్వేషన్లకు వ్యతిరేకమైన బీజేపి, మైనార్టీల రిజర్వేషన్లను బీసీలకు బదలాయిస్తామనడంలో

> నిజంగా బీసీలపై బీజేపీకి ప్రేమే ఉంటే దేశవ్యాప్తంగా బీసీ కుల గణన తీయాలి. మండల కమిషన్ సిఫార్సులన్నింటిని అమలు జరుపాలి. బీసీల జనభా దమాషా ప్రకారం అన్ని రంగాల్లో రిజర్వేషన్లు వర్తింపచేయాలి. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టడంతో పాటు పటిష్టంగా అమలుచేయాలి. 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను జనరల్ కేటగిరీగా భావించి దానికి అన్ని తరగతులలోని పేదలను అర్హులుగా చేయడం ద్వారా లోపాన్ని సరిదిద్దాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ కమిషన్ల వలె రాజ్యాంగబద్ధ హోదా బీసీ కమిషన్లకు కూడా కల్పించాలి. ఇవి చేయకుండా ఉన్న రిజర్వేషనన్లను రాజకీయ లబ్ధికోసం వాడుకుంటూ ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి ఓట్లు వేయించుకోవాలని చూస్తే తెలంగాణ సమాజం తగిన గుణపాఠం చెబుతుంది.

అసలు కుట్రలేమిటి?. ముస్లింలు విద్యతోపాటు సామాజికంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అలాంటి వారికి ఉన్న రిజర్వేషన్లు ఎత్తేయడం నష్టదాయకమే. నిజంగా బీసీలపై బీజేపికి ప్రేమే ఉంటే దేశవ్యాప్తంగా బీసీ కుల గణన తీయాలి. మండల కమిషన్ సిఫార్సులన్నింటిని అమలు జరుపాలి. బీసీల జనభా దమాషా ప్రకారం అన్ని రంగాల్లో రిజర్వేషన్లు వర్తింపచేయాలి. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టడంతో పాటు పటిష్టంగా అమలుచేయాలి. 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను జనరల్ కేటగిరీగా భావించి దానికి అన్ని తరగతులలోని పేదలను అర్హులుగా చేయడం ద్వారా లోపాన్ని సరిదిద్దాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ కమిషన్ల వలె రాజ్యాంగబద్ధ హోదా బీసీ కమిషన్లకు కూడా కల్పించాలి. ఇవి చేయకుండా ఉన్న రిజర్వేషనన్లను రాజకీయ లబ్ధికోసం వాడుకుంటూ ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి ఓట్లు వేయించుకోవాలని చూస్తే తెలంగాణ సమాజం తగిన గుణపాఠం చెబుతుంది.



ఏకాగ్రత ముఖ్యం

విద్యార్థులకే కాదు, ఉద్యోగినులు, గృహిణులకూ ఏకాగ్రత ముఖ్యమంటున్నారు నిపుణులు. చేసే పనిని మధ్యలోనే ఆపేయడం లేదా పూర్తిచేసిన పనిలోనూ నాణ్యత లోపించడానికి కారణం ఏకాగ్రత కొరవడటమే అని చెబుతున్నారు. దీన్ని పునరుద్ధరించుకోవడమెలాగో సూచిస్తున్నారు.

● ఉద్యోగినులు కెరియర్‌తోపాటు ఇంటిబాధ్యతలు, పిల్లల సంరక్షణను నిర్వర్తించాల్సి ఉంది. శారీరక అలసటతోపాటు బాధ్యతలతో తీవ్ర ఒత్తిడి, ఆందోళనకు గురవుతుంటారు. దీనివల్ల మానసికంగా అలసి పోయి ఏకాగ్రతకు దూరమవుతారు. ఒక పనిచేస్తూ దాన్ని పూర్తి చేయకుండానే మరో పనిలో నిమగ్నమవడంతో ఏదీ సంపూర్ణంగా చేయలేకపోతుంటారు. ఆఫీస్ పని పూర్తిచేయడంలో ఆసక్తి తగ్గుతుంటుంది. ఇటువంటి సమస్యలకు దూరంగా ఉండాలంటే రోజూ ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. అప్పుడే శరీరానికి, మెదడుకూ ఒకేసారి పూర్తి విశ్రాంతి దొరుకుతుంది. రెండూ.. తిరిగి ఉత్తేజితమవుతాయి. పనిలో ఏకాగ్రత పెరిగి నైపుణ్యాలను ప్రదర్శించగలరు.

● సామాజిక మాధ్యమాలకు వీలైనంత దూరంగా ఉండండి. ధ్యాసంతా ఫోన్‌పైనే ఉంటే పనిపై ఆసక్తి తగ్గుతుంది. ఆఫీస్ లేదా ఇంట్లో వీలైనంత ఫోన్ వాడకాన్ని తగ్గించాలి. ఫోన్ ఫ్రీ అంటూ కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. ఏకాగ్రతను మళ్లిస్తున్న సోషల్‌మీడియా వినియోగాన్ని వీలైనంత తగ్గించుకుంటే చాలు.

● శరీరంలోని అవయవాలన్నింటికీ ఇచ్చినట్లే మెదడుకూ వ్యాయామాన్నివ్వాలి. మెదడు చురుకుగా ఉంటేనే ఏకాగ్రత పెరుగుతుంది. పజిల్స్, సుడోకు, రిడిల్స్ పూర్తిచేయండి. ఇంట్లోవాళ్లు లేదా పిల్లలతో కలిసి చేస్తే మనసంతా ఉత్సాహంతో నిండుతుంది. వాళ్లందరితో కలిసి సరదాగా గడిపినట్లుగానూ ఉంటుంది. ఏకాగ్రతా పెరుగుతుంది.

● ఉదయం లేదా సాయంత్రం అరగంటసేపు చేసే వ్యాయామంతో మెదడుకు రక్తప్రసరణ జరుగుతుంది. డోపమైన్ హార్మోన్ విడుదలై మనసు ఉత్తేజితం అవుతుంది. ఇది పనిపై ఏకాగ్రతను పెంచుతుంది. వ్యాయామంలో భాగంగానే మెడిటేషన్‌కూ స్థానమివ్వాలి. దారిమళ్లించే రకరకాల వ్యాపకాల నుంచి మనసును ధ్యానం దూరంగా ఉంచుతుంది. మానసిక ఆందోళన, ఒత్తిడిని తరిమేసి, ఏకాగ్రతను అందిస్తుంది.

మృతకణాలను తొలగించండి

చర్మ సంరక్షణలో మృతకణాలు తొలగించటం చాలా ముఖ్యం. లేదంటే ముఖంపై మురికి, ధూళి పేరుకుపోయిన చోట నల్లమచ్చలు, మొటిమలూ వస్తాయి. ప్రతిసారీ వీటి కోసం మార్కెట్లో దొరికే స్క్రబ్‌లు వాడతాం. వాటికి బదులుగా ఇంట్లోనే సహజంగా తయారు చేసుకోవచ్చు.



● అరకప్పు పంచదారకు రెండు చెంచాల ఆలివ్‌నూనె చేర్చండి. మూత బిగుతుగా ఉన్న గాజు సీసాలో భద్రపరచుకోండి. దీన్ని వారంలో రెండు మూడు సార్లు ముఖానికి రాసుకుని మృదువుగా రుద్దాలి. ఆపై పది నిమిషాలాగి చల్లటినీళ్లతో కడిగేస్తే సరి. మేను నిగనిగలాడుతుంది.

● మూడు చెంచాల చాక్లెట్ పొడిలో రెండు చెంచాల కొబ్బరి నూనెను కలపాలి. ఇది ముఖానికి మంచి స్క్రబ్. కాస్త ఆరాక...చేతుల్ని నీళ్లతో తడిపి వేళ్లతో మృదువుగా మర్దన చేయండి. ఇలా చేస్తే మృతకణాలు తొలగిపోయి ముఖం తాజాగా, మెరిసి పోతుంది.

● మూడు చెంచాల చక్కెరలో మూడు చెంచాల తేనె, చెంచా నిమ్మరసం కలపాలి. ఈ స్క్రబ్‌ని వారానికి రెండు సార్లు ఉపయోగించుకోవచ్చు. ఇది మూసుకుపోయిన చర్మ రంధ్రాలను తెరిపించి, ముఖాన్ని కాంతులీనేలా చేస్తుంది.

● రెండు చెంచాల ఓట్స్‌లో కాసిని పాలు, చెంచా ఆలివ్ నూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ఓట్స్ మెత్తబడే వరకూ అలాగే వదిలేసి... తర్వాత కొన్ని చుక్కల రోజ్‌వాటర్‌ను కలపాలి. ఈ పేస్ట్‌ని ముఖానికి రాసి ఆరనివ్వాలి. ఆపై సున్నితంగా రుద్దుతూ కడిగేస్తే సరి. చర్మం మృదువుగా మారి యవ్వనంగా కనిపిస్తాం.

మధుమేహకులకు నోరూరే వంటలు



మారుతున్న జీవన శైలి కారణంగా వయసుతో పని లేకుండా అందరినీ ఇబ్బంది పెడుతున్న వ్యాధి మధుమేహం. ఇది వస్తే ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. తినే విషయంలో ప్రత్యేకంగా ఉండాలి. నచ్చిన ఆహారాన్ని తినే అవకాశం ఉండదు. రక్తంలో చక్కెర స్థాయిలని పెంచే ఆహారం తినకూడదు. అల్పాహారం విషయంలో చాలా శ్రద్ధ తీసుకోవాలి. ఉదయం తీసుకునే ఆహార ప్రభావం రోజంతా శరీరంపై ఉంటుంది. అందుకే ఏవి పడితే అవి తింటే అది ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. బ్రకోలి, క్యారెట్స్, టమాటో, ఆకుకూరలతో పాటు యాపిల్, అరటి పండు, బెర్రీస్, గ్రేప్స్, నారింజ వంటి పండ్లు తీసుకోవాలి. అది కూడా మోతాదుకు మించి తీసుకోకూడదు. అల్పాహారంగా రోజూ తినే ఇడ్లీ, దోశ బోరింగ్‌గా అనిపిస్తే కొత్తగా ఉండే వీటిని ట్రై చేసి చూడండి. నోటికి మంచి రుచిగా ఉండటమే కాదు ఎంతో ఆరోగ్యాన్ని కూడా ఇస్తాయి. వీటిని తినడం వల్ల శరీరానికి అవసరమైన ప్రోటీన్స్ అందడమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అవేంటో చూద్దాం...



జొన్న రొట్టె

ఒక గిన్నెల్లో కొద్దిగా జొన్న పిండి తీసుకుని చపాతీ పిండి మాదిరిగా కలుపుకోవాలి. దాని కొద్దిసేపు పక్కన పెట్టి నానబెట్టుకోవాలి. స్టౌ మీద పాన్ పెట్టుకుని కొద్దిగా నూనె వేసుకుని అందులో పనీర్ ముక్కలు, నాలుగు టేబుల్ స్పూన్ల మెంతి ఆకులు, రెండు పచ్చి మిర్చి ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. అర కప్పు టమాటో ముక్కలు వేసి బాగా వేయించుకోవాలి. దాంట్లో రుచికి సరిపడినంత ఉప్పు వేసుకుని సన్నని మంట మీద వేయించుకోవాలి. ఇప్పుడు కలిపిన పిండిని చిన్న చిన్న ముద్దలుగా చేసుకుని కొద్దిగా వెడల్పు చేసుకున్న తర్వాత అందులో ఈ స్టఫ్ చేసుకున్న మిశ్రమాన్ని అందులో పెట్టి పిండితో కప్పేసి చపాతీలాగా రుద్దుకోవాలి. రోటీ తవా మీద రొట్టెని రెండు వైపులా బాగా కాల్చుకోవాలి. అంతే వేడి వేడి జొన్న రొట్టెలు రెడీ.



ఓట్స్‌తో రొట్టె

ఓట్స్‌తో చేసే ఏ వంటకాలైనా షుగర్ పేషెంట్లకు మంచివే. అల్పాహారంగా ఓట్స్ ఉప్మాను తినడం వల్ల రోజంగా ఇన్సులిన్ స్థాయిలు పెరుగుతాయి. రక్తంలో గ్లూకోజ్ నియంత్రణలో ఉంటుంది. ఓట్స్, క్యారెట్, బచ్చలి కూర, కొత్తిమీర, పచ్చిమిర్చి అన్నీ టేబుల్ స్పూన్ వేసి అందులో కొన్ని నీళ్ళు పోసి పిండి బాగా కలుపుకోవాలి. స్టౌ మీద పాన్ పెట్టుకుని బాగా వేడి అయిన తర్వాత దాని మీద నూనె రాసి ఒక గరిటె పిండి తీసుకుని దిబ్బ రొట్టె లాగా పోసుకోవాలి. రెండువైపులా లేత గోధుమ రంగు వచ్చే వరకు బాగా వేయించుకోవాలి. అంతే ఎంతో రుచికరమైన వేడి వేడి ఓట్స్ రొట్టె రెడీ.



పెసర పప్పు ఇడ్లీ

ఒక కప్పు పెసర పప్పు తీసుకుని నీటితో బాగా శుభ్రం చేసుకుని సుమారు రెండు గంటల పాటు నీటిలో నానబెట్టాలి. తర్వాత నీళ్ళు తీసేసి పప్పుని మెత్తగా రుబ్బుకోవాలి. ఆ పిండిలో పావు కప్పు పెరుగు తీసుకుని బాగా కలుపుకోవాలి. స్టౌ మీద పాన్ పెట్టుకుని రెండు టేబుల్ స్పూన్ల ఆయిల్ వేసి వేడయ్యాక అందులో అర టీ స్పూన్ ఆవాలు, టీ స్పూన్ జీలకర్ర, టీ స్పూన్ శనగపప్పు, రెండు పచ్చిమిర్చి ముక్కలుగా చేసుకుని వేసి, కొద్దిగా సన్నగా తరిగిన అల్లం, కొన్ని కరివేపాకు, కొద్దిగా జీడిపప్పు వేసి బాగా వేయించుకోవాలి. ఈ మసాలా మిశ్రమాన్ని ముందుగా సిద్ధం చేసుకుని పెట్టుకున్న పెసరపప్పు పిండిలో కలుపుకోవాలి. ఇడ్లీ పాత్ర తీసుకుని ఇడ్లీ మాదిరిగా వేసుకోవాలి. ఈ పిండిని అప్పటికప్పుడే సిద్ధం చేసుకోవాలి. దీన్ని నిల్వ చెయ్యకూడదు. మీడియం మంట మీద పదిహేను నిమిషాల పాటు ఆవిరితో ఉడికించుకోవాలి. గ్రీన్ చట్నీతో కలిపి ఈ ఇడ్లీలు తింటే చాలా రుచిగా ఉంటాయి.



క్వినోవా ఉప్మా

చూసేందుకు కొద్దిగా గోధుమ రవ్వలాగా కనిపిస్తుంది క్వినోవా. వాటితో చేసుకునే ఉప్మా మధుమేహ రోగులకి చాలా మంచిది. అర కప్పు క్వినోవా తీసుకుని బాగా కడిగి పక్కన పెట్టుకోవాలి. ఒక పాన్‌లో ఒకటిన్నర టేబుల్ స్పూన్ల నూనె పోసుకుని వేడి చేసుకోవాలి. అందులో అర టీ స్పూన్ ఆవాలు, అర టీ స్పూన్ జీలకర్ర, అర టీ స్పూన్ మినపప్పు, అర టీ స్పూన్ మూంగ్ దయాళ్ వేసుకుని వేయించుకోవాలి. అవి వేగిన తర్వాత తరిగిన అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, కాస్తకొద్దిగా ఇంగువ(ఇష్టమైతేనే) వేసుకోవాలి. తర్వాత ఉల్లిగడ్డ, కరివేపాకు వేసి మళ్ళీ కొద్ది సేపు వేయించుకోవాలి. అవి బాగా వేగిన తర్వాత అందులోకి తరిగిన క్యారెట్, ఫ్రెంచ్ బీన్స్, 1/3 కప్పు నానబెట్టుకున్న బటానీ వేసి అవి బాగా వేయించాలి. అందులో క్వినోవా వేసి కొద్దిగా నీలు పోసి రుచికి సరిపడా ఉప్పు వేసుకోవాలి. అది బాగా ఉడికేంత వరకు ఉంచాలి. మధ్యలో అడుగంటకుండా గరిటెతో తిప్పుకుంటూ ఉండాలి. మిశ్రమం బాగా దగ్గర పడిన తర్వాత స్టౌ ఆపేసి సర్వ్ చేసుకోవడమే.

ఆశావర్కర్లకు పరీక్షలా!

(మొదటిపేజీ తరువాయి)

చేయించుకుంటూ వారిని ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆశాలకు పెట్టే ఎగ్జామ్‌ను రద్దు చేయాలని, ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, అధికారుల వేధింపులను ఆపాలని, నెలనెలా 5 తేదీలోపు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు ఒక్కరోజు ఆరోగ్యం బాగాలేక డ్యూటీకి వెళ్ళకుంటే అనేక రకాలుగా వేధిస్తున్నారని తెలిపారు. వారికి ఫిక్స్‌డ్ వేతనం రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి విజయ, కోశాధికారి రేణుక, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజామణి, జిల్లా ఉపాధ్యక్షులు బాలమణి, రమ, విజయ, దివ్య, సుజాత, స్వప్న, సుకన్య, సహాయ కార్యదర్శులు భూలక్ష్మి, శాంతి, లావణ్య, నీలోఫర్ రాధా, బాలమణి, రేణుక, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

అదానీపై సుప్రీంకు నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

అన్ని అంశాల పైన ఈ కమిటీ విచారణ జరిపిందీ లేనిదీ తెలియరాలేదు. అలాగే విచారణను పూర్తి చేసేందుకు మరికొంత సమయం అడుగుతుందా లేదా అన్నది కూడా తెలియడం లేదు. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలను విచారించేందుకు కేంద్ర ప్రభుత్వం సూచించిన సభ్యుల పేర్లను న్యాయస్థానం ఫిబ్రవరి 17న తిరస్కరించింది. సొంతగా ఆరుగురు నిపుణులతో కమిటీని నియమించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎఎం సప్రే నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీలో మాజీ బ్యాంకర్లు కేవీ కామత్, ఓపీ భట్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, సెక్యూరిటీస్ న్యాయవాది సోమశేఖర్ సుందరేశన్, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జేపీ దేవధర్ సభ్యులుగా ఉన్నారు. రెండు నెలలలో విచారణను పూర్తి చేయాలని కమిటీని, సెబీని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే సెబీ మాత్రం మరో ఆరు నెలల గడువు కోరింది.

అదానీ కంపెనీలకు షాక్

న్యూఢిల్లీ : అదానీ గ్రూపులోని మూడు కంపెనీలకు ఐక్యరాజ్య సమితిలోని కీలక విభాగం షాక్ ఇచ్చింది. ఉద్గారాల తగ్గింపులో పారిశ్రామికవర్గాలకు సహాయపడే ఐక్యరాజ్యసమితి మద్దతు గల సైన్స్ బేస్డ్ టార్గెట్స్ ఇనిషియేటివ్ (ఎస్‌బీటీఐ) ప్రకారం.. ఉద్గారాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్న కంపెనీల జాబితాలో మూడు అదానీ గ్రూప్ కంపెనీలు తమ స్థానాన్ని కోల్పోయాయి. ఈ జాబితాలో అదానీ గ్రీన్, అదాని ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్‌లు ఉన్నాయని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. అదాని కంపెనీలు క్లైమట్ గ్రూప్ ఆమోదాన్ని కోల్పోయాయని వెల్లడించింది. తాజా వాతావరణ శాస్త్రానికి అనుగుణంగా వ్యాపారాలు ప్రతిష్టాత్మకమైన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను నిర్దేశించడంలో ఎస్‌బిఐటి సహాయపడుతుంది. 2030 నాటికి ఉద్గారాలను సగానికి తగ్గించడానికి, 2050కి ముందు నికర సున్నాకు సాధించడానికి ఎస్‌బీటీఐ కృషి చేస్తోంది. చాలా మంది పెట్టుబడిదారులు స్థిరమైన ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టాలని భావించేవారు తరచుగా ఎస్‌బీటీఐ ఆమోదం కోసం ఎదురు చూస్తుంటారని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. గ్రీన్ ఎనర్జీలో భారీ పెట్టుబడులను ప్రకటించిన అదానీ గ్రూపునకు ఇది భారీ దెబ్బే అని నిపుణులు భావిస్తున్నారు. వచ్చే దశాబ్దంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్‌లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నామని గౌతం అదానీ గతేడాదిలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఎస్‌బీటీఐ తాజా చర్యలు అదానీ కంపెనీలపై ఎలాంటి ప్రభావం చూపనున్నాయో ఎదురు చూడాలి.

సెప్టెంబర్ 17న కాంగ్రెస్ మ్యానిఫెస్టో

(మొదటిపేజీ తరువాయి)

యూత్ డిక్లరేషన్ సభ విజయవంతమైందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో రేవంత్ విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఐటీఐ, ప్రతి పార్లమెంట్‌కు ఒక పాలిటెక్నిక్ కాలేజీలను ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలో సీపీఎస్‌ను అమలు చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. సెప్టెంబర్ 17ను స్వతంత్ర దినోత్సవంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

వైద్యుల కొరత

(మొదటిపేజీ తరువాయి)

కోసం చౌదరి తన తాతతో కలిసి ఢిల్లీలోని ఎయిమ్స్ గేటు ఎదుట రెండు రోజుల పాటు ఫుట్‌పాత్‌పై పడుకోవాల్సి వచ్చింది. వారే కాదు...మరో వంద మంది రోగులదీ అదే పరిస్థితి. ఛాతి సమస్యతో బాధపడుతున్న చౌదరి చికిత్స కోసం ఎయిమ్స్‌కు వచ్చాడు. 1200 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీహార్ నుంచి వచ్చి గేటు వద్ద పడిగాపులు పడుతున్నా ఎవరూ కనికరించడం లేదు. తెల్లవారుజామునే క్యూలో నిలబడడం, తన వంతు వచ్చే సరికే స్లాట్లు అయిపోవడం జరుగుతోంది. వైద్యులు, సిబ్బంది కొరత కారణంగానే అతనికి సకాలంలో అపాయింట్‌మెంట్ దొరకడం లేదు.ఇది దేశంలో వైద్యుల కొరతకు,రోగుల అవస్థకు ఓ ఉదాహరణ మాత్రమే.

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన మన దేశంలో వైద్యులు, సిబ్బంది కొరత అధికంగా ఉంది. 1991 లెక్కల ప్రకారం దేశంలో ప్రతి వెయ్యి మంది రోగులకు 1.2 మంది డాక్టర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తెలిపింది. 2020 నాటికి జనాభా పెరగడంతో ఈ దామాషా 0.7కి పడిపోయింది. అదే చైనాలో ప్రతి వెయ్యి మంది జనాభాకు 2.4 మంది డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రి మాండవియా మార్చిలో పార్లమెంటులో మాట్లాడుతూ దేశంలో ప్రతి 834 మంది రోగులకు ఒక వైద్యుడు ఉన్నాడని, ఇది డబ్ల్యూహెచ్‌ఓ నిర్దేశించిన స్థాయి కంటే ఎక్కువేనని చెప్పుకొచ్చారు. అయితే ఆయన చెప్పిన వైద్యులలో సంప్రదాయిక వైద్యం అందిస్తున్న ఆయుర్వేదం, హోమియో, నేచురోపతి వైద్యులు కూడా ఉన్నారు. డబ్ల్యూహెచ్‌ఓ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వంటి సంస్థలు సంప్రదాయ వైద్యులను లెక్కలోకి తీసుకోవడం లేదు.

వాస్తవానికి వైద్యుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం ప్రయివేటు, ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్ల సంఖ్యను రెట్టింపు చేసింది. ఈ సంస్థలలో ప్రవేశం కోసం గత సంవత్సరం 17.6 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అయినప్పటికీ ఫిబ్రవరిలో ఆరోగ్య మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఇచ్చిన వివరాల ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రులలో మూడు వేల వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక నర్సులు, ఇతర సహాయ సిబ్బంది ఖాళీల సంఖ్య 21 వేలకు పైనే.

బీహార్‌లోని భాగల్పూర్ జిల్లాలో ఉన్న 800 పడకల జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో కావాల్సిన వైద్యులలో సగం మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యుల పైనే అధిక పనిభారం పడుతోంది. పైగా వీరు అండర్ గ్రాడ్యుయేట్లకు పాఠాలు కూడా బోధించాల్సి ఉంది. పెద్ద నగరాలకు వెలుపల ఉన్న ఆస్పత్రులలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. గత సంవత్సరం మార్చి నాటికి గ్రామీణ ప్రాంతాలలో సర్జన్లు, ఫిజీషియన్లు, స్త్రీల వ్యాధుల నిపుణులు, పిల్లల వ్యాధుల నిపుణుల కొరత 80 శాతం వరకూ ఉన్నదని ప్రభుత్వమే అంగీకరించింది. ప్రభుత్వ సమాచారం ప్రకారం చిన్న ఆస్పత్రులలో 21,920 మంది నిపుణులు అవసరం కాగా 4,485 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. నిపుణులైన వైద్యులు మెట్రోపాలిటన్, ఇతర పెద్ద నగరాలలో పని చేసేందుకు విదేశాలకు క్యూ కడుతున్నారు. గ్రామాలలో వైద్యుల కొరత ఎక్కువగా ఉండడంతో రోగులు పట్టణ ప్రాంతాలలోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడి ఖర్చులతో వీరి జేబులు ఖాళీ అవుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడమంటేనే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అక్కడ పరీక్షలు, వైద్యుల ఫీజులు, ఇతర వైద్య సేవలకు పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే వైద్యులు అందుబాటులో ఉంటే చాలా కేసులను ప్రాథమిక స్థాయిలోనే నయం చేయవచ్చునని ఎయిమ్స్ వైద్యుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ చెబుతున్నారు.

ట్రంప్ దోషే...

(మొదటిపేజీ తరువాయి)

పాటు విచారించిన తర్వాత ఈ తీర్పు వెలువడింది. కాలమిస్ట్ కేరోల్‌కు నష్టపరిహారంగా 5మిలియన్ల డాలర్లు చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పింది. కేరోల్ నష్టపరిహారం ఎంత కావాలో తన పిటిషన్‌లో పేర్కొనలేదు. న్యాయమూర్తుల నిర్ణయానికే వదిలివేసింది.

ఈ వేధింపులు జరిగింది 1996లో అయినా 2019లో కేరోల్ తాను రాసిన పుస్తకంలో ఈ విషయాలు బయట పెట్టారు.

కాగా, ఈ కేసు విచారణ సందర్భంగా ట్రంప్ న్యాయస్థానానికి హాజరు కాలేదు. అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు ట్రంప్ ప్రచారం జరుపుతున్న వేళ ఈ లైంగిక వేధింపుల ఆరోపణలు ట్రంప్‌ను చుట్టుముడుతున్నాయి. కేరోల్ ఆరోపణలపై ట్రంప్ స్పందిస్తూ కేవలం పుస్తకాల అమ్మకాలు పెంచుకునేందుకే ఆమె ఇలా మాట్లాడుతున్నారని అనాడు ఆరోపించారు. తనను వేధింపులకు గురి చేసేందుకు ఇదంతా చేస్తున్నారని తాజాగా తీర్పు అనంతరం ట్రంప్ ప్రకటన చేశారు. మొత్తంగా 12మందికి పైగా మహిళలు ట్రంప్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు.

జూన్ 14 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల 14 నుంచి 22వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రత్యేక కోర్టుకు ఇమ్రాన్

(మొదటిపేజీ తరువాయి)

హాజరుపర్చారు. ఆయనను 14రోజులపాటు తమ కస్టడీకి పంపాల్సిందిగా తొలుత అవినీతి నిరోధక పర్యవేక్షక సంస్థ కోరింది. కానీ కోర్టు 8రోజుల రిమాండ్‌కు అంగీకరించిందని ఇమ్రాన్ తరపు న్యాయవాదులు తెలిపారు.

కేసు విచారణ నిమిత్తం ఇస్లామాబాద్ హైకోర్టుకు మంగళవారం ఇమ్రాన్ రాగా పేరా మిలటరీ రేంజర్లు బలవంతంగా గదిలోకి చొరబడి మరీ ఆయనను అరెస్టు చేశారు. జాతీయ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్‌ఏబీ) ఆదేశాల మేరకే ఈ అరెస్టు జరిగింది. కాగా, ఇస్లామాబాద్‌లో పోలీసు లైన్స్ హెడ్‌క్వార్టర్స్ ఆవరణలో కొత్తగా కట్టిన పోలీసు గెస్ట్ హౌస్‌ను ప్రస్తుతం రెండు కేసుల్లో ఇమ్రాన్‌ను విచారించే నిమిత్తం కోర్టుగా ప్రకటించారు. ప్రభుత్వ ఖజానాకు రూ.5వేల కోట్లకు పైగా నష్టానికి కారణమైన అల్‌ఖదీర్ ట్రస్టు కేసులో విచారణ ప్రారంభమైన వెంటనే, ఖాన్‌ను 14రోజుల పాటు రిమాండ్‌కు పంపాల్సిందిగా ఎన్ఏబి లాయర్లు కోరారు. ఖాన్ తరపు న్యాయవాది మాట్లాడుతూ, తన క్లయింట్‌పై నమోదైన అభియోగాలన్నీ కల్పితాలైందున, వెంటనే ఆయనను విడుదల చేయాలని కోరారు. కాగా, ప్రభుత్వ బహుమతుల అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తాల వివరాలను దాచడానికి సంబంధించి రెండవ కేసు కూడా జిల్లాసెషన్స్ కోర్టులో విచారణ జరగనుంది. గతేడాది పాక్ ఎన్నికల కమిషన్ ఈ కేసును దాఖలు చేసింది. పాలకులకు, పార్లమెంటేరియన్లకు, బ్యూరోక్రాట్లకు ఇతర దేశాల ప్రభుత్వాధినేతలు, విదేశీ ప్రముఖులు ఇచ్చే బహుమతులను ప్రధానిగా రాయితీ ధరకు కొనుగోలు చేసి వాటిని లాభాలకు అమ్ముకున్నారన్నది ఈ రెండో కేసు సారాంశం.

దేశవ్యాప్త సమ్మెకు పీటీఐ పిలుపు

ఇమ్రాన్ అరెస్టును తీవ్రంగా నిరసిస్తున్న పిటిఐ నాయకత్వం సమ్మెకు సిద్ధం కావాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చింది. పెరుగుతున్న ఫాసిజాన్ని నిరసించాలని, ఏదో ఒకటి తేల్చుకునే క్షణం ఆసన్నమవుతోందని పేర్కొంది. ఇస్లామాబాద్, రావల్పిండి, లాహోర్, కరాచి, గుజ్రాన్‌వాలా, ఫైజలాబాద్, ముల్తాన్, మర్దన్ నగరాల్లో పీటీఐ కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. కరాచిలో పోలీసులతో ప్రదర్శకులు ఘర్షణ పడ్డారు. పోలీసు వాహనాలపై రాళ్ళు విసరడం, వీధి లైట్లను పగలగొట్టడం చేశారు. ఇమ్రాన్‌ను విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు.

మరోపక్క తమ నేతను కలుసుకునేందుకు, విచారణను చూసేందుకు వస్తున్న పిటిఐ నేతలను లోపలకు రానివ్వకుండా విస్తృతంగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మీడియాను కూడా లోపలకు రానివ్వడం లేదు. తమను అనుమతించనందుకు నిరసనగా పిటిఐ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ విదేశాంగ మంత్రి షా మహమూద్ ఖురేషి, సెక్రటరీ జనరల్ అసద్ ఉమర్‌లు పోలీసులపై కేసు వేసేందుకు హైకోర్టుకు వెళ్ళారు. కానీ ఈలోగానే వారిద్దరినీ అరెస్టు చేశారు. ఉమర్‌పై రెండు కేసులు నమోదు చేశారు. అంతకుముందు ఖురేషి మీడియాతో మాట్లాడుతూ, శాంతియుత నిరసన అనేది రాజ్యాంగ హక్కు, దాన్ని ఉపయోగించుకోండి, అంతేకానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని కార్యకర్తలను కోరారు.

భారత్‌లో మాతా శిశు మరణాలు ఎక్కువే

(మొదటిపేజీ తరువాయి)

పలు పథకాలు అమలు చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవ చిత్రం దీనికి భిన్నంగా ఉంది. ప్రపంచంలో సంభవిస్తున్న గర్భిణులు, గర్భస్థశిశువులు, నవజాత శిశువుల మరణాలలో ఒక్క మన దేశంలోనే 60 శాతం చోటుచేసుకుంటున్నాయి. పైగా ఈ తరహా మరణాలు అధికంగా జరుగుతున్న పది దేశాలలో భారత్ అగ్రస్థానంలో ఉండడం ఆందోళన కలిగించే విషయం. ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదిక ఈ చేదునిజాన్ని బయటపెట్టింది. గర్భిణులు, నవజాత శిశువుల ఆరోగ్యంపై కేప్‌టౌన్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు (ఐఎంఎన్‌హెచ్‌సీ)లో డబ్ల్యూహెచ్‌ఓ, యూనిసెఫ్, యూఎన్‌ఎఫ్‌పీఏ సంస్థలు మంగళవారం ఈ నివేదికను విడుదల చేశాయి.

2020-21లో ప్రపంచవ్యాప్తంగా 2.9 లక్షల మంది గర్భిణులు, 19 లక్షల మంది గర్భస్థ శిశువులు, 23 లక్షల మంది నవజాత శిశువులు... మొత్తం 45 లక్షల మంది చనిపోయారు. సహారాకు దక్షిణాన ఉన్న ఆఫ్రికా ఖండంలోని ప్రాంతాలు, ఆసియా దక్షిణ ప్రాంతంలో అత్యధికంగా మరణాలు సంభవిస్తున్నాయి. మాతా శిశు సంరక్షణకు సంబంధించి 2030 లక్ష్యాలను సాధించేందుకు అన్ని దేశాలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అవి ఆశించిన స్థాయిలో నెరవేరడం లేదు. గర్భిణులు, నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వాలు చేస్తున్న వ్యయం గత ఎనిమిదేండ్లుగా తగ్గుతూ వస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో గర్భిణులు, నవజాత శిశువులకు అవసరమైన వైద్య సౌకర్యాలు అందలేదని, దీనివల్ల మరణాల సంఖ్య బాగా పెరిగిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ విభాగంలో డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అన్షు బెనర్జీ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య రక్షణ రంగంలో మరిన్ని పెట్టుబడులు అవసరమవుతాయని, తద్వారా గర్భిణులు, శిశువులను కాపాడుకోవచ్చునని చెప్పారు.

2020లో ప్రపంచ దేశాలలో 45 లక్షల మంది గర్భిణులు, గర్భస్థ శిశువులు, నవజాత శిశువులు చనిపోతే ఒక్క మన దేశంలోనే 7.88 లక్షల మరణాలు సంభవించాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రాణాలతో జన్మిస్తున్న శిశువుల సంఖ్యలో భారత్ వాటా 17 శాతం. పెద్ద సంఖ్యలో గర్భిణులు, గర్భస్థ శిశువులు, నవజాత శిశువులు చనిపోవడానికి ఇది కూడా ఒక కారణం కావచ్చు. మన దేశంతో పాటు నైజీరియా, పాకిస్తాన్, కాంగో, ఇథియోపియా, బంగ్లాదేశ్ వంటి దేశాలలో ఈ తరహా మరణాలు సంభవిస్తున్నాయి.

ఎంసెట్ రాతపరీక్షలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

28,686 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 26,198 (91.33 శాతం) మంది హాజరయ్యారు. మొదటి విడతకు 2,488 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో విడతకు 28,892 మంది దరఖాస్తు చేస్తే, 26,657 (92.26 శాతం) మంది పరీక్ష రాశారు. రెండో విడతకు 2,235 మంది గైర్హాజరయ్యారు. హైదరాబాద్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీకి వచ్చి విద్యార్థులు రాస్తున్న పరీక్షలను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి పరిశీలించారు. జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ, ఎంసెట్ చైర్మెన్ కట్టా నర్సింహారెడ్డి, ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కో కన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్లు కె భాస్కర్, టి మాధవికుమారి పరీక్షలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. గురువారం ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్ష జరగనుంది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను నిర్వహిస్తారు.

ఆలస్యంగా వచ్చిన ముగ్గురు విద్యార్థినిలు

స్టాన్లీ ఇంజినీరింగ్ కాలేజీ కేంద్రానికి ముగ్గురు విద్యార్థినిలు బుధవారం ఆలస్యంగా వచ్చారు. నిమిషం నిబంధన అమల్లో ఉండడంతో వారిని పరీక్షా కేంద్రంలోకి అధికారులు అనుమతించలేదు. ఎంసెట్ రాతపరీక్షలను పరిశీలించడానికి వచ్చిన లింబాద్రిని ఆ విద్యార్థినిలు అనుమతించాలంటూ విజ్ఞప్తి చేశారు. వెంటనే ఎంసెట్ కన్వీనర్ డీన్‌కుమార్‌కు ఫోన్ చేసి ఈ విద్యార్థినిలకు ప్రత్యామ్నాయం చూడాలంటూ లింబాద్రి సూచించారు. ఆ తర్వాత డీన్‌కుమార్‌ను సంప్రదించాలంటూ ఆ విద్యార్థినిలకు ఆయన సూచించారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు ఎంసెట్ కన్వీనర్ కార్యాలయంలో సంప్రదిస్తే అవకాశముంటే వారికి పరిష్కారం చూపిస్తామని చెప్పారు.



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు 'మాదాల' మృతి

- రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నివాళి

నవతెలంగాణ -కూసుమంచి

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మాదాల కనకయ్య మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం కనకయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనకయ్య మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళి అర్పించిన వారిలో.. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తోటకూరి రాజశేఖర్, మాజీ సర్పంచ్ తాళ్ళూరి రవి, మండల కమిటీ సభ్యులు తాళ్ళూరి వెంకటేశ్వరరావు, బిక్కసాని గంగాధర్, చీర్ల రాధా కృష్ణ, పార్టీ సభ్యులు ఉన్నారు.

2020 బ్యాచ్ విద్యార్థుల పీజీ పరీక్షలను వాయిదా వేయాలి

- టీజూడా వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

2020 బ్యాచ్‌కు చెందిన పీజీ విద్యార్థులు ఎండీ, ఎంఎస్ డిగ్రీ, డిప్లమో పరీక్షలను వాయిదా వేయాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) కోరింది. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కౌశిక్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.కె.అఖిల్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే మే 2న ఒక వినతి పత్రాన్ని యూనివర్సిటీలో సమర్పించినప్పటికీ స్పందన లేదని తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కరుణాకర్ రెడ్డిని కలిసేందుకు జూడా నాయకులు ప్రయత్నించి నప్పటికీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2020 బ్యాచ్‌కు సంబంధించి మూడు సంవత్సరాల పీజీ ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో ముగుస్తుందనీ, ముందుగానే పరీక్షలు నిర్వహిస్తే ఎక్కువ మంది విద్యార్థులు నష్టపోయే ప్రమాద ముందని వారు పేర్కొన్నారు. కోవిడ్-19 మహమ్మారి కారణంగా పీజీ కరికులంలో అంతరాయం ఏర్పడిందనీ, విద్యాసంవత్సరం పట్టించుకోకుండా ఆ సమయంలో పీజీలు విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు.

దాదాపు రెండేండ్లు రెండు బ్యాచ్‌లు కోవిడ్ విధులు చేశాయని తెలిపారు. నీట్ ఎస్ఎస్ పరీక్షల ను సెప్టెంబర్‌లో నిర్వహిస్తున్నందున పీజీ పరీక్షలను మరో 15 నుంచి 30 రోజులు పొడిగిస్తే దానికి అర్హత సాధించేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండ దని స్పష్టం చేశారు. కోవిడ్ -19 మహమ్మారి నేపథ్యంలో విద్యా సంవత్స రంలో అంతరాయాన్ని ఎదుర్కొన్న విషయాన్ని గమనంలోకి తీసుకుని పలు రాష్ట్రాలు పరీక్షలను వాయిదా వేశాయనీ, విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారని వారు తెలిపారు.

'పది' ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థ విజయభేరి మోగించింది. 1,048 మంది విద్యార్థులు పదికి పది జీపీఏను సాధించారని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ చెప్పారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 9.8 జీపీఏ ఆపైన సాధించిన విద్యార్థులు 2,057 మంది, 9.5 జీపీఏ ఆపైన సాధించిన వారు 3,788 మంది ఉన్నారని వివరించారు. తమ విద్యాసంస్థలో 98.4 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు. వంద శాతం ఉతీర్ణత పొందిన తమ బ్రాంచ్‌లు 63 ఉన్నాయని అన్నారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో 11,168 మంది పది పాయింట్లను సాధించారని వివరించారు. ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సీ ఐపీఎల్, ఎంపీఎల్, ఐకాన్, సీబ్యాచ్, సివిల్స్, మెడికాన్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్‌లు, మైక్రోస్థాయి బోధనతోపాటు అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుల వల్ల ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు.

కులాలు, మతాల పేరిట కుట్రలు..

- తెచ్చుకున్న తెలంగాణను • రక్షించుకుందాం..
- కుట్రదారులకు బుద్ధి చెప్పండి
- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి
- వృత్తిని కించపరిస్తే కేసులు తప్పవు :శ్రీనివాస్‌గౌడ్
- ఆర్థికంగా, ఆత్మగౌరవంతో బతికేలా చేయూత : గంగుల
- చైర్మెన్‌గా పల్లె రవికుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



'కొట్లాడి తెలంగాణను తెచ్చుకున్నాం. ఎంతో మంది అమరులయ్యారు. ఈ తెలంగాణపై కులాలు, మతాల పేరుతో కుట్రలు చేస్తున్నారు. ఈ కుట్రలను తిప్పికొట్టి తెలంగాణను రక్షించుకుందాం' అని విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీష్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో తెలంగాణ కల్లు గీత పారిశ్రామిక సహకార, ఆర్థిక సంక్షేమ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మెన్‌గా పల్లె రవికుమార్‌గౌడ్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ కల్లుగీతపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని అన్నారు. గౌడలను ఉత్పత్తిలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ బీసీలు వెనుకబడ్డ వారు కాదనీ, గత పాలకుల నిర్లక్ష్యంతో వారు వెనుకకు నెట్టేయబడ్డారని అన్నారు.

వారు ఆర్థికంగా, ఆత్మగౌరవంతో బతికేలా సర్కార్ చేయూతనిస్తున్నదని తెలిపారు. కల్లుగీత వత్తి దారుల సంక్షేమానికి, అభివద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు.ఉద్యమకారుడు, వెనుకబడిన వర్గాల ప్రతినిధి పల్లె రవికుమార్ గౌడ్‌కు సీఎం కేసీఆర్ గొప్ప అవకాశమిచ్చారని గుర్తుచేశారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కొందరు గౌడ వృత్తిని కించపరచడంతోపాటు నీరాపై విషప్రచారం చేస్తున్నారని తెలిపారు. వాటిని గౌడలు చూస్తూఊరుకోబోరని, కేసులు పెడతామని హెచ్చరించారు. వైన్‌షాపులు అంటే సంపన్నులకు మాత్రమే అనే ముద్రను చెరిపేసి గౌడలకు 15శాతం రిజర్వేషన్ ప్రకారం దుకాణాలను కేటాయిస్తున్నామని చెప్పారు. కర్నాటకలో గౌడ సీఎం ఉన్నా ఆ వృత్తి అభివృద్ధికి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని గుర్తుచేశారు. కానీ రాష్ట్రంలో మాత్రం గౌడల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు.

నీరా కోసం బెంజ్‌కారులో వస్తున్నారని, దానికి డిమాండ్ పెరిగిందని వివరించారు. పనిచేసేవారికి పదవులు వస్తాయని, ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తారనడానికి రవికుమార్‌గౌడ్‌కు పదవినివ్వడమే నిదర్శనమని అన్నారు. రవికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను త్రికరణ శుద్ధితో నెరవేరుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు గ్యాదరి కిషోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు గౌడ వత్తిదారులు, అభిమానులు పాల్గొన్నారు.

మీ భూములను దున్నుకోండి

ఎవరు అడ్డొచ్చినా ఎదురు తిరగండి

- రైతులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది
- ఆర్నెల్లలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇప్పిస్తాం
- బహుళజాతి కంపెనీల ప్రతినిధిలా మంత్రి కేటీఆర్ : సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసైన్డ్ భూములను తీసుకునే హక్కు ఎవరికీ లేదని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తేల్చి చెప్పారు. బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పేదల భూములను గుంజుకుంటుందని విమర్శించారు. 'వానాకాలంలో మీ భూములను మీరు దున్నుకోండి. ఎవరు అడ్డొచ్చినా ఎదురుతిరగండి. అప్పుడే మీ భూములను మీరు రక్షించుకుంటారు. మీకు కాంగ్రెస్ అండగా ఉంటుంది. మీ భూములను మీరే కాపాడుకోవాలి. ఆర్నెల్లలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది' అని భరోసా ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి గ్రామంలో పాదయాత్ర శిబిరం వద్ద మల్లు భట్టి విక్రమార్క విలేకర్లతో బుధవారం మాట్లాడారు. ఆర్నెల్ల తర్వాత ఇందిరమ్మ రాజ్యం వస్తుందన్నారు. ధరణి వెబ్‌పోర్టల్ సరిచేసి హక్కులు కల్పిస్తామన్నారు. అధికారికంగా పంచిన అసైన్డ్ భూములను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు. ఫార్మాసిటీకి పేదల భూములే ఎందుకు తీసుకున్నారో చెప్పా లని ప్రశ్నించారు. వెట్టి చాకిరి నిర్మూలన కింద పంపిణీ చేసిన భూములను కూడా ప్రభుత్వం లాక్కొందని చెప్పారు. పేదలకు మూడెకరాల భూమిని ఇస్తామన్న బీఆర్ఎస్ మోసం చేసిందని విమర్శించారు. హైదరాబాద్ చుట్టుపక్కల పేదలకు పంచిన 10వేల ఎకరాలను లాక్కొని హెచ్ఎండీఏ లే అవుట్ చేసి అమ్ముకుంటుందని విమర్శించారు. ఒక్క ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలోనే 5లక్షల కోట్ల విలువైన భూములు పేదల నుంచి లాక్కుందని ఆరోపించారు. ఇదేమి సంక్షేమ ప్రభుత్వమని ప్రశ్నించారు.

సోమేష్‌కుమార్‌పై సమగ్ర విచారణ జరపాలి

పేదల భూములు లాక్కునేందుకు రూపొందించిన ధరణి సృష్టికర్త, కుట్రదారు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్‌పై సమగ్ర విచారణ జరపించాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థలను విచారణ కోరుతామన్నారు. సోమేష్ కుమార్ కేంద్ర సర్కారు పంపిన చోటికి పోకుండా ఇక్కడ సీఎస్‌గా కొనసాగారని విమర్శించారు.

బహుళజాతి కంపెనీలకు అంబాసిడర్ మంత్రి కేటీఆర్

పేదల భూములను లాక్కొని బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టేం దుకు మంత్రి కేటీఆర్ అంబాసిడర్‌గా మారిపోయారని విక్రమార్క విమర్శించారు. ఆయన ప్రజల కోసం పని చేయటం లేదనీ, కార్పొరేట్ కంపెనీల కోసమే పని చేస్తున్నారని చెప్పారు. ఓఆర్ఆర్ 30 ఏండ్లకు ఎందుకు లీజుకు ఇచ్చారని ప్రశ్నించారు. పాలకులకు లాభం చేకూర్చే స్కాంలకు బ్యూరోక్రాట్స్ పని చేస్తున్నారని చెప్పారు. సోమేష్ కుమార్‌ను అడ్వైజరీగా వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

ప్రతి గడపకు టీఎస్ఆర్టీసీ సేవలు

విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థకు శ్రీకారం

- లాంఛనంగా ప్రారంభించిన సంస్థ ఎండీ వీసీ సజ్జనార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రాష్ట్రంలోని ప్రతి గడపకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) సేవల్ని తీసుకెళ్లాలనే ఉద్దేశంతో విలేజ్ బస్ ఆఫీసర్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. దీనివల్ల ప్రజా రవాణా వ్యవస్థ మరింత పటిష్టమై ప్రజలకు చేరువ అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు పక్కా ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 1,730 మంది విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థను బుధవారంనాడాయన లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన విలేజ్ బస్ ఆఫీసర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్ఆర్టీసీకి వారే బ్రాండ్ అంబాసిడర్లు అని ప్రకటించారు. ప్రజలకు ఆర్టీసీ యాజమాన్యానికి మధ్య వారు సంధానకర్తల్లాగా వ్యవహరించాలని చెప్పారు. టీఎస్ఆర్టీసీపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం పెంచేలాకృషి చేయాలని చెప్పారు. పెండ్లిండ్లు, శుభకార్యాలకు అద్దె బస్సుల బుకింగ్, కార్గో సేవలు, తిరుమల శ్రీవారి దర్శన సదుపాయం, జాతరలు, సంతల సమయాల్లో ఆయా రూట్లలో బస్సు సర్వీసులు ఏర్పాటు చేసేలా డిపో యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ ఆక్యూపెన్సీ రేషియా(ఓఆర్) పెంచేలా కృషి చేయడం వంటి కర్తవ్యాలు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లోని రవాణా అవసరాలకు ఆర్టీసీనే గుర్తొచ్చేలా ప్రజలతో మమేకమవ్వాలని అన్నారు. విధి నిర్వహణలో అత్యున్నత ప్రతిభ కనబరిచే విలేజ్ బస్ ఆఫీసర్లను గుర్తించి సత్కరించి, ప్రోత్సహకాలు ఇస్తామన్నారు. అనంతరం విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థ పోస్టర్, కరదీపికను ఆయన ఆవిష్కరించారు. విలేజ్ బస్ ఆఫీసర్లకు ఐడీ కార్డు, బ్యాగ్ అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్(విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ) డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, పురుషోత్తం, యాదగిరి, సీపీఎం కష్ణకాంత్, సీటీఎం జీవన ప్రసాద్, చీఫ్ మేనేజర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఎస్టేట్స్) విజయ్ కుమార్, సీఈఐటీ రాజశేఖర్, బిజినెస్ హెడ్ సంతోష్ కుమార్, సీటీఎం (మార్కెటింగ్) సుధా పరిమళ, సికింద్రాబాద్, హైదరాబాద్ ఆర్ఎంలు వెంకన్న, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను కాపాడుకుందాం

ఓయూలో పీహెచ్‌డీ ఫీజు పెంపునకు వ్యతిరేకంగా పోరాడుదాం

- నియంతలా వ్యవహరిస్తున్న వీసీ : ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి విక్కి మహేసరి

నవతెలంగాణ-ఓయూ



ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను కాపాడుకొని.. ఫీజుల పెంపునకు వ్యతిరేకంగా పోరాడుదామని ఏఐఎస్ఎఫ్ జాతీయ జనరల్ సెక్రెటరీ విక్కి మహేసరి పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం డిస్కోర్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగానికి 3 శాతం నిధుల కంటే ఎక్కువ కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేటు యూనివర్సిటీలకు అనుమతులు ఇస్తూ విద్యను కార్పొరేటీకరణ చేస్తున్నదన్నారు. పాఠ్యపుస్తకాల నుంచి భగత్ సింగ్ గురించి, గాంధీని హత్య చేసిన గాడ్సే ఉదంతం పాఠాన్ని, డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని తొలగించి విద్యని కాషాయీకరణే లక్ష్యంగా మార్చుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను ఏకం చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. పార్లమెంటులో భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ చట్టం చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్లు, విద్యార్థులు కూడా కలవడానికి సమయం ఇవ్వకుండా ఓయూ వీసీ నియంతృత్వంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామిక వాతావరణాన్ని దెబ్బతీసున్నారని విమర్శించారు. దేశంలో ఏ యూనివర్సిటీలో లేనివిధంగా ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ ఫీజు రూ. 2000 నుంచి రూ. 20వేలకు పెంచడం పేద, మధ్య తరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడమే అన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై త్వరలోనే ఏఐఎస్ఎఫ్ నేషనల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అశోక్ స్టాలిన్, మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, గ్యారా నరేష్, రహమాన్, నెల్లి సత్య, సాయి భగత్, లెనిన్ పాల్గొన్నారు.

గ్రామీణ 'ఉపాధి' రక్షణకు విశాల ఉద్యమం

- దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జాతీయ గ్రామీణ ఉపాధి చట్ట రక్షణ కోసం ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి విశాల ఐక్య ఉద్యమాన్ని నిర్వహించబోతున్నట్టు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో ఉన్న మోడీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేదలకు 100 రోజులు పనిని గ్యారెంటీ చేస్తూ యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనిని ఎత్తివేయడం కోసం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. బడ్జెట్‌లో భారీగా నిధులు తగ్గించారనీ, కూలీలను తగ్గించడం కోసం అనేక రకాల నిబంధనలను తీసుకొస్తున్నారని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేయాలని చెప్తున్నా పాలకులు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. పనిముట్లు ఇవ్వకుండా కూలీలు ఏ విధంగా పనిచేస్తారని ప్రశ్నించారు. వేతనాల పే స్లిప్పులను ఇవ్వకుండా నిలిపేశారని తెలిపారు. ఐదు కి.మీ దాటిన పని ప్రదేశానికి వెళ్లి రావడానికి లోకల్ ఆటో ఛార్జీలు ఇచ్చే పద్ధతిని రద్దు చేశారని విమర్శించారు. కూలీలు తమంతట తామే పనికి దూరమయ్యే విధంగా కొత్త పద్ధతులను తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమాన్ని చేపడు తున్నామని చెప్పారు. కూలీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధా న కార్యదర్శి ఆర్ వెంకట్రాములతోపాటు వివిధ సంఘాల నాయకులు బి. ప్రసాద్, బి. పద్మ, రాష్ట్ర అధ్యక్షులు కె. కాంతయ్య బీకేఎంయూ ఎస్. శివలింగం, పీఎంసీ రాష్ట్ర కన్వీనర్ జి. నరసింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దళిత బహుజన శ్రామిక యూనియన్ పులి కల్పన డి బీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే కష్ణవేణి ఏ ఎం సి రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

దళితబంధు పథకం స్ఫూర్తిదాయకం

- విప్లవాత్మక కార్యక్రమాలతో ప్రపంచానికి కేసీఆర్ ఆదర్శం
- కేసీఆర్‌కు కృతజ్ఞత సభలో బ్రిటన్ ఎంపీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్న తీరు స్ఫూర్తిదాయకంగా ఉందని పలువురు బ్రిటన్ ఎంపీలు ప్రశంసించారు. ఇలాంటి విప్లవాత్మక కార్యక్రమాలతో భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సీఎం కేసీఆర్ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. బ్రిటన్‌కు చెందిన అంబేద్కర్ యూకే సంస్థ, ప్రవాస భారతీయ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం అక్కడి పార్లమెంట్ కమిటీ హాల్‌లో కేసీఆర్‌కు కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూకే ఎంపీలు వీరేంద్ర శర్మ , నవేదు మిశ్ర, బారోన్ కుల్దీప్ సింగ్ సహోటా, ఇంకా పలువురు స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు. బ్రిటన్‌లో నివసిస్తున్న పలువురు ప్రముఖ ఎన్నారైలతో పాటు, స్థానిక ప్రవాస సంఘాల నాయకులు, తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ దళితుల పట్ల వివక్షను రూపుమాపేందుకు అంబేద్కర్ తన జీవితాంతం పోరాటం చేసిన సంఘసంస్కర్త అనీ, అలాంటి మహనీయుడి భారీ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడమే కాకుండా ఆయన ఆశయాలకు అనుగుణంగా దళిత బంధు పథకాన్ని కేసీఆర్ తెచ్చారంటూ అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో దళితులు ఆర్థికంగా బలపడటమే కాకుండా వారిపట్ల సామాజిక వివక్ష, అసమానతలు తొలగిపోతాయని వారు అభిప్రాయ పడ్డారు. బ్రిటన్‌లోని ఎన్నారై సంఘాల నేతలు మాట్లాడుతూ తెలంగాణ స్ఫూర్తితో భారత దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని దళితుల సంక్షేమం పట్ల ఆయా ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తీసుకునే ప్రతి నిర్ణయం చారిత్రాత్మకమనీ, ప్రపంచవ్యాప్తంగా వాటిపై చర్చ జరుగుతు న్నదని తెలిపారు. దళిత బంధు విజయాలను వివరించారు. మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ దళిత బంధు ద్వారా ఎన్నో దళిత కుటుంబాల్లో సీఎం వెలుగు నింపారని తెలిపారు. దళిత్ యూకే నెట్ వర్క్ డైరెక్టర్ గజాల షేఖ్, అంబే ద్కర్ యూకే సంస్థ ప్రతి నిధి సుశాంత్ ఇంద్రజిత్ సింగ్, ఎన్నారై బీఆర్ ఎస్ యూకే అధ్యక్షులు అశోక్ గౌడ్ దూసరి, ఉపాధ్యక్షులు నవీన్ రెడ్డి, టాక్ అధ్యక్షులు రత్నాకర్ కడుదుల, టీడీఎఫ్ చైర్మెన్ కమల్ ఓరుగంటి, స్థానిక కౌన్సిలర్లు ప్రభాకర్ ఖాజా, ఉదయ్ ఆరేటి, కన్సర్వేటివ్ నాయకుడు హరి, లోకమాన్య తదితరులు పాల్గొన్నారు.

బెదిరించొద్దు...

- జేపీఎస్‌ల డిమాండ్లు పరిష్కరించాలి
- సమ్మెను విరమింపజేయాలి : కేవీపీఎస్ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జూనియర్ పంచాయతి సెక్రటరీ (జేపీఎస్)ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి, తక్షణం వారితో సమ్మెను విరమింపజేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్‌వెస్లీ, టీ స్కైలాబ్‌బాబు బుధవారం నాడొక ప్రకటన విడుదల చేశారు. రెండువారాలుగా జేపీఎస్‌లు చేస్తున్న నిరవధిక సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రొబెషన్ పిరియడ్‌ను దష్టిలో ఉంచుకొని, వారి సర్వీసుల్ని క్రమబద్ధీకరించాలని కోరారు. కేవలం రూ. 15వేలు జీతంతో 60 నుంచి 70 కిలోమీటర్లు ప్రయాణం చేసి విధులు నిర్వర్తిస్తున్నా రెగ్యులరైజ్ చేయకపోవడం సరికాదన్నారు. మొదట మూడేండ్ల ప్రొబిషన్ పిరియడ్ అనీ, ఆ తర్వాత మరో ఏడాది పెంచి మొత్తం నాలుగుగేండ్లు పూర్తయినా, క్రమబద్ధీకరణలో తాత్సారం చేయడంలో అర్థం లేదన్నారు. జీతభత్యాలు కూడా ఒక్కొక్క జిల్లాలో ఒక్కోరకంగా ఇస్తున్నారని చెప్పారు. పొరుగు రాష్ట్రంలో రెండేండ్ల కాలానికే సెక్రెటరీలను క్రమబద్ధీకరణ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తక్షణం వారిని చర్చలకు పిలిచి, సమస్య పరిష్కరించి, సమ్మె విరమింపచేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జేపీఎస్‌ల సమ్మెకు పూర్తి మద్దతు

- కర్నాటకలో మళ్లీ మాకే అధికారం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్) సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాయలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జేపీఎస్‌లది న్యాయబద్ధమైన డిమాండ్ అని అన్నారు. ప్రభుత్వం బెదిరించినా అదరకుండా ఉద్యమం చేస్తున్న వాళ్లకు హ్యాట్సాఫ్ చెప్పారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులంతా కష్టపడి పరీక్ష రాసి ఉద్యోగం తెచ్చుకున్నోళ్లని, ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయినా వారిని ఎందుకు రెగ్యులరైజ్ చేయడంలేదని ప్రశ్నించారు. హైకోర్టు మొట్టికాయలు వేసిన వ్యక్తిని సీఎం తన ప్రధాన సలహాదారునిగా నియమించుకోడం శోచనీయమని అన్నారు. కర్నాటకలో మళ్లీ బీజేపీనే అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఫెయిలయ్యామనే భావనతో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవద్దని, సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదని సూచించారు. అంతకుముందు ఉమ్మడి మెదక్ జిల్లా పోలింగ్ బూత్ కార్యకర్తలతో సంజయ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. బీజేపీ నిర్వహించే 'నిరుద్యోగ మార్చ్'తో సీఎం కుటుంబానికి గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈనెల 11న సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే 'నిరుద్యోగ మార్చ్' ద్వారా గర్జించాలని పిలుపునిచ్చారు. త్వరలో హైదరాబాద్‌లో నిరుద్యోగులతో నిర్వహించే 'మిలియన్ మార్చ్'తో గడీలు బద్దలు కావాలని అన్నారు.

ఉగ్రవాది సులేమాన్ అరెస్ట్

- ఇంటి నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్న ఇంటెలిజెన్స్ అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంతోపాటు మధ్యప్రదేశ్‌లో విధ్వంసాలకు కుట్ర పన్నారని ఆరోపణలు ఎదుర్కొంటూ పరారీలో ఉన్న ఉగ్రవాది సులేమాన్‌ను రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు బుధవారం అరెస్టు చేశారు. నగరం నుంచి ఐదుగురు ఉగ్రవాదులను మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులు మంగళవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరి అనుచరుడైన సులేమాన్ పరారీలో ఉండగా గాలింపు చర్యలు జరిపిన అధికారులు ఎట్టకేలకు జవహర్‌నగర్ ప్రాంతంలో అరెస్టు చేశారు. జవహర్‌నగర్ శివారులోని బాలాజీనగర్‌లో ఇతర ఇండ్లకు దూరంగా ఉన్న ఒక ఇంట్లో టీవీ మెకానిక్‌గా నివసిస్తున్నట్టు అధికారులు తెలిపారు. సులేమాన్ తన ఇంటికి నాలుగు దిక్కుల్లో సీసీ కెమెరానలు పెట్టుకున్నాడని పోలీసు అధికారులు గుర్తించారు. ఇదే ఇంటి నుంచి కొన్ని ఆయుధాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఐ తుది రాత పరీక్ష ప్రిలిమ్స్ కీ విడుదల

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఎస్ఐ పరీక్షకు జరిగిన తుది రాత పరీక్షకు సంబంధించిన ప్రిలిమినరీ కీని రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వీవీ శ్రీనివాసరావు బుధవారం విడుదల చేశారు. అభ్యర్థులు తమ అధికారిక వెబ్ సైట్‌లో ఈ కీని చూడొచ్చని ఆయన తెలిపారు. ఎస్ఐ తత్సమాన పోస్టులకు జరిగిన వివిధ పరీక్షలకు సంబంధించిన కీని విడుదల చేసినట్టు ఆయన తెలిపారు. 11వ తేదీ గురువారం నుంచి ఈ కీని చూడొచ్చని చెప్పారు. అలాగే ఈ కీకి సంబంధించి ఏదేని అభ్యర్థులకు అభ్యంతరాలున్న పక్షంలో వాటికి కచ్చితమైన ఆధారాలను సైట్‌లో అందుకు సంబంధించి కేటాయించిన భాగంలో క్రోడీకరించి తమ అభ్యంతరానుల తెలియచేయాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియ అనంతరం ఫైనల్ కీని విడుదల చేస్తామన్నారు.

మహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహారాష్ట్ర నుంచి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో ప్రగతిభవన్‌లో మహారాష్ట్రకు చెందిన పలువురు రాజకీయ నేతలు, పలు రంగాల ప్రముఖులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి సీఎం కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ రాజకీయ నేత అన్నాబావు సాఠే మనవడు సచిన్ సాఠే, మాజీ జెడ్పీ సభ్యులు వైంటీ వైభవ్ కదం, ప్రమోద్ విఠల్ జాదవ్, సిర్వాల్ సతారా, మేనేష్ రాహుల్ గాడ్సే, అజర్ ఖాన్ (మాజీ ఇండియన్ ఎయిర్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్), వభూ వసంతరావు కదం (ఇండియన్ ఎయిర్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్, రీజినల్ కార్యదర్శి) శ్రీనివాస్ ఇస్తారి ఎలిగేటి (మాజీ కార్పొరేటర్ భివండి) తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే బాల్కసుమన్, రాష్ట్ర సివిల్ సప్లయీస్ చైర్మెన్ రవీందర్ సింగ్, మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలు మాణిక్ కదమ్, శంకరన్న డోంగే, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి హిమాన్షు తివారి పాల్గొన్నారు.

మహిళా డాక్టర్ హత్య

- వైద్య సేవలందిస్తుండగా ఉన్మాది ఘాతుకం
- వైద్యురాలి కుటుంబాన్ని పరామర్శించిన సీఎం విజయన్
- సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ

కొచ్చి : విధి నిర్వహణలో ఉన్న మహిళా డాక్టర్‌ను ఓ ఉన్మాది దారుణంగా హత్య చేసిన ఘటన కేరళలోని కొట్టారక్కర తాలూకా ఆసుపత్రిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో ఇద్దరు పోలీసులు, నిందితుడి బంధువు కత్తిపోట్లకు గురయ్యారు. ఎడిజిపి ఎంఆర్ అజిత్‌కుమార్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం మద్యానికి బానిసైన ఉపాధ్యాయుడు సందీప్ తనను స్థానికులు కొడుతున్నారంటూ పోలీసు ఎమర్జెన్సీ నెంబరుకు ఫోన్ చేశాడు.

సందీప్ శరీరంపై గాయాలుండటంతో పోలీసులు అతని సమీప బంధువు, స్థానికుడితో కలిసి తాలూకా ఆసుపత్రికి తీసుకొచ్చారు. క్యాజువాలిటీలో పరిశీలించిన వైద్యులు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. డ్రెస్సింగ్ రూమ్‌కు తీసుకెళ్లగా, సందీప్ ఒక్కసారిగా ఉన్మాదిలా మారిపోయాడు. సమీపంలోని రెండు కత్తెరలు తీసుకుని హోంగార్డును పొడిచాడు. అక్కడికి పరిగెత్తుకు వచ్చిన ఎఎస్ఐ, అతని బంధువును పొడిచాడు. దీంతో, డాక్టర్లు, సిబ్బంది పక్కగదిలోకి పరుగులు తీశారు. అక్కడ చిక్కుకుపోయిన డాక్టర్ వందనా దాస్‌ను కత్తెరతో పొడవడంతో, ఆమె తీవ్రంగా గాయపడి మరణించారు.

సమగ్ర విచారణ జరిపిస్తాం : సిఎం

ఈ ఘటన గురించి తెలుసుకున్న సిఎం విజయన్ ఆసుపత్రికి చేరుకుని డాక్టర్ వందనాదాస్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. 'డాక్టర్ వందనా దాస్ విధి నిర్వహణలో హత్యకు గురికావడం దిగ్భ్రాంతికరం. అత్యంత బాధాకరం. వైద్యం కోసం తీసుకొచ్చిన వ్యక్తి వైద్యురాలిపై దాడి చేయడం, అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులు, ఇతరులపై దాడి చేయడం ఘోరం. ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తాం' అని సిఎం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టెన్త్‌లో 86.60 శాతం ఉత్తీర్ణత

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షలకు హాజరుకాగా, 4,19,460 (86.60 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలురు 2,43,186 మంది పరీక్షలు రాయగా, 2,05,930 (84.68 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. బాలికలు 2,41,184 మంది పరీక్షలకు హాజరైతే 2,13,530 (88.53 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు కంటే బాలికలు 3.85 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధిం చారు. ఈ ఏడాది 7,492 మంది విద్యార్థులు ప్రయివేటుగా పరీక్షలకు హాజరుకాగా, 3,335 (44.51 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఇందులో 5,162 మంది బాలురు హాజ రైతే 2,223 (43.06 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 2,330 మంది బాలికలు పరీక్ష రాస్తే, 1,112 (47.73 శాతం) మంది పాసయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఎ శ్రీదేవసేన, ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి, మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్‌తోపాటు ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు విజయభారతి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో 72.39 శాతం ఉత్తీర్ణత

పదో తరగతి ఫలితాల్లో రెగ్యులర్ విద్యార్థులకు సంబంధించి 2,793 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. ఈసారి 25 పాఠశాలల్లో 'సున్నా' ఫలితాలొచ్చాయి. తెలంగాణ గురుకుల పాఠశాలలు 98.25 శాతంతో అత్యధిక ఉత్తీర్ణతను నమోదు చేశాయి. ప్రభుత్వ పాఠశాలలు 72.39 శాతంతో అత్యల్ప ఉత్తీర్ణతను సాధించాయి. తెలంగాణ గురుకుల, ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఎస్టీ గురుకులాలతోపాటు మోడల్ స్కూళ్లు, ప్రయివేటు పాఠశాలలు రాష్ట్ర సరాసరి ఉత్తీర్ణత 86.60 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతను నమోదు చేశాయి. కేజీబీవీ, ఎయిడెడ్, జిల్లా పరిషత్, ఆశ్రమ పాఠశాలలు రాష్ట్ర సరాసరి ఉత్తీర్ణత 86.60 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణతను సాధించాయి.

99 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ ప్రథమం

పదో తరగతి ఫలితాల్లో 99 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 9,071 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 8,980 (99 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 4,442 మంది బాలురు పరీక్షలు రాస్తే 4,392 (98.87 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 4,629 మంది బాలికలు పరీక్షలకు హాజరైతే 4,588 (99.11 శాతం) మంది పాసయ్యారు. 98.65 శాతం ఉత్తీర్ణతతో సిద్దిపేట జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 14,177 మంది పరీక్షలు రాయగా, 13,985 (98.65 శాతం) మంది పాసయ్యారు. 97.29 శాతంతో సంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో ఉన్నది. ఈ జిల్లా నుంచి 21,358 మంది పరీక్షలు రాస్తే, 20,780 (97.29 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 59.46 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి వికారాబాద్ జిల్లా ఈ ఫలితాల్లో అట్టడుగున నిలిచింది. ఈ జిల్లా నుంచి 13,399 మంది పరీక్షలు రాయగా, 7,967 (59.46 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు గడువు 26

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల 14 నుంచి 22వ తేదీ వరకు జరుగుతాయని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని అన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసిన వారు ఆ ఫలితాల కోసం ఎదురుచూడకుండా ఈ పరీక్షలకు ఫీజు చెల్లించాలని కోరారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు తుది గడువు ఈనెల 26వ తేదీ వరకు ఉందని చెప్పారు. ఆలస్య రుసుం రూ.50తో ఆ సబ్జెక్టు పరీక్ష ప్రారం భానికి రెండు రోజుల ముందు వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని వివరించారు. ఫలితాలు వెల్లడించిన 15 రోజుల్లో రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేయా లని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు కోరారు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాలని చెప్పారు. ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా చలానా తీసి దరఖాస్తులను నేరుగా కానీ లేదా పోస్టు ద్వారా పంపించాలని కోరారు. డిమాండ్ డ్రాఫ్టులు అంగీకరించబడవని స్పష్టం చేశారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే అవకాశం లేదన్నారు. వివరాల కోసం www. bse.telangana.gov.in వెబ్ సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

యాజమాన్యాల వారీగా వందశాతం, సున్నా శాతం ఫలితాలు

యాజమాన్యం	స్కూళ్ల సంఖ్య	సున్నా శాతం స్కూళ్లు	వంద శాతం స్కూళ్లు
1. ఎయిడెడ్	162	3	16
2. ఆశ్రమ	227	--	38
3. బీసీ గురుకుల	255	--	89
4. ప్రభుత్వ	491	--	23
5. కేజీబీవీ	475	--	91
6. మోడల్	194	--	38
7. ప్రయివేటు	4,966	13	1,410
8. తెలంగాణ గురుకుల	35	--	21
9. మైనార్టీ గురుకుల	207	--	55
10. ఎస్సీ గురుకుల	239	--	73
11. గిరిజన గురుకుల	99	--	24
12. జిల్లా పరిషత్	4,108	9	915
మొత్తం	11,458	25	2,793

విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరం : సబిత

ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని, బంగారు భవిష్యత్తును కోల్పోవద్దని కోరారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ నాలుగో తేదీ నుంచి ప్రారంభమవుతాయని, ఉన్నత చదువులకు వెళ్లే అవకాశ ముందని చెప్పారు.

ఫెయిలైన పదో తరగతి విద్యార్థులు కూడా సంయమనం పాటించాలని సూచించారు. కుటుంబం లో ముగ్గురిని కోల్పోయినా పదో తరగతి పరీక్షలను విజయవంతంగా నిర్వహించి ఫలితాలను విడుదల చేసిన కృష్ణారావును ఆమె ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో గురుకులాల ఫలితాలు మెరుగ్గా వచ్చాయని చెప్పారు. గురుకులాల తరహాలోనే ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు పట్టుదలతో పనిచేయాలని కోరారు.

పదో తరగతి ఫలితాల వివరాలు

రెగ్యులర్	బాలురు	బాలికలు	మొత్తం
హాజరు	2,43,186	2,41,184	4,84,370
ఉత్తీర్ణత	2,05,930	2,13,530	4,19,460
శాతం	84.68	88.53	86.60

ఆరేండ్ల ఉత్తీర్ణత శాతం వివరాలు

సంవత్సరం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2023	4,84,370	4,19,460	86.60
2022	5,03,579	4,53,201	90
2021	5,21,073	అందరూ	100
2020	5,34,903	అందరూ	100
2019	5,06,202	4,67,859	92.43
2018	5,01,732	4,20,365	83.78
2017	5,07,938	4,27,430	84.15

పది జీపీఏ సాధించిన విద్యార్థులు

(గ్రేడ్ పాయింట్ యావరేజ్)

సంవత్సరం	విద్యార్థులు
2023	6,163
2022	11,343
2021	2,10,647
2020	1,41,383
2019	8,676
2018	4,768
2017	2,427

సబ్జెక్టుల వారీగా రెగ్యులర్ విద్యార్థుల ఉత్తీర్ణత (4,84,370 మంది)

సబ్జెక్టు	ఉత్తీర్ణత	శాతం
మొదటి భాష	4,75,197	98.17
ద్వితీయ భాష	4,81,885	99.70
తృతీయ భాష	4,75,843	98.45
గణితం	4,43,743	91.65
సామాన్యశాస్త్రం	4,54,708	93.91
సాంఘిక శాస్త్రం	4,78,483	98.83

మీడియం వారీగా ఉత్తీర్ణత శాతం

మీడియం	హాజరైన విద్యార్థులు	హాజరైన వారు	శాతం
తెలుగు	98,156	71,237	72.58
ఆంగ్లం	3,78,010	3,42,104	90.50
ఉర్దూ	7,758	5,698	73.45
ఇతరములు	446	421	94.39
మొత్తం	4,84,370	4,19,460	86.60

నేడు బ్లాక్ డే

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు నేడు (గురువారం) బ్లాక్ డేని పాటించనున్నారు. నల్ల రిబ్బన్లను ధరించి ఆందోళన చేయనున్నారు. మహిళా రెజ్లర్లకు మద్దతుగా కేంద్ర కార్మిక సంఘాలు నిరసనకు పిలుపునిచ్చాయి. సీఐటీయూ తరపున జాతీయ కార్యదర్శి ఏఆర్ సింధూ సంఘీభావం తెలిపారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్న రెజ్లర్ల ఆందోళన 18వ రోజుకు చేరింది. బాక్సర్ నీరజ్ గోయల్ జంతర్ మంతర్‌ను సందర్శించి మద్దతు తెలిపారు. మన రెజ్లర్లకు అండగా నిలవాలని దేశ ప్రజలను అభ్యర్థించారు.

ప్రజలంతా ఉద్యమంలో చేరాలి: సాక్షి మాలిక్

ఒలింపిక్ పతక విజేత రెజ్లర్ సాక్షి మాలిక్ మాట్లాడుతూ డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు నార్కో టెస్ట్ ద్వారా నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని సవాలు విసిరారు. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) తాత్కాలిక ప్యానెల్‌లో అన్ని పోటీలు జరగాలని మేం కోరుకుంటున్నామని, డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ ప్రమేయం ఏదైనా ఉంటే వ్యతిరేకిస్తామని అన్నారు. ఉద్యమంలో ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. "ఇప్పుడు ఎందుకు గొంతు ఎత్తుతున్నారని అంటున్నారు. ఇప్పుడు మాట్లాడటం సరైనదని అనిపించింది. మేం మాట్లాడుతున్నాం. మీ సోదరి, కూతురు నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు మీరు ఇలా మాట్లాడి ఉండేవారు కాదా?" అని సాక్షి మాలిక్ ప్రశ్నించారు. "మీరు నిజాన్ని దాచవచ్చు, మీరు దానిని అణచివేయలేరు. రేపు నల్ల బ్యాండ్లు కట్టి నిరసన తెలుపుతున్నాం. యావత్ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. అందర్నీ పిలుస్తున్నాం. వచ్చి ఈ ప్రదర్శనలో చేరండి" అని అన్నారు. దేశంలోని న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. రెజ్లర్ వినేశ్ ఫోగట్ మాట్లాడుతూ "రెజ్లింగ్ సమాఖ్యకు విరాళంగా ఇచ్చే నిధులు అథ్లెట్లకు చేరాయో లేదో తనిఖీ చేయాలని రతన్ టాటాను నేను అభ్యర్థిస్తున్నాను" అని అన్నారు.

ఢిల్లీ పోలీసులకు ఢిల్లీ మహిళ కమిషన్ సమన్లు

ఢిల్లీ పోలీసులకు ఆ రాష్ట్ర మహిళా కమిషన్ బుధవారం సమన్లు జారీ చేసింది. పోక్సో కేసులో బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయడంలో విఫలమైనందుకు ఢిల్లీ పోలీసులకు ఢిల్లీ మహిళా కమిషన్ (డీసీడబ్ల్యూ) చైర్ పర్సన్ స్వాతి మలివాల్ సమన్లు జారీ చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయలేదని డీసీడబ్ల్యూ చీఫ్ స్వాతి మలివాల్ తెలుసుకున్న తర్వాత జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ)కి సమన్లు జారీ చేసి, ఈ అంశంపై వివరణ కోరారు. యాక్షన్ తీసుకున్న నివేదికతో మే 12న కమిషన్ ముందు హాజరు కావాలని కమిషన్ డీసీపీని కోరింది.

పార్లమెంటరీ కమిటీకి లేఖ

కేంద్ర క్రీడల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మెన్ వివేక్ ఠాకూర్‌కి టీఎంసీ ఎంపీ సుస్మితా దేవ్ లేఖ రాశారు. రెజ్లింగ్ ఫెడరేషన్ చైర్మెన్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఏడుగురు మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలను ఆమె ప్రస్తావించారు. క్రీడా సమాఖ్యలు, ఇతర సంస్థలకు వర్తించే అన్ని చట్టబద్ధమైన చట్టాల అమలు, క్రీడా మంత్రిత్వ శాఖ పాత్రను సమీక్షించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని కోరారు.

స్టేటస్ రిపోర్ట్ సమర్పించండి: ఢిల్లీ పోలీసులకు ఢిల్లీ కోర్టు నోటీసులు

డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపుల కేసుపై స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ఢిల్లీ కోర్టు కోరింది. నిరసన తెలిపిన రెజ్లర్ల పిటిషన్‌పై న్యాయమూర్తి ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేశారు. రెజ్లర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం ఢిల్లీ కోర్టు అదనపు చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ విచారించారు. మే 12వ తేదీలోగా దీనిపై తదుపరి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను మే 12కు వాయిదా వేశారు.

రెజ్లర్లు ఏప్రిల్ 21న ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రెజ్లర్ల తరపున న్యాయవాది ఎస్ఎస్ హుడా కోర్టుకు తెలిపారు. ఢిల్లీ పోలీసుల అలసత్వం కారణంగా రెజ్లర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారని, ఏప్రిల్ 25న ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసినట్టు ఆయన సూచించారు. ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఫిర్యాదుల వాంగ్మూలాలు నమోదు కాలేదని హుడా తెలిపారు. ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసిన 24 గంటల్లోగా వాంగ్మూలాలను నమోదు చేయాలని పోలీసులను ఆదేశించినట్టు ఆయన తెలిపారు. సింగ్‌పై దాఖలైన రెండు ఎఫ్ఐఆర్‌ల కాపీని కూడా కోర్టుకు అందజేశారు. ఈ కేసును కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేయాలని, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 164 ప్రకారం ఫిర్యాదుదారుల వాంగ్మూలాలను నమోదు చేసేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కూడా పిటిషన్‌లో కోరారు. ఈ నిబంధన స్టేట్‌మెంట్‌లను రికార్డ్ చేయడానికి మేజిస్ట్రేట్‌కు అధికారం ఇస్తుంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని విచారించిన కొన్ని గంటల తరువాత బ్రిజ్ భూషణ్ సింగ్‌పై రెండు ప్రాథమిక సమాచార నివేదికలు (ఎఫ్ఐఆర్‌లు) దాఖలయ్యాయి.

కేంద్రమంత్రి స్మృతి ఇరానీ... మౌనమెందుకు..?: ఏఆర్ సింధూ

జంతర్ మంతర్ వద్ద నిరసన వేదిక వద్దకు చేరుకున్న కార్మిక సంఘాల నేతలు రెజ్లర్లతో సమావేశమై నిరసన కార్యక్రమాలను వివరించారు. న్యాయం కోసం దేశంలోని అన్ని ప్రాంతాల్లో నిరసనలు తెలుపుతామని నేతలు పేర్కొన్నారు. హర్యానాకు చెందిన కార్మిక సంఘాల ప్రతినిధులు గురువారం నిరసన ప్రదేశానికి చేరుకోనున్నారు. బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సిద్ధంగా లేదని, కుల, మత సమీకరణలు కలగలిపి పోరాటాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని సిఐటియు జాతీయ కార్యదర్శి ఎఆర్ సింధు విమర్శించారు. న్యాయ వ్యవస్థను సవాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ధ్వజమెత్తారు. ఇది అనుమతించినట్లయితే, వారు భవిష్యత్తులో అన్ని నిబంధనలను ఉల్లంఘిస్తారని పేర్కొన్నారు. అన్ని విషయాలపై స్పందించే కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ రెజ్లర్ల సమస్యపై మాత్రం మౌనంగా ఉన్నారని సింధు దుయ్యబట్టారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, ఐఎన్‌టీయూసీ నేత అశోక్ సింగ్, ఎఐయూటీయూసీ నేత సంతోష్ రాజ్, టీయూసీసీ నేత రాజేందర్, సేవా నాయకురాలు లత తదితరులు ఉన్నారు.

గెలుపెవరిది..?

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే కన్నడ సినీ తారాగణం కూడా తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంది. సీఎం బొమ్మైతో సహా రాజకీయ ప్రముఖులందరూ ఓటు వేశారు. జేడీఎస్ కింగ్ మేకర్ కాదని, కింగ్ అవుతుందని మాజీ సీఎం కుమారస్వామి వ్యాఖ్యానించారు. బిదాడిలో ఆయన తన ఓటు వేశారు. ఈసారి ప్రజలు పారదర్శక ప్రభుత్వం కావాలనుకుంటున్నారని ఖర్గే వ్యాఖ్యానించారు. కాగా, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 72.36శాతం నమోదైంది.

ఘర్షణలు, దాడులు

కాల్బుర్గిలో బీజేపీ నిర్వహిస్తున్న కాల్ సెంటర్‌పై ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడి చేసింది. కాంగ్రెస్ చేసిన ఫిర్యాదుల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. బీజేపీ అభ్యర్థులకే ఓటు వేయాలంటూ ఆ కాల్‌సెంటర్ నుంచి ఓటర్లకు కాల్స్ వెళుతున్నాయని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. విజయపురా జిల్లాలోని బసవనా బెగవాడి తాలుకాలో మసబినాల్ గ్రామంలో కోపోద్రిక్తులైన గ్రామస్తులు ఈవీఎంలను, వీవీపీఏటీ (ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రెయిల్) యంత్రాలను ధ్వంసంచేశారు. పోలింగ్ అధికారుల వాహనాలు కూడా దెబ్బ తిన్నాయి. పోలింగ్ అధికారిపై కూడా చేయి చేసుకున్నారు. పోలింగ్‌ను మధ్యలోనే ఆపేసి అధికారులు ఈవీఎంలు, వీవీపీఏటీలను మారుస్తున్నారని వదంతులు రావడతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ ఘటనకు సంబంధించి 23మందిని అరెస్టు చేసినట్లు ఇసి ప్రకటించింది. బెంగళూరులోని పద్మనాభ నగర్ నియోజకవర్గంలో పాపయ్యా గార్డెన్ పోలింగ్ బూత్ వద్ద కొంతమంది యువకులు కర్రలతో తమ రాజకీయ ప్రత్యర్థులపై దాడి చేశారు. అక్కడ విధ్వంసం సృష్టించారు. దీంతో ఓటు వేయడానికి క్యూలో నిలుచున్న కొంత మంది మహిళలు గాయపడ్డారు. బళ్ళారి జిల్లాలోని సంజీవరాయనకోటలో కొంతమంది కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలు ఘర్షణ పడ్డారు.

జేడీఎస్‌తో పొత్తు పెట్టుకోం : కేపీసీసీ చీఫ్

కనకపురా నియోజకవర్గంలో ఓటు వేసిన అనంతరం కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.కె.శివకుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్య ఎన్నికల అనంతర పొత్తు వుండబోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందని అయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పారదర్శక ప్రభుత్వం కావాలనుకుంటున్నారు : ఖర్గే

ప్రగతిశీల, పారదర్శక, సంక్షేమ దృక్పథం కలిగిన ప్రభుత్వాన్ని ఎంచుకోవాలని కర్ణాటక ప్రజలు నిర్ణయించుకున్నారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు. పెద్ద సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కల్బుర్గిలోని బసవానగర్‌లోని కీర్తి స్కూల్‌లోని పోలింగ్ కేంద్రానికి తన భార్య రాధాభాయ్ ఖర్గేతో కలిసి వచ్చి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత 55 ఏండ్లుగా ఈ పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తున్నానని, ఇక్కడ ప్రజల ఉత్సాహాన్ని చూస్తే.. కచ్చితంగా కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు.

దాడుల్లో రూ. 58లక్షలు నగదు స్వాధీనం

మంగళవారం చిత్రదుర్గలో జేడీఎస్ అభ్యర్థి రఘు ఆచార్ నివాసం నుండి రూ.58లక్షలను స్వాధీనం చేసుకున్నట్టు ఐటీ, ఎక్సైజ్, ఎన్నికల, పోలీసు అధికారులు తెలిపారు. కవర్లలో పెట్టి పంపిణీకి సిద్ధంగా వున్న మొత్తాలు రూ. 50 లక్షలున్నాయని, మరో 8,83,000 నగదు విడిగా వుందని పోలీసులు చెప్పారు.

అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- తునికి ఆకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో.. విప్ రేగా.. ఎమ్మెల్యే పొదెం.. మధ్య వాగ్వివాదం
- సముదాయించిన ఎస్పీ వినీత్





నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో తునికి ఆకు బోనస్ చెక్కుల పంపిణీ సభ సాక్షిగా ఇద్దరు గిరిజన ఎమ్మెల్యేలు బాహా బాహీకి దిగారు. వారి హోదాను మరిచి నువ్వెంత అంటే నువ్వెంత అనుకుంటూ ఒకరిపై ఒకరు అగ్రహావేశాలు వ్యక్తపరుచుకున్నారు. పరిస్థితి గమనించిన ఎస్పీ వినీత్ వారి వద్దకు వెళ్లి సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. ఆ సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తల్లో సైతం నేతల మధ్య వాగ్వివాదంతో కొంత గందరగోళం ఏర్పడింది. బుధవారం దుమ్ముగూడెం మండల కేంద్రంలో తునికాకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేట్టారు. దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతున్న సమయంలో పొదెం వీరయ్య జోక్యం చేసుకుని 'మంత్రిగారికి అవకాశం ఇవ్వు' అంటూ చెప్పడంతో తమ ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నా.. నీకేంటి అభ్యంతరం అని రేగా కాంతారావు చెప్పడంతో.. వారిద్దరు ఒక్క సారిగా నువ్వెంత అంటే నువ్వెంత అనుకుంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకున్నారు. ఇద్దరి మధ్య ఆవేశాలు కట్టలు తెంచుకోవడంలో అక్కడే ఉన్న ఎస్పీ ఇద్దరినీ సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. తునికి ఆకు సేకరణ అమ్మకం ద్వారా 2016 నుంచి 2022 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ. 290 కోట్లు కార్మికులకు బోనస్ రూపంలో అందజేశామన్నారు. భద్రాద్రి జిల్లాలో మొత్తం రూ.77 కోట్లు విడుదల కాగా భద్రాచలం డివిజన్‌లోని చర్ల, దుమ్ముగూడెం మండలాలకు రూ.27,56,23,000 కార్మికులకు బోనస్ రూపంలో చెల్లించామన్నారు.. అటవీ క్షేత్రాలను సురక్షితంగా ఉంచడం ద్వారానే గిరిజనులకు అడవుల నుంచి ఫలసాయాలు అందుతాయని, దాని ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. గతంలో తునికి ఆకు 50 ఆకుల కట్టకు రూ.2 మాత్రమే చెల్లించేవారని, ఇప్పుడు 50 ఆకుల కట్టకు రూ.3లకు పెంచామన్నారు.

'పది'లో గురుకులాల సత్తా

ప్రయివేటు కంటే మెరుగ్గా ఫలితాలు

- వెనుకంజలో సర్కారు బడులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ రంగంలోని గురుకుల పాఠశాలలు సత్తాచాటాయి. తెలంగాణ గురుకులాలు 98.25 శాతం ఉత్తీర్ణత సాధించి యాజమాన్యాల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాయి. ఎస్సీ గురుకులాలు 95.24 శాతం, బీసీ గురకులాలు 95.03 శాతం, మైనార్టీ గురుకులాలు 94.66 శాతం, గిరిజన గురుకులాలు 92.93 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశాయి. రాష్ట్రంలోని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల కంటే మెరుగైన ఫలితాలు సాధించడం గమనార్హం. ప్రయివేటు పాఠశాలల్లో 90.9 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో వెనుకంజలో ఉన్నాయి. 72.39 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. జిల్లా పరిషత్ బడుల్లో 79.14 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

యాజమాన్యాల వారీగా ఉత్తీర్ణత వివరాలు

యాజమాన్యం	విద్యార్థుల హాజరు	ఉత్తీర్ణత	శాతం
తెలంగాణ గురుకుల	2,680	2,633	98.25
ఎస్సీ గురుకుల	18,000	17,144	95.24
బీసీ గురుకుల	18,001	17,106	95.03
మైనార్టీ గురుకుల	10,773	10,198	94.66
గిరిజన గురుకుల	7,337	6,818	92.93
మోడల్ స్కూళ్లు	18,213	16,629	91.3
ప్రయివేటు పాఠశాలలు	2,16,060	1,96,403	90.9
కేజీబీవీ	16,702	14,006	83.86
ఎయిడెడ్	6,933	5,813	83.85
జిల్లా పరిషత్	1,39,922	1,10,738	79.14
ఆశ్రమ పాఠశాలలు	8,254	6,411	77.67
ప్రభుత్వ పాఠశాలలు	21,495	15,561	72.39
మొత్తం	4,84,370	4,19,460	86.60

కృష్ణాలో వాటా తేల్చాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణ కమిటీని సమావేశపరచాలని మరో నిర్ణయం చేసింది. కృష్ణా జలాల పంపిణీ విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలు పట్టుదలగా వ్యవహరిస్తున్నాయి. ఎలాంటి పరిస్థితుల్లోనూ తగ్గేది లేదంటున్నాయి. తమ వాటా తమకే కావాలంటూ గట్టిగా వాదనలకు దిగాయి. బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)17వ సమావేశం చైర్మెన్ శివనందన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి రెండు రాష్ట్రాల నుంచి తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్సీ సి.మురళీధర్, ప్రత్యేక అధికారులు శ్రీధర్‌రావు దేశ్‌పాండే, విజయ్‌కుమార్, ఏపీ జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఈఎన్సీ నారాయణరెడ్డి ఇతర ముఖ్య ఇంజినీర్లు పాల్గొన్నారు. బోర్డుకు సంబంధించి బడ్జెట్, ఉద్యోగులు, సిబ్బందికి జీతభత్యాలు, ఆడిటింగ్ సంబంధిత అంశాలపై సమావేశంలో చర్చించారు. తాగునీటి వినియోగాన్ని 20 శాతంగానే పరిగణనలోకి తీసుకోవాలన్న తెలంగాణ వాదనపై సాంకేతికంగా అధ్యయనం చేయించాలని బోర్డు నిర్ణయించింది. ఆర్డీఎస్ ఆధునికీకరణపై సీడబ్ల్యూపీఆర్ఎస్ ద్వారా అధ్యయనాన్ని మూడు నెలల్లోపు పూర్తిచేసి, వచ్చే సీజన్‌లో మరమ్మతులు చేయాలని తీర్మానించారు. అత్యవసర మరమ్మతులు ఏవైనా ఉంటే తక్షణమే చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాలకు వాటా అంశంపై భేటీలో ఎక్కువగా చర్చ చోటుచేసుకుంది. గత తొమ్మిదేండ్లుగా ఉన్న 66:34 నిష్పత్తిని కొనసాగించాలని ఏపీ కోరింది. ఆ నిష్పత్తి ప్రాతిపాదికన ఉందని వాదించింది. ట్రిబ్యునల్ తప్ప కేటాయింపులు మార్చే అధికారం ఎవరికీ లేదని పేర్కొంది. తమకు పాత నిష్పత్తి ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదని తెలంగాణ, ఎస్ఎల్‌బీసీ కలిపితే 105 టీఎంసీలు వస్తుందనీ, మొత్తంగా తమకు 811 టీఎంసీల్లో సగం వాటా కావాల్సిందేనని డిమాండ్ చేసింది. 50:50 నిష్పత్తి ప్రాతిపదికనే నీళ్ల వాడుకుంటామని తేగేసి చెప్పింది. తెలంగాణ నీటి అవసరాలు పెరిగాయని వ్యాఖ్యానించారు. అయితే ఎప్పటికప్పుడు అవసరాల ఆధారంగా త్రిసభ్య కమిటీ ద్వారా నీటి విడుదల ఉత్తర్వులు చేస్తూ వాటా తేల్చే విషయాన్ని కూడా కేంద్ర జలశక్తిశాఖకు నివేదించాలని బోర్డు నిర్ణయించింది. పలు సాంకేతిక అంశాలపైనా చర్చలు చోటుచేసుకుంది. 2023-24 సంవత్సరం నదీ జలాలా వాటా వినియోగంపై వాదనలు జరిగాయి. సుమారు రెండు గంటలపాటు తెలంగాణ, ఏపీ మధ్య ఇదే అంశంపై చర్చ కొనసాగడం గమనార్హం. ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల అధికారులు చేసిన చర్చల వివరాలు వారి మాటల్లోనే..

తెలంగాణకు అనుమతులు ఎవరివ్వాలి..? రజత్ కుమార్
తెలంగాణ నీటిపారుదల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

కృష్ణా జలాల్లో తెలంగాణ, ఏపీ వాటా తేల్చే అంశాన్ని కేంద్ర జలశక్తి శాఖకు నివేదించాలని కృష్ణా బోర్డులో నిర్ణయించాం. త్రిసభ్య కమిటీ ఎప్పటికప్పుడు అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదలకు ఆదేశాలు ఇస్తుంది. శ్రీశైలం నుంచి ఏపీ 34 టీఎంసీలు మాత్రమే తీసుకునేలా నిరోధిస్తే జలవిద్యుత్ ఉత్పత్తి అంశంపై మాట్లాడతాం.సుంకిశాల ఇన్‌టెక్ వెల్ పై ఏపీ అభ్యంతరాలు తగవు. తెలంగాణకు ఉన్న కేటాయింపుల నుంచే సుంకిశాల ద్వారా హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం నీటిని తీసుకుంటాం. సుంకిశాలకు అనుమతులు అవసరమా లేదా అన్న అంశాన్ని బోర్డు పరిశీలిస్తుంది. ఆర్డీఎస్ ఆధునీకరణపై సీడబ్ల్యూపీఆర్ సీ ద్వారా మూడు నెలల్లో అధ్యయనం, వచ్చే సీజన్ లో మరమ్మతులు చేస్తారు. ఆర్డీఎస్‌కు అత్యవసర మరమ్మతులు ఉంటే చేపట్టాలని నిర్ణయం తీసుకున్నాం. రాయలసీమ ఎత్తిపోతల, ఆర్డీఎస్ కుడి కాల్వ పనులు చేపట్టడం లేదని ఏపీ తెలిపింది. పాలమూరు - రంగారెడ్డి కేటాయింపులపై అభ్యంతరాలు తగవు. కర్నాటక, ఏపీకి అనుమతి ఇచ్చి తెలంగాణకు ఎందుకు అనుమతులు ఇవ్వరు ? అని ప్రశ్నించారు. తాత్కాలిక ఒప్పందం ప్రాతిపదికన ఇక ఏమాత్రం చెల్లదు. దీని మూలంగా తెలంగాణకు నష్టం జరుగుతున్నది. ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చేంతవరకు 50:50 నిష్పత్తి ప్రాతిపదికన నదీ జలాలు వినియోగించుకునేలా అనుమతులివ్వాలి. ఎలాంటి అధ్యయనాలు లేకుండానే శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్(ఎస్ఆర్‌బీసీ) 11 టీఎంసీలు కేటాయించారు ?. పాలమూరు-రంగారెడ్డిపై ఏపీ అభ్యంతరాలు సరైనవి కావు. త్వరలో డీపీఆర్ అందజేస్తాం. సుంకిశాల తాగునీటి కోసం చేపట్టిందేననీ, ఈనేపథ్యంలో ఎలాంటి అనుమతులు అవసరం లేదు. శ్రీశైలం నుంచి 34 టీఎంసీలను మాత్రమే ఏపీ వినియోగించుకోవాలని, దానిపై మాట్లాడితే జలవిద్యుత్ ఉత్పత్తిపై మాట్లాడం సరికాదు.

నీటి వాటాలు తేల్చాల్సింది ట్రిబ్యునల్ మాత్రమే
శశిభూషణ్ కుమార్, ఏపీ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి

కృష్ణా జలాల్లో 66:34 నిష్పత్తి కొనసాగాలని కోరాం. అదే జరుగుతుంది. బ్రిజేష్ ట్రిబ్యునల్ ప్రకారమే 66:34 నిష్పత్తిలో కేటాయింపులు చేశారు. తెలంగాణ విజ్ఞప్తి మేరకు నీటి వాటాల అంశాన్ని కేంద్ర జల సంఘానికి నివేదించాలని నిర్ణయించారు. ఆర్డీఎస్ ఆధునీకరణపై అధ్యయనం కొనసాగుతుంది. నీటి వాటాలు తేల్చాల్సింది ట్రిబ్యునల్ మాత్రమే. శ్రీశైలం నుంచి ఏపీ 34 టీఎంసీలు మాత్రమే తీసుకోవాలన్న వాదన సరికాదు. ఏపీకి ఉన్న 512 టీఎంసీల నీటి నుంచి మేము ఎక్కడైనా ఉపయోగించుకుంటాం. పోలవరం నుంచి గోదావరి జలాల మళ్లింపుతో సాగర్ ఎగువన 45 టీఎంసీల నీటిని కూడా ట్రిబ్యునల్ కేటాయించాలి. 45 టీఎంసీలు కూడా దిగువ రాష్ట్రమైన ఏపీకి రావాలి. విద్యుత్ ఉత్పత్తి కంటే సాగునీటికి ప్రాధాన్యత ఇస్తాం. కృష్ణా బోర్డును విశాఖకు త్వరలో తరలిస్తాం. వచ్చే నీటి సంవత్సరంలో కృష్ణానది నీటిని ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలు వినియోగించుకునే విధానం నిర్ణయించడానికే ఈరోజు కేఆర్ఎంబీ మీటింగ్ హైదరాబాదులో జరిగింది .ఎప్పుడో 2014 లో ఒక్క సంవత్సరానికి ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక ఒప్పందాన్ని ఏకపక్షంగా ఈరోజు వరకు కేఆర్ ఎంబి కొనసాగిస్తున్నది. దీనివలన కష్ణానది పరివాహక ప్రాంతంలో ఉన్న తెలంగాణ ప్రాజెక్టులకు అనగా ఎస్ఎల్బీసీ ఎంఆర్ ప్రాజెక్టు, కల్వకుర్తి ప్రాజెక్టు, నెట్టెంపాడు ప్రాజెక్టులకు నికరజలాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది.

తాత్కాలిక ఒప్పందాన్ని ఆపాలి
బి.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, అధ్యక్షులు రిటైర్డ్ ఇంజినీర్ల సంఘం

2014లో ఒక్క సంవత్సరానికి జరిగిన తాత్కాలిక ఒప్పందాన్ని ఇంకా కొనసాగించడాన్ని గట్టిగా వ్యతిరేకిస్తూ ఎస్ఎల్బీసీ, ఎంఆర్ ప్రాజెక్టుకు 40 టీఎంసీల నీరు, కల్వకుర్తికి 40 టీఎంసీల నీరు, నెట్టెంపాడుకు 25 టీఎంసీల నీటిని అంటే మొత్తం 299 టీఎంసీలకు అదనంగా 105 టీఎంసీలు నీటిని కేటాయించాలని పట్టుపట్టడంతో సమావేశం ఎలాంటి నీటి పంపకాలు లేకుండా వాయిదా పడింది. నీటి పంపకాల విషయము కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు బదలాయించాలని కోరినట్టు సమాచారం. ఈ విషయంగా తెలంగాణ ప్రతినిధులు అందరినీ మనసారా అభినందిస్తున్నాం. ఇది మన మొదటి విజయంగా భావించాలి. మనకు న్యాయంగా కష్ణానదిలో రావలసిన వాటాని సాధించేంతవరకు ఇదే పోరాటపటిమను కొన సాగించాలి. ఈ విషయమై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అందినకాడికి దోచుడే

(మొదటిపేజీ తరువాయి)

రోజుకు 10వేల నుంచి 20వేల వరకు లారీల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. కాంట్రాక్టర్లు 35మెట్రిక్ టన్నుల లారీకి రూ.14,300, 32మెట్రిక్‌టన్నుల లారీకి రూ.13,200, 26మెట్రిక్ టన్నుల లారీకి రూ.10,800 చెల్లిస్తున్నారు. కానీ 35మెట్రిక్ టన్నులకు అనుమతి తీసుకుని 70మెట్రిక్ టన్నుల ఇసుకను తరలిస్తున్నారు. ఈ లెక్కన తక్కువలో తక్కువ రోజుకు రూ.10.80కోట్ల ఆదాయానికి గండిపడుతున్నట్టే. అధికారుల నిఘా లేదు. ఇసుక తరలింపులో నియంత్రణే కరువైంది.

లోడింగ్ పేరుతో రూ.2500 వసూలు

జయశంకర్‌భూపాలపల్లి, భద్రాదికొత్తగూడెం, ములుగు, కరీంనగర్ జిల్లాలలోని ఇసుక క్వారీల్లో లోడింగ్ పేరుతో రూ.2500 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదేంటని లారీ డ్రైవర్లు ప్రశ్నిస్తే.. మిమ్మల్ని ఎవరు రమ్మన్నారంటూ ఎదురుదాడికి దిగుతున్నారు. జేసీబీ పేరుతో రూ.500, కాంటా సీరియల్ పేరుతో రూ.300 వసూళ్లకు పాల్పడుతున్నారు. జిల్లాస్థాయి అధికారులు మామూళ్ల మత్తులో మునిగితేలుతున్నారు.

సన్న ఇసుక కొరత

వేసవికాలంలో ఎక్కువగా లభ్యమయ్యే సన్న ఇసుక కొరత ఏర్పడింది. రాష్ట్రంలో మూడు క్వారీల్లో మాత్రమే సన్న ఇసుక లభ్యమవుతున్నది. వేసవిలో ఇండ్ల నిర్మాణ పనులు అధికంగా ఉండడంతో దానికి డిమాండ్ పెరిగింది. ఫలితంగా కొరత ఏర్పడింది. అందుకే ఒక్కొక్క క్వారీకి మూడు రోజుల వ్యవధితో బుకింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. వేసవిలోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే వర్షాకాలంలో సన్న ఇసుక పరిసితేంటని బిల్డర్లు, లారీ యజమానులు వాపోతున్నారు. వర్షాకాలంలో సన్న ఇసుకకు భలేగిరాకీ ఉంటుందని భావించిన కొంత మంది డంప్ చేస్తున్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
రామంతాపూర్, ఉప్పల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి

ఇసుక క్వారీలలో లోడింగ్ పేరుతో వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఫలితంలేదు.

కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని లారీ డ్రైవర్ బాలునాయక్ చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



నవ తెలంగాణ - ఉప్పల్

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వరావు అన్నారు. ఈ మేరకు బుధవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సహాయ సహకారంతో విడుదలైన సీఎం సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు రామాంతపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వరావు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ రామాంతపూర్ డివిజన్ కు చెందిన గార్ల చినమ్మకు రూ. 60,000, సత్య లక్ష్మికి రూ.28,000 వేలు విలువ గల చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మనీష్, రమేష్, మద్దూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అవసరమైతేనే బయటకు రావాలి'



నవతెలంగాణ - చైతన్యపురి/ ఎల్బీనగర్

అకాల వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే బయటకు రావాలి అని చైతన్యపురి కార్పొరేటర్ రంగ నరసింహ గుప్తా ప్రజలకు సూచించారు. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ రావడంతో డివిజన్ లోని సత్యనారాయణపురం కాలనీలో భారీ వక్షం, కరెంటు స్తంభం నేలకొరింది. వెంటనే కార్పొరేటర్ అక్కడికి చేరుకొని విరిగిన వక్షం, కరెంటు స్తంభం పనులను జీహెచ్ఎంసీ అధికారులు, ఫారెస్ట్ సిబ్బంది, ఎలక్ట్రికల్స్ సిబ్బందితో కలిసి వెంటనే పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ రోహన్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఫారెస్ట్ మేనేజర్ సాయి, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూరల్ స్పోర్ట్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో

ఇండియా టీంకు ఐదుగురు ఎంపిక



- ఆటగాళ్లను అభినందించిన ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఏ టైప్ క్వార్టర్స్ లో నెలకొల్పిన రూరల్ స్పోర్ట్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కోచర్ల సత్యం, శ్రీనివాస్ ల పర్యవేక్షణలో శ్రీమాన్, నందిత, శ్రీపతి, తన్మయి, సాయి చంద్ర లు ఇండియా టీంకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని బుధవారం ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అభినందించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ స్టేడియాన్ని నెలకొల్పడానికి అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగరాజు ఎన్నో విధాలుగా ప్రయత్నాలు చేశారని గుర్తుచేశారు. క్రీడాకారులను ఇండియా టీంకు ఎన్నికయ్యే స్థాయికి నాగరాజు తీసుకెళ్లారని అభినందించారు. జంట నగరాల్లో రెండు చోట్ల ఉన్న క్రీడా స్థలాలను యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ నిధులతో అందమైన రెండు స్విమ్మింగ్ పూల్స్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, వనస్థలిపురం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చింతల రవికుమార్ గుప్తా, కాలనీ అధ్యక్షుడు ఆనంద్ రాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనంతుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో అందరికీ మేలు

మేయర్ జక్క వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం అనేక మంది ప్రజలకు మేలు చేస్తుందని ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ కమలానగర్ లో ఉన్న అంగన్ వాడీ సెంటర్ లో మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని కార్పొరేటర్ తూంకుంట్ల ప్రసన్నలక్ష్మి శ్రీధర్ రెడ్డి తో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వంశీకష్ణ, శానిటరీ ఇన్ స్పెక్టర్ జానకి, కాలనీ వాసులు పాండు, జంగారెడ్డి, మదన్ మోహన్, పురుషోత్తం, సోమయ్య గౌడ్, రెడ్యానాయక్, మంచినాయక్, ఉపేంద్రచారీ, సోమేశ్, ఫణీధర్, నారాయణరెడ్డి, శాంతమ్మ, నర్సిరెడ్డి, భీమార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదోళ్లకు అండగా ఉప్పల ఫౌండేషన్



నవతెలంగాణ - నాగోల్

పేదోళ్లకు ఉప్పల్ ఫౌండేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక అభివద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురి నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు బుధవారం నాగోల్ లోని ఆయన స్వగృహంలో మంగళసూత్రం, మెట్టెలు, గాజులు, చీరలను అందజేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ వాసి గౌతమి, సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన తేజస్విని, హైదరాబాద్ నగరంలోని నేరేడుమెట్ కు చెందిన కావ్యల వివాహాలకు ఆర్థిక సాయం కోరుతూ వారి కుటుంబ సభ్యులు శ్రీనివాస్ గుప్తను కలిశారు. ఈ కార్యక్రమంలో పెళ్లికూతుళ్లు, వారి బంధువులు, టీఆర్ఎస్ నాయకులు, శైలజ సేవాదళ్ చైర్మన్ బాలు, ఐవీఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసగుప్త , భాను ప్రసాద్,లక్ష్మీనారాయణ, హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ బన్నాలకు బర్త్ డే విషెస్ చెప్పిన శ్రీనివాస్



నవతెలంగాణ - ఉప్పల్

చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత జన్మదిన వేడుకలను బుధవారం టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కార్పొరేటర్ నివాసానికి వెళ్లి ఆమెకు పుష్ప గుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షులు బింగి శ్రీనివాస్ బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని కార్పొరేటర్ కు అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్ అభివద్ధి కోసం కార్పొరేటర్ బన్నాల గీత ఎంతో కషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, ఎద్దుల కొండల రెడ్డి, పార్నంది నర్సింగరావు, అల్లిబిల్లి మహేందర్, మొగిలి పాక రామ్ చందర్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, ఎండీ మహమూద్, సుందర్, కొండా బాలేందర్, డాక్టర్ అశోక్, బీరప్ప గడ్డ బాలు, శ్యామ్ తదితర నేతలు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చుకునేలా నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తా



- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

నవతెలంగాణ- సంతోష్ నగర్

ప్రజలు మెచ్చుకునేలా నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తానని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. సైదాబాద్ డివిజన్ గ్రీన్ ల్యాండ్ కాలనీలో రూ.2లక్షలతో నిర్మించిన స్వాగత తోరణం (ఎంట్రెన్స్ కమాన్)ను బుధవారం ప్రారంభించారు . తర్వాత కాలనీవాసులతో ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాలనీ ప్రముఖులు క్షేత్రస్థాయి సమస్యలు, ఇబ్బందులు తన దష్టికి తెచ్చారని వివరించారు. బల్దియా, జలమండలి అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎమ్మెస్ హాష్మి, గులాం మహమ్మద్, సయ్యద్ ఫరీద్, సభ్యులు మహమ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

పాలన, ప్రతిపాదనలపై సమావేశం..

నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో ప్రభుత్వ పాలన, కొత్త వార్డు కార్యా లయాల ప్రతిపాదనలపై మలక్ పేట సర్కిల్ డీసీ జయంతో ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల సమావేశమయ్యారు. అనంతరం నియోజకవర్గంలో ఆధార్ కార్డుల ఆధునికీకరణ తదితర అంశాలపై యూఐడీఏ, ఈఎస్ఓ విభాగం అధికారులతో కూడా ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ ఎఫెందీ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై కాంగ్రెస్, బీజేపీ నిరాధరణ ఆరోపణలు మానుకోవాలి'



నవతెలంగాణ - హస్తినాపురం

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి పై నిరాధారణమైన ఆరోపణలు చేసిన కాంగ్రెస్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డిలు తమ వైఖరి మార్చుకోవాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ హెచ్చరించారు. హస్తినాపురంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. డివిజన్ పరిధి మల్లికార్జున నగర్ లోని 24 సర్వే నెంబర్ లో ఉన్న 13 గుంటల భూమిలో పది గుంటలు పార్క్ కు కేటాయించి, మిగతాది ఎమ్మెల్యే అనుచరులు ఆక్రమించుకుంటున్నారని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి చేసిన ఆరోపణలను కార్పొరేటర్ తీవ్రంగా ఖండించారు. ప్రధాన రహదారిపై ఉన్న 22 సర్వే నెంబర్లో ఓ వ్యాపారికి చెందిన 3303 గజాలలో 1120 గజాలు ప్రభుత్వ భూమిగా గుర్తించారని, 728 గజాలు ల్యాండ్ అక్విజేషన్లో తీసుకుని డబ్బులు చెల్లించారని.. 1455 గజాలు వ్యాపారికి చెంది ఉందని, మిగతాది ఎంత ఉంటే అది మొత్తం ప్రభుత్వానికి చెందిందని కార్పొరేటర్ పేర్కొన్నారు. అవగాహన, పూర్తి సమాచారం లేకుండా ఆరోపణలు చేస్తే సహించేది లేదని అన్నారు. బీజేపీ నాయకులు రంగారెడ్డి ఆరోపణలు చేసే ముందు తాను చేసిన పార్కుల కబ్జాలు, ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కొనసాగిస్తుంటారని ఆరోపించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివద్ధి చేయటంతో పాటు కాలనీలో నెలకొన్న రిజిస్ట్రేషన్ సమస్యను ప్రత్యేకంగా సీఎం కేసీఆర్ దష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన ఘనత ఎమ్మెల్యేకు దక్కిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నారగొని శ్రీనివాస్ యాదవ్,నాగిరెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

డివిజన్లలో బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవ తెలంగాణ - చైతన్యపురి

ఆర్కే పురం, సరూర్ నగర్ డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిలు బేర బాలకిషన్, మురుకుంట్ల అరవింద్ శర్మలు బుధవారం నూతన అంబేద్కర్ సెక్రటేరియట్ లో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్కే పురం, సరూర్ నగర్ డివిజన్లలో జరుగుతున్న అభివద్ధి పనులు, చేపట్టబోయే పనులపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి తో చర్చించారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ అరకలా కామేశరెడ్డి , సీనియర్ నాయకులు నేలకొండ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదిలో ప్రభంజనం సష్టించిన 'భాష్యం'



నవతెలంగాణ- వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని వనస్థలి పురం భాష్యం విద్యార్థులు బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభంజనం సష్టించారు. 22 మంది విద్యార్థులు 10కి 10కి సాధించగా..26 మంది 9.8, 26 మంది 9.7, 15 మంది 9.5, 27 మంది 9.3, 18 మంది 9.2, 17 మంది విద్యార్థులు 9.0 సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థుకు భాష్యం జెడ్ డీవో అంకమ్మరావు పుష్ప గుచ్ఛాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే. సుజాత, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ హేమ పాల్గొన్నారు.

పదిలో సత్తా చాటిన భాష్యం హైస్కూల్



నవతెలంగాణ - సంతోష్ నగర్

సంతోష్ నగర్ భాష్యం విద్యార్థులు బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 11 మంది విద్యార్థులు 10కి 10, 12 మందికి పైగా 9.8, ఆరుగురు విద్యార్థులు 9.7 జీపీఏలను సాధించారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులకు సెంట్రల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ చైతన్య, జోనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అంకమ్మరావులు పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లీదండ్రులు పాల్గొన్నారు.

పదిలో లోటస్ ల్యాబ్ విద్యార్థుల విజయం



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం, హయత్ నగర్, కమలానగర్ విద్యాసంస్థల్లోని విద్యార్థులు బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యున్నత ఫలితాలు సాధించారు. లోటస్ ల్యాబ్ స్కూల్లో పదో తరగతి పరీక్షలకు 133 మంది విద్యార్థులు హాజరు కాగా.. 14 మందికి 10/10, 70 మందికి 9.0 జీపీఏ ఉత్తీర్ణత సాధించినట్లు చైర్మన్ ఎ. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం 10/10 సాధించిన భావన కతి, కె. కౌశిత, టి. కష్ణ, ఎస్. లిఖిత, ఎస్. మేధారావు, కె. నిధిత, అమెజాన్ కుల్ సుమ, జి. లోకేష్ రెడ్డి, పి. శ్రేయస్, టి. లహరి, ప్రనిష రెడ్డి, ఈ. వైభవ్ డెక్కు, పి. రితిక లకు చైర్మన్ ఎ. శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపల్స్, ప్రిన్సిపాల్ ఉషా కిరణ్, అతికా ఫాతియా, మహాలక్ష్మి, లక్ష్మీ ప్రియలు తదితరులు పాల్గొన్నారు.

పదిలో సత్తా చాటిన ప్రభుత్వ స్కూల్ బాలికలు



నవతెలంగాణ - ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల బాలికలు 91% ఉత్తీర్ణత సాధించినట్లు ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు ఇలాగే చదువులో రాణించి ఉన్నత పదవులు, ఉద్యోగాలు పొందాలని సూచించారు. అనంతరం ఘట్కేసర్ మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ కుతాడి రవీందర్ కూతురు 10వ తరగతిలో ఉతీర్ణులైన సందర్భంగా వారి ఇంటికి వెళ్లి స్వీట్స్ తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, ప్రధాన ఉపాధ్యాయులు అనిత, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హయత్ నగర్, అబ్దుల్లా పూర్ మెట్‌లో

టెన్త్ మిశ్రమ ఫలితాలు



నవతెలంగాణ-హయత్ నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో భాగంగా అబ్దుల్లా పూర్ మెట్, హయత్ నగర్ మండలాల్లోని అన్ని స్కూళ్ల 3ఫలితాలను మండల వైద్యాధికారి హీర్యా నాయక్ తెలిపారు. అబ్దుల్లా పూర్ మెట్ మండలంలోని బండరావిర్యాల గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 100శాతం, కవాడిపల్లి లో 100శాతం, అనాజ్ పూర్ లో 93.85శాతం, కోహెడ లో 87.50శాతం, బాటసింగారం లో 87.34శాతం, తోరూర్ లో 86.44శాతం, రాగన్న గూడ 86.25 శాతం, ఇంజాపూర్ లో 83.81శాతం, తుర్కయాంజల్ లో 83.33శాతం, మజీద్ పూర్ లో 82.61శాతం, అబ్దుల్లా పూర్ మెట్ లో 81.82శాతం, కుత్బుల్లాపూర్ లో 77.78 శాతం, కుంట్లూర్ లో 69.44శాతం, తారామతి పేట లో 68.18 శాతం, తట్టి అన్నారం లో 55.56 శాతం, పసుమాముల లో 54.55 శాతం, పెద్ద అంబర్ పేట లో 54.24 శాతం, మైనార్టీ బీసీ హాస్టల్ లో 89.71శాతం సాధించినట్లు తెలిపారు.

హయత్ నగర్ మండలంలో..

సాహెబ్ నగర్ లో 86.42 శాతం, వనస్థలిపురం లో 71.20 శాతం, హయత్ నగర్ లో 62.89 శాతం, హయత్ నగర్ గర్ల్స్ హాస్టల్ లో 97.10 శాతం, బాయ్స్ హయత్ నగర్ హాస్టల్ లో 90.77 శాతం, బాయ్స్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లో 79.41 శాతంతో పాస్ అయ్యారని మండల వైద్యాధికారి హీర్యా నాయక్ వెల్లడించారు.

'పది'లో శాంతినికేతన్ విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ- వనస్థలిపురం

శాంతినికేతన్ విద్యార్థులు బుధవారం విడుదలైన టెన్త్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ జి. రాధాకష్ణ తెలిపారు. 14 మందికి 10/10, 15 మంది విద్యార్థులు 9.8 గ్రేడ్లు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ జి.ఝాన్సీ రాధాకష్ణ, శేషారావు, జోనల్ ఇంచార్జి జి. సుధీర్, డీన్ ఏ ఫణి శ్రీ ప్రభంజనం తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో విజయరత్న జయకేతనం



నవతెలంగాణ - బోడుప్పల్

విజయరత్న పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదలైన టెన్త్ ఫలితాల్లో అత్యధిక ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. 43 మందికి 10/10, 36 మంది 9.8, 21 మంది 9.7, 27 మంది 9.5, 23 మంది 9.3, 20 మంది 9.2, 16 మంది 9.0 గ్రేడ్ల పాయింట్స్ సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. అనంతరం విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు కె.విజయసేనారెడ్డి, యం.నరేంద్రనాథ్, యం.నరసింహారావు, కె.శ్రీనివాస్ రెడ్డిలు అభినందించి, సన్మానించారు.

పది ఫలితాల్లో శ్రీ చైతన్య ప్రభంజనం



నవతెలంగాణ - బోడుప్పల్

ఉప్పల్ డిపో పరిధిలో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సష్టించారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సామ అశోక్ రెడ్డి తెలిపారు. 12 మందికి సీజీపీఏ, 9.8 సీజీపీఏ 19 మందికి, 9.7 సీజీపీఏ 17 మందికి, 9.5 సీజీపీఏ 39 మందికి, 9.3 సీజీపీఏ 16 మందికి, 9.2 సీజీపీఏ 22 మందికి, 9.0 సీజీపీఏ 25 మందికి, అదేవిధంగా 150 మందికి పైగా 9.0 సీజీపీఏ సాధించినట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ సామ శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరిసిన కర్మన్ ఘాట్ శ్రీ చైతన్య



నవ తెలంగాణ- సంతోష్ నగర్

లింగోజిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ చైత్యం కర్మన్ ఘాట్ స్కూల్ విద్యా ర్థులు పది ఫలితాల్లో విజయాన్ని సాధిం చారని ప్రిన్సిపాల్ సయ్యద్ ఖాసిం అలీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చర్విత, హాసిని, విశిష్ఠ, దశమి, ధీరజ్, స్నిగ్ధ, స్ఫూర్తి, శరణ్య, అనిరుధ్, తారకరామ, అజ్కియా ఫాతిమ, సహస్ర, రేవంత్ లు 10/10 సాధించారని తెలిపారు. 24 %ఖుజశీఅు 9.8.8.2-3, 39 08 9.7.2012.జీ%, 48 మంది 9.5. జీ.పీ.ఏకి పైగా సాధించారని చెప్పారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, జోనల్ ఏజీఎం సతీష్, ఎగ్జిక్యూటివ్ జాన్ ప్రవీణ్, అకాడమిక్ కో ఆర్డినేటర్స్ రఘువంశీ, బీటీంద్రులు, రవీందర్ రెడ్డి, వెంకటరెడ్డి టీచర్లు పాల్గొన్నారు.

'పది'లో నారాయణ ఉత్తమ ప్రదర్శన



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ నారాయణ పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదలైన టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచినట్లు ఏజీఎం బాల పరమేశ్వర్ తెలిపారు. 25 మందికి 10/10, 25 మంది 9.8, 16 మంది 9.7, 26 మంది 9.5, 15 మంది 9.3, 13 మంది 9.2, 7 మంది విద్యార్థులు 9.0 సీజీపీఏ లను సాధించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యవాణి, కో అర్డినేటర్ అజాద్ పాల్గొన్నారు.

ఘనంగా కార్పొరేటర్ బన్నాల గీత జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- ఉప్పల్

చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత జన్మదిన వేడుకలను బుధవారం కార్పొరేటర్ వార్డు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, గంధం జోష్ణ నాగేశ్వరరావు, మేకల హనుమంతు రెడ్డిలు కార్పొరేటర్ గీతకు పుష్ప గుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎదుల్ల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగన్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో మెరిసిన మేడిపల్లి జిల్లా పరిషత్ స్కూల్



నవతెలంగాణ - బోడుప్పల్

పదో తరగతి ఫలితాల్లో మేడ్చల్ జిల్లా మేడిపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ తెలిపారు. పాఠశాలకు చెందిన జోయా తరుణం జీపీఏ 9.5, వై.వనజ జీపీఏ 9.3, వై.అంజలీ జీపీఏ 9.3, బి.శిరీష జీపీఏ 9.2, అర్.పూజ జీపీఏ 9.2, ఎన్.శిరీష జీపీఏ 9.2 సాధించినట్లు ఆయన తెలిపారు. 83 మంది విద్యార్థుల్లో 76 మంది పాసైనట్లు చెప్పారు.

'పది'లో లయోలా మోడల్ స్కూల్ విజయకేతనం



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని లయోలా మోడల్ స్కూల్ బుధవారం విడుదలైన పది పరీక్ష ఫలితాల్లో విజయకేతనం ఎగురవేసింది. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ గంగినేని వెంకట్రావు మాట్లాడుతూ పదికి పది భార్గవ్ ఆనంద్, సిహెచ్ శివ, కె శ్రీకర్, మోషితా ప్రధాయిని, సిహెచ్ శ్రీ వర్షితలు, 9/8 శాతం 13 మంది, 67 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.మ్యాక్స్ లో పదికి పది 67 మంది విద్యార్థులు, సైన్స్ లో 10కి 10 37 మంది, సోషల్ లో పదికి పది 36 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో విజయకేతనం ఎగురవేశారని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ గంగినేని వెంకట్రావు అభినందించారు.

మైనార్టీ బాలికల గురుకులంలో వంద శాతం ఉత్తీర్ణత



నవతెలంగాణ- నాగోల్

నాగోల్ డివిజన్ బండ్లగూడలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల లోని విద్యార్థులు బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ అరుణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 51 మంది విద్యారులు పరీక్షలురాసినట్లు తెలిపారు. వాసవి 9.8, బి.సాత్విక 9.8, ముగ్గురు 9.3, మరో 11 మంది విద్యార్థులు 9.0, మిగతా విద్యార్థు లు 9లోపు జీపీఏలను సాధించినట్లు చెప్పారు.

'పది'లో మెరిసిన భాష్యం స్కూల్



నవతెలంగాణ - చైతన్యపురి

చైతన్యపురిలోని భాష్యం పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల జెడ్ ఈవో అంకమ్మరావు అన్నారు. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ 5 గురు విద్యార్థులకు 10/10, 11 మందికి 9.8, 9 మంది 9.7, 61 మంది పైగా విద్యార్థులు 9 జీపీఏలు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ భానుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లీదండ్రులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శ్రీఆదిత్యకు సంచలన ఫలితాలు



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ కు చెందిన శ్రీ ఆదిత్య ఐటీ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు బుధవారం విడుదలైన టెన్త్ ఫలితాల్లో సంచలన ఫలితాలు సాధించారు. మునగాల దినేష్, కె. కోమల్, పి. సిద్ధార్థ రెడ్డిలు 10/10 సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. మొత్తం 48 మంది విద్యార్థులకు గాను 47 మంది ఉత్తీర్ణత సాధించారు. మంగిదీప్, సాయి మనస్వ, స్వాతికలు 9.8 గ్రేడ్లు సాధించి ద్వితీయ స్థానంలో, 19 మంది విద్యార్థులు 9.0 గ్రేడ్ పాయింట్లు సాధించినట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ కెఎస్ వి సుధాకర్, ప్రిన్సిపాల్ సరిత, అధ్యాపక బృందం తెలిపారు.

పది ఫలితాల్లో డాన్ బర్డ్స్ విద్యార్థుల విజయకేతనం

నవతెలంగాణ-బేగంపేట్

పదో తరగతి ఫలితాల్లో డాన్ బర్డ్స్ పాఠశాల విద్యార్థులు సికింద్రాబాద్ మండల స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు లహరి 9.8, లోకేష్ 9.8, వైశాలి 9.7, రుద్ర ప్రతాప్ 9.7, నవ్య 9.5, సంహిత 9.3, రోషిని 9.2, గౌతమి 9.2, కావ్యాంజలి 9.0, మైత్రి 8.8, అక్షయ 8.8, మౌనిక 8.5 జీపీఏతో మంచి ఫలితాలు సాధించారు. మిగతా విద్యార్థులు కూడా మంచి జీపీఏతో 90శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.



బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ చక్రిపురంకు చెందిన వెంకట్ వాషింగ్ సెంటర్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు రూ.10వేలను చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఆపదలో తమ ట్రస్టు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు యాదగిరి, బాబు, ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తలసానికి తెలిసింది పెండ పిసుకుడే..

- దమ్ము, ధైర్యం ఉంటే డేట్, టైం, స్థలం ఫిక్స్ చేయ్
- మల్కాజిగిరి ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-కంటోన్మెంట్

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పెండ పిసుకుడు మాత్రమే తెలుసు అని మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ బోర్డు సమావేశానికి హాజరైన ఎంపీ బోర్డు కార్యాలయం ఎదుట విలేకర్లతో మాట్లాడారు. తలసాని జన్మలో తన స్థాయికి కాలేడు అన్నారు. పెండ పిసకడమే తప్ప శ్రీనివాస్ యాదవ్‌కు ఏమీ తెలియదు అని విమర్శించారు. శ్రీనివాస్ యాదవ్‌కు దమ్ముంటే డేట్, టైమ్, స్థలం ఫిక్స్ చేస్తే వస్తా అనీ, అక్కడ చూసుకుందామని సవాల్ విసిరారు. పీసీసీ చీఫ్ రేవంత్‌పై ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ చేసిన వ్యాఖ్యలకు దీటుగా సమాధానం ఇచ్చారు. రేవంతును పిసికేస్తా అంటూ తలసాని కామెంట్ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై రేవంత్ ఘాటుగా స్పందించారు. తలసానికి తెలిసింది బర్రెల పెండ పిసకడమేనని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్ కాళ్లు పిసికి తలసాని ఈ స్థాయికి వచ్చాడని ఎద్దేవా చేశారు. రాజకీయ నాయకులు హుందాగా మాట్లాడాలని సూచించారు. ముందు పాన్ పరాక్ తినడం మానుకోవాలని మంత్రి తలసానికి సూచించారు. కంటోన్మెంట్ నుంచి రాష్ట్ర సర్కారు నిధులు దొంగిలిస్తుందన్నారు.



వాడివేడిగా కంటోన్మెంట్ బోర్డు సమావేశం

- పలు అభివృద్ధి పనులకు ఆమోదం



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు బోర్డు తీర్మాణించింది. బుధవారం బ్రిగేడియర్ సోమశంకర్ అధ్యక్షతన నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, సీఈవో మధుకర్ నాయక్ పాల్గొనగా ఎక్స్ అఫీషియో సభ్యుని హెూదాలో మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డి పాల్గొని పలు అంశాలపై చర్చించారు ముఖ్యంగా కంటోన్మెంట్‌లో టోల్ టాక్స్ ఆదాయం పోవటం ఏర్పడిన కొరత తీర్చుకోవటానికి ప్రత్యామ్య ఆదాయ మార్గం కోసం చర్చించారు. కారుణ్య ఉద్యోగాలను త్వరగా నియమించాలన్న అంశంపై కూడా చర్చించారు. బోయిన్‌పల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న గాంధీ ఐడియా భవన నిర్మాణంపై కూడా చర్చ సాగింది. అనంతరం కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వచ్చిన ప్రతిపాదనను ఆమోదించారు. ఎంపీ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సాయన్న విగ్రహంతో పాటు నంది ఎల్లయ్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. నంది ఎల్లయ్య కూడా కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. రోడ్ల విషయం పైన కూడా చర్చ సాగింది. బోయిన్‌పల్లి పెన్షన్ లైన్ దారిని కూడా తెరవాలని రేవంత్ రెడ్డి కోరారు. రక్షణశాఖ స్థలంలో నివాసం ఉంటున్న ప్రజలకు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక, శాశ్వత ఇండ్ల నిర్మాణం చేపట్టానికి చర్యలు కూడా తీసుకోవాలని ప్రస్తావించారు. కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనుల కోసం అవసరమైతే తన నిధులను అందజేస్తానని ఎంపీ రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు సోమశేఖరన్, సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-బేగంపేట్

పదో తరగతి ఫలితాల్లో ఈస్ట్ మారెడ్‌పల్లిలోని శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రమ్య మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 98శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఎంతో కష్టపడి వారికి విద్య బోధలను అందించడంతో వారు ప్రతిభ కనబరిచారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల కృషి కూడా ఎంతో ఉందని ఆమె తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కలిసి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఏజీఎం క్రిష్ణ, ఆర్ఐ హరికృష్ణ జోనల్ ఎగ్జిక్యూటివ్ డీన్ పుల్లరావు, జోనల్ అకాడమిక్ కో-ఆర్డినేటర్ రవి, జోనల్ డీన్ ప్రవీణ్ కుమార్, డీన్ భిక్షపతి, సీబ్యాచ్ ఇన్‌చార్జి స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ భబిత, ప్రైమరీ ఇన్‌చార్జి ఉమాదేవి, తదితరులు విద్యార్థులను అభినందించారు.

'ఇంటర్'లో ఎస్సార్ శ్రీ గాయత్రి విద్యాసంస్థల ప్రభంజనం

నవతెలంగాణ-కాప్రా

ఇంటర్ పలితాల్లో ఎస్సార్ శ్రీ గాయతి విద్యాసంస్థల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ, సూక్ష్మ ప్రణాళిక వల్ల ఈ ఫలితాలు కేవలం కొంతమంది విద్యార్థులకు పరిమితం కాలేదని విద్యాసంస్థల డైరెక్టర్ ఏ.సంతోష్ రెడ్డి, డీజీఎం భగవాన్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ కె.శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జి పి.కృష్ణగౌడ్, ప్రిన్సిపాల్ మంద తిరుపతి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పటిష్టమైన అకాడమీకి ప్రణాళిక, విద్యార్థుల నిర్విరామ కృషి, తల్లితండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహం వల్ల ఈ ఫలితాలు సాధ్యమైనట్టు ఎస్సార్ శ్రీ గాయతి విద్యాసంస్థల ప్రతినిధులు తెలిపారు.

జూనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ విభాగంలో

ఎంపీసీ డి.లావణ్య హాల్ టికెట్ నెం 2359131589, మార్కులు 467, జూనియర్ ఎంపీసీ, హాల్ టికెట్ నెంబర్ 2359125595, ఏ.శ్రీవిద్య, హాల్ టికెట్ నెంబర్ 2358162287 మార్కులు 457, జూనియర్ ఎంపీసీ ఎ.శృతి, హాల్ టికెట్ నెంబర్ 2359156078 మార్కులు 467, బైపీసీ 2358121757 మార్కులు 436, ఎంఇసి 2359152974 మార్కులు 492, సిఇసి గ్రూప్, సైదా ముద్ర 2361102092 మార్కులు 489 ఎంతోమంది విద్యార్థులు అద్భుతమైన మార్కులు సాధించారు.

సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ విభాగంలో..

ఎంపీసీ, హాల్‌టికెట్ నెంబర్ 2359222680 మార్కులు 992, ఎంపీసీ, 2359214162 మార్కులు 992, బైపిసి, విజయ్‌రాయ్, హాల్‌టికెట్ నెంబర్ 2358237953 మార్కులు 992, ఎంఈసి వై.ప్రేరణ, హాల్‌టికెట్ నెంబర్ 2359221467 మార్కులు 986, ఎంతోమంది అద్భుతమైనమార్కులు సాధించారు.

టెన్త్ ఫలితాల్లో మాతృశ్రీ విద్యాలయ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

టెన్త్ ఫలితాల్లో మల్కాజిగిరి ఆర్‌కె నగర్‌కు చెందిన మాతృశ్రీ విద్యాలయ హైస్కూల్ 95 శాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాలకు చెందిన తేజశ్వరీ 9.5 జీపీఏ, దుర్గా ప్రసాద్ 9.2 జీపీఏ, మధుమతి 8.7 జీపీఏ, హేమ శ్రీ 8.0 జీపీఏ సాధించారు. మరో విద్యార్థి గ్రేడ్ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.సందీప్, హెచ్ఎం ఎన్.వినీల మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 16 మంది పాసైనట్టు చెప్పారు. తమ పాఠశాల ఈ ఏడాది 95 శాతం ఉత్తీర్ణత సాధించిందని తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

లిటిల్ ప్యార్ల్స్ హై స్కూల్ టాపర్స్‌గా భువన, మనూష



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

పదవ తరగతి ఫలితాల్లో నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన భువన, మనూష అనే విద్యార్థినిలు 10 /10 సాధించి టాప్‌లో నిలిచారు. లిటిల్ ప్యార్ల్స్ హై స్కూల్‌లో చదువుతున్న వీరిద్దరూ భారీ మార్కులు సాధించి, స్కూల్ టాపర్స్‌గా నిలవడం విశేషం. తమ పాఠశాల విద్యార్థులు 10 /10 సాధించడం సంతోషంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ కాజా గౌసుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా మిగతా 22 మంది విద్యార్థినులు జీ.పీ.ఏ 9.0కి మించి సాధించిన విద్యార్థులను పాఠశాల్లో పుష్ప గుచ్చంతో సత్కరించి బాణా సంచా పేల్చి మిఠాయిలు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు.

'పది' ఫలితాల్లో హెలెన్ కెల్లర్స్ విద్యార్థుల వంద శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

పదో తరగతి ఫలితాల్లో నేరేడ్‌మెట్‌కు చెందిన హెలెన్ కెల్లర్స్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ఆ పాఠశాల ఫౌండర్ చైర్మన్ ఫఠాన్ ఉమ్మర్ ఖాన్ తెలిపారు. బుధవారం వెలువడిన ఫలితాల పట్ల, తమ పాఠశాల విద్యార్థులు సాధించిన ఫలితాలు పట్ల ఆయన తన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. తమ పాఠశాల నుంచి 16 మంది బధిర విద్యార్థులు పరీక్షలు రాయగా 16 మంది పాస్ కావడం హర్షం అని తెలిపారు. ఎంతో మంది బధిరులు కళ్ళతో చదువుకుదరని చేతులతో మాట్లాడగలరనీ, వికలాంగులైనప్పటికీ తాము సైతం సకలాంగులతో అన్ని రంగాల్లో పోటీ పడగలం అని నిరూపించుకోగలిగారని అభినందించారు. వీరికి చేయూత కావాలి కానీ, సానుభూతి కాదని చైర్మన్ ఫఠాన్ ఉమ్మర్ ఖాన్ పేర్కొన్నారు.

మండల తహశీల్దార్‌కు వినతి

కాప్రా : జై భీమ్ జై భారత రాజ్యాంగం ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశారాదన్ మహారాజ్ ఇచ్చిన ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా కాప్రా మండలంలోని ఎమ్మార్వోకి వినతిపత్రం అందజేశారు. దేశంలోని ప్రతి పౌరునికీ భారత రాజ్యాంగాన్ని ఉచితంగా ఇవ్వాలన్నారు. అందులో ఉన్న మౌలిక అంశాలు, చట్టాలపైన ఈ ప్రభుత్వాలు అవగాహన కల్పించాలని కాప్రా మండల కో-ఆర్డినేటర్ శ్రీధర్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ శ్రీధర్ మహారాజ్, శ్రీనివాస్ మహారాజ్, రవి మహారాజ్, రమేష్ మహారాజ్, కుమార్ మహారాజ్, ఉపేందర్ మహారాజ్, శ్రీనివాస్ మహారాజ్, ధర్మేష్ మహారాజ్ సైదులు మహారాజ్ పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో సత్తా చాటిన సెరినిటీ విద్యార్థులు



నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. కె.వి.ఏఅద్వైత, ఎం. ప్రియాంక, వై.ప్రతిభ 10 గ్రేడ్ పాయింట్లు సాధించి అత్యుత్తమంగా రాణించారు. అక్సాషరీన్, ఈ.రిషిత, సాయి హర్షిత్ 9.8 గ్రేడ్ పాయింట్లు సాధించారు. 13 మంది విద్యార్థులు 9.7 గ్రేడ్‌ను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, పాఠశాల ముఖ్య కార్యదర్శి నోముల వసంతా రెడ్డి అభినందించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందే : జె.రామకృష్ణ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికార ఒప్పందం చేసుకున్నాయనీ, రెండు పార్టీలూ దొందు దొందుగా ఉన్నాయనీ, బోయిన్‌పల్లిలో జాతీయ రహదారికి 44కు అనుకుని ఉన్న రూ.800 కోట్ల విలువైన 8 ఎకరాల భూమిని కేసీఆర్ ప్రభుత్వం కాంగ్రెస్‌కు ధారాధత్తం చేసిందనీ, ఆ స్థలాన్ని కాంగ్రెస్‌కు అప్పగిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో తీసుకురావడమే ఇందుకు నిదర్శనమని బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం బోర్డు సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ స్థలంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కడితే ఎంతగానో ఉపయోగపడుతుందనీ, అలాంటిది కాంగ్రెస్‌కు గిఫ్ట్‌గా ఇచ్చిందని తెలిపారు. కంటోన్మెంట్ బోర్డ్ ప్రాంతంలో డిఫెన్స్ స్థలాల్లో ఉంటున్న పేద ప్రజలకు ప్రభుత్వం పక్కా ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం బోర్డు పరంగా కూడా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు

ఘనంగా గజ్జల నాగేష్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారుడు, తెలంగాణ రాష్ట్ర బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నాగేష్ జన్మదిన వేడుకలను బుధవారం కార్యకర్తలు కార్ఖానలోని నాగేష్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెూం మంత్రి మహ్మమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండుయాదవ్, సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్, నగేష్ కలిసి పుష్పం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు గజమాలలతో నాగేష్‌ను సన్మానించారు.

అంచెలంచెలుగా డివిజన్ అభివృద్ధి : కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వెంకటాపురం డివిజన్‌ను అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తున్నట్టు కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ తెలిపారు. బుధవారం ఆమె డివిజన్ పరిధిలోని వెంకటాపురంలో రూ.33 లక్షలతో చేపట్టబోయే అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఆయా అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించుతూ, త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. 135వ డివిజన్‌ను ఆదర్శవంతంగా మారుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్ కిషోర్‌గౌడ్, మోసిన్ సంతోష్ విజయ శేఖర్, రఘుపతిరెడ్డి, జనార్ధన్, ప్రకాష్, అరుణ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి : ముకుంద్‌రెడ్డి



నవతెలంగాణ-బేగంపేట్

విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా తమకు ఇష్టం ఉన్న క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి అందులో రాణించాలని జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ ముకుంద్ రెడ్డి సూచించారు. నగరంలోని జీహెచ్ఎంసీ వేసవి శిక్షణా శిబిరాల్లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు బుధవారం సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని స్విమ్మింగ్ పుల్ వద్ద స్పోర్ట్స్ క్విజ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారికి సర్కిల్ 16 ఉపకమిషనర్ వేణుగోపాల్, గేమ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్, బాక్సింగ్ కోచ్ కృష్ణతో కలిసి ముకుంద్‌రెడ్డి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాదీ వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది ఆయా క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తున్నారని తెలిపారు. తల్లి దండ్రులు తమ పిల్లలను విద్యకే పరిమితం చేస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నారనీ, క్రీడల్లో వారికి శిక్షణ అందించాలని సూచించారు. క్రీడలతో కూడా ఎంతో మంచి భవిష్యత్ ఉంటుందనీ, దేశానికి పేరు తేవడంలో క్రీడాకారుల పాత్ర ఎంతో ఉందని చెప్పారు. క్విజ్‌లో మొదటి బహుమతి షీమ సుల్తానా, ఎండీ అహిల్, ద్వితీయ బహుమతి వర్ష అంబికా, తృతీయ బహుమతి అఖిబ్, రిషికేష్ దక్కించుకున్నారు.

సమస్యల వలయంలో.. గోషామహల్..



నవతెలంగాణ-బేగంపేట్

గోషామహల్ నియోజకవర్గంలోని సమస్యలు కొట్టుమిట్టాడుతున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. బుధవారం ఖైతరాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాననీ, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కూడా కలిసి సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. బేగంబజార్ ఎప్పుడూ రద్దీగా ఉంటుందనీ, అక్కడ మరుగుదొడ్లు లేకపోవడం వల్ల వచ్చే వ్యాపారస్తులు, వినియోగదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే మరుగుదొడ్లను నిర్మించాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పూజా వ్యాస్ బిలాల్ సునీల్ సాహెూ కిషోర్ సింగ్ ప్రదీప్ రాజ్ రాజ్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్కేపురం చెరువు సందర్శన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు బుధవారం నీటిపారుదల శాఖ అధికారులు ఏఈ పృథ్వీ, డీఈ పవన్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణాపురం (ఆర్ కె పురం) చెరువును పరిశీలించారు. ఈ చెరువును త్వరలోనే ఆధునీకరణ పనులు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ చెరు వులో ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటు చేసి, చెరువు పూడికతీత, గుర్రపు డెక్క చెరువులో పెరగకుండా శాశ్వతమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చుట్టు పక్కల కాలనీల్లోని డ్రయినేజీ వాటర్ చెరువులోకి రాకుండా పక్కన ఏర్పాటు చేస్తున్న తూము ద్వారా బండ చెరువులో కలిసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దోమలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత ప్రాతిపదికన చెరువును శుద్ధి చేయడంతో పాటు, చెరువులో మురుగు కలవకుండా చర్యలు తీసు కుంటామని నీటిపారుదల శాఖ అధికారులు చెప్పారు. ఈ చెరువు ఆధునీకరణ పనులు పూర్తయిన తర్వాత చుట్టుపక్కల కాలనీలకు ఉపశమనం కలుగుతుంద న్నారు. చెరువులో డ్రయినేజీ నీరు కలవకుండా చేపడుతు న్న తూము పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, అధికార ప్రతినిధి జీఎన్‌వీ సతీష్ కుమార్, సీనియర్ నాయకులు ఎస్ఆర్ ప్రసాద్, ఎమ్మెల్యే పీఏ స్వామి, వేముల రాజు, వినోద్, కన్నా, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

58,59 జీవో పై అవగాహన సదస్సు



నవతెలంగాణ-బంజారాహిల్స్
యం.యస్. మక్తలో జీవో 58,59 అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ ఫ్లెక్సీ ద్వారా కాలినడక చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ స్థానిక డివిజన్ అధ్యక్షులు హైమద్ భాయ్, మాజీ కార్పొరేటర్ నారాయణమ్మ, యం.అర్. ఓ అన్వర్ హుస్సేన్, డిప్యూటీ యం.అర్. ఓ కిరణ్,అర్.ఐ.రాహుల్ స్థానిక నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఎడ్ల సుధాకర్ రెడ్డి తండ్రి దశదినకర్మకు హాజరైన మంత్రి



నవతెలంగాణ-అంబర్ పేట
బీఆర్ఎస్ పార్టీ అంబర్ పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి తండ్రి ఎడ్ల నారాయణరెడ్డి దశ దిన కర్మ కార్యక్రమానికి మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ మధుసూదన్ చారి, ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ హాజరై ఎడ్ల నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాలా ప్రమాదాలకు చెక్..!

- ప్రమాదాల నివారణకు జీహెచ్ఎంసీ పటిష్టమైన భద్రత చర్యలు

నవతెలంగాణ-సిటీబ్యూరో
నాలాలు అన్యాక్రాంతం కాకుండా, ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జీహెచ్ఎంసీ నాలా భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, రానున్న వర్షాకాలానికి సంబంధించి నాలా భద్రత ఆడిట్‌ను చేపట్టింది. ముఖ్యంగా రానున్న వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలను తీసుకునేందుకు సర్కిల్ వారీగా నాళాల స్కెచెస్‌ను నిర్ధారించి ఒక్కొక్క స్కెచెస్‌కు ఒక ఏఈ లేదా, డిప్యూటీ ఈఈలను బాధ్యులను చేయాలని నిర్ణయించారు. కేటాయించిన స్కెచెస్‌లో పూడికతీత, ఇతర లోపాలను క్షేత్రస్థాయిలో గుర్తించి ఏమైనా మిస్సయిన నాలాల పూర్తి వివరాల నివేదికను ఈ నెల చివరి వరకు కమిషనర్ అందజేయనున్నారు. అంతే కాకుండా ప్రహరీ గోడల పునరుద్ధరణ, చైన్ లింక్, ఫెన్సింగ్, బ్యారికేడ్లు, ఓపెన్ నాలా , డ్రెన్‌ల ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డు లు, ప్రమాదాలు జరగకుండా సూచించే మార్క్ లు వాటితో పాటు ఓపెన్ నాలా బాక్స్ డ్రెయిన్,



స్టార్మ్ వాటర్ డ్రెయిన్లలో కూడా ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటారు.

ఫోటోతో సహా రోజువారిగా డి-సిల్టింగ్ వివరాలు అప్‌లోడ్

వార్డులకు కేటాయించిన ఇంజనీరింగ్ ఆఫీసర్‌లు స్టామ్ వాటర్ డ్రెన్‌లకు సంబంధించిన క్యాచ్ పిట్స్, బాక్స్ డ్రెన్ మ్యాన్ హెూల్స్‌కు దెబ్బతిన్న, పనికి రాకుండా ఉన్న కవర్స్ వెంటనే రీ-ప్లేస్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అజాగ్రత్త, నిర్లక్ష్యంగా ఉంటే అవాంఛనీయ సంఘటనలు జరిగే ఆస్కారముందని క్షేత్రస్థాయిలో అధికారులను అప్రమత్తం చేశారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదం జరిగితే సంబంధిత అధికారులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రోజువారిగా డి-సిల్టింగ్ వివరాలు ఫోటోతో అప్‌లోడ్ (నమోదు) చేయాలన్నారు.. ప్రమాద హెచ్చరిక బోర్డులతో పాటు నాలాలో ప్రవహించే నీటి ప్రవాహం తెలుసుకునేందుకు వల్నరెబుల్ పాయింట్‌ల వద్ద మీటర్ ఏర్పాటుతో పాటు ఫ్లోటింగ్ మెటీరియల్‌ను కూడా ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఐ.ఆర్.టి వర్కర్ల రోజు వారి అటెండెన్స్‌తో పాటు వారు తీసిన డి- సిల్టింగును వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకుంటారు.

పది ఫలితాల్లో యూనిక్ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో సూర్యనగర్ లోని యూనిక్ హై స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయిలో మరోసారి సత్తా చాటారు , పరీక్షకు హాజరైన విద్యార్థులలో 21 మంది విద్యార్థులు జిపిఏ 10/10 సాధించగా, 9.8 జిపిఏ 15 మంది విద్యార్థులు,9.7 జిపిఏ 13మంది విద్యార్థులు, 9.5 జిపిఏ 15 మంది విద్యార్థులు ,9.3 జిపిఏ 18 మంది విద్యార్థులు,9.2 జిపిఏ 7 మంది విద్యార్థులు,9.0జిపిఏ 6 మంది విద్యార్థులు, సాధించాగా జిపిఏ 9 కి పైగా 95 మంది విద్యార్థులు సాధించగా, పరీక్షకు హాజరైన విద్యార్థులలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పది ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శివయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం విద్యార్థులను పుష్పగుచ్ఛం అందించి అభినందించారు,ఇంతటి విజయానికి అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల పట్టుదలతో ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మరోసారి ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ అత్యుత్తమ ప్రదర్శన



నవతెలంగాణ-అంబర్‌పేట
పదో తరగతి ఫలితాల్లో హిమాయత్ నగర్ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ అద్భుతమైన ఫలితాలను సాధించిందని స్కూల్ వైస్ చైర్మెన్ ప్రార్ధన మణికొండ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం 97శాతం అని, ఇద్దరు విద్యార్థులు 10 జీపీఏ పొందారని తెలిపారు. తర్వాత 9 మంది విద్యార్థులు 9 జీపీఏ నుంచి 9.8 జీపీఏ మధ్య స్కోర్ చేశారన్నారు. 32 మంది విద్యార్థులు 8 జీపీఏ కంటే ఎక్కువ సాధించారని తెలిపారు. గణితంలో ఏడుగురు, సైన్సులో ఆరుగురు, సోషల్ స్టడీస్‌లో 8 మంది, ఆంగ్లంలో 16 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారని వివరించారు. 10 జీపీఏతో ప్రథమ స్థానంలో నిలిచిన రుద్రాణి దీక్షిత్, సంసితలను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు అభినందించారు. కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ మాట్లాడుతూ చదువుపై ఎల్లప్పుడూ విద్యార్థులకు సకాలంలో మద్దతు నిస్తూ, మార్గనిర్దేశం చేశారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఫహ్మిదా తరగతులను నిశితంగా పర్యవేక్షిస్తూ విద్యార్థులకు మద్దతుగా నిలిచారని చెప్పారు. ఉపాధ్యాయుల కృషి, అంకితభావం తమ సంస్థకు వెన్నెముక అని.. వారు బోర్డు పరీక్షల విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి ఎక్కడా తగ్గలేదని చెప్పారు. విద్యార్థులకు సన్మాన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామాంజుల, సీబీఎస్ఈ, ఎస్ఎస్‌సీ శాఖ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇంతటి పరీక్ష ఫలితాలు రావడానికి మద్దతు నిచ్చిన ఇతర సహెూద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- టీవీవీపీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ రమేష్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్
కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఇన్‌చార్జి కమిషనర్ రమేష్ అన్నారు. బుధవారం కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానాలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్‌తో కలసి వివిధ డిపార్ట్ మెంట్ల హెచ్‌ఓడీ వైద్యు లతో సమీక్షా నిర్వహించారు. వారి విభాగాల పనీతీరు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్, ఆరోగ్యశ్రీ సేవల పై తనిఖీ చేశారు. ప్రత్యేకంగా మెటర్నిటీ వార్డును పరిశీలించి మాతా శిశువులకు అందుతున్న సేవలను అడిగి తెలు సుకున్నారు. రోగులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలిం చారు. హాస్పిటల్ మొత్తం కమిషనర్ స్వయంగా కలియతిరిగి వార్డ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆస్పత్రిలో ఓపీ సేవలు పెరగాలని ఆదేశించారు. రోగులకు అదనపు సౌకర్యాలను పెంచాలని సూపరింటెండెంట్‌కు సూచిం చారు. మొత్తం హాస్పిటల్‌లో అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతప్తిని వ్యక్త చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ వెంకటేష్, ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ ఏ ఆంజనేయులు, నర్సింగ్ ఆఫీసర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నాయిని నర్సింహారెడ్డి కార్మిక పక్షపాతి

- ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ - అడిక్‌మెట్
నాయిని నర్సింహారెడ్డి కార్మిక పక్షపాతిగా ఉంటూ కార్మికుల సంక్షేమం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శ మూర్తి అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మాజీ హెూంమంత్రి నాయిని నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం ఎన్ఎన్ఆర్ మోరియల్ క్రికెట్ పోటీలు ఎన్టీఆర్ స్టేడియంలో అట్టహాసంగా జరుగుతున్నాయి. ఈ పోటీలకు వారు హాజరై టాస్ వేసి మ్యాచ్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం నాయిని నిరంతరం కృషి చేశారని, ఆయన పేరుమీద ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాయిని నర్సింహారెడ్డి కార్మికుల పక్షాన వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే వారని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర నాయకులు కల్వగోపి, బల్లెకారి రమేష్ నేత, శ్రీనివాస్, , సిరిగిరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను తొలగిస్తామనడం నిరంకుశత్వమే

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య



నవతెలంగాణ - అడిక్ మెట్
గత 13 రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను విధుల నుంచి తొలగిస్తాం అనడం ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంకుశత్వానికి నిదర్శనమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. బుధవారం తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యానగర్ బీసీ భవన్‌లో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ సెక్రటరీల సమ్మె న్యాయమైందన్నారు. వీరిని ఉద్యోగంలోకి తీసుకున్నప్పుడు మూడు సంవత్సరాలలో రెగ్యులరైజ్ చేస్తామని నోటిఫికేషన్ లో స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు .తర్వాత జీవో 26 ద్వారా మరో సంవత్సరం పొడిగించి ఉత్తర్వులు జారీ చేసినా నాలుగు సంవత్సరాల గడువు ముగిసిన ఇంతవరకు ఏ ఒక్కరిని కూడా రెగ్యులర్ చేయకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో వారు సమ్మెకు వెళ్లారన్నారు. సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తొలగిస్తామనడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమాల ద్వారానే తెలంగాణ తెచ్చారని.. ముఖ్యమంత్రి అయ్యారని.. అదే ఉద్యమాలను అణిచివేయడం న్యాయమా అని ప్రశ్నించారు. వెంటనే సీఎం కేసీఆర్ స్పందించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ గ్రేట్ ఫోర్ ఉద్యోగులుగా గుర్తించి నాలుగు సంవత్సరాల సర్వీసును కలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అవుట్సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే ప్రమోట్ చేసి జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలన్నారు. మరణించిన పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు రూ. 20 లక్షల నష్టపరిహారం చెల్లిస్తూ కారుణ్య నియామక ప్రక్రియ చేపట్టి వారి కుటుంబాలలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్ ,నందగోపాల్, రాఘవ జోషి, వేముల రామకృష్ణ ,పగిడాల సుధాకర్, నిఖిల్, తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ నాయకులు ఆకారం సురేష్, కృష్ణంరాజు, గిరిబాబు, శ్రీనివాస్ ,వినయ్ కిరణ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎల్ఎన్ హైస్కూల్లో బాలికల హవా



నవతెలంగాణ-బంజారాహిల్స్
బంజారాహిల్స్‌లోని ఎన్బీటీ నగర్‌లో ఎస్ఎల్ఎన్ హై స్కూల్లో 41 మంది విద్యార్థులకు గాను 39 మంది విద్యార్థులు పాసయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు. తగ్రే అక్షయ 9.8, కొంగురి పూజ 9.7, దాసురి సౌమ్య 9.0, వారికుప్పల నందినీ 9.0, పన్నేటి రాజేష్ 9.0 మార్కులు సాధించారాన్నారు.

'పది'లో సెంట్ నిజామియాస్ ప్రభంజనం



నవతెలంగాణ-బంజారాహిల్స్
బంజారాహిల్స్ లోని సెంట్ నిజామీయస్ హై స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రభంజనం సష్టించారు. కే లిఖిత 9.7, సహిష్ట 9.3, అదిబా టబెస్సుం 9.0 సాధించినట్టు ప్రిన్సిపాల్ సయ్యద్ ఫక్రుద్దీన్ అహ్మద్ తెలిపారు. 40 మంది విద్యార్థులకు గాను 36 మంది విద్యార్థులు పాస్ అయినట్టు చెప్పారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన సాయి కృప విద్యార్థులు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్
యూసుఫ్‌గూడ డివిజన్ కృష్ణానగర్‌లోని సాయి కృప హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. 21 మంది హాజరు కాగా 20 మంది మంచి ర్యాంకులతో పాసయ్యారు. బీ సాయి చరణ్ 9.7 జీపీఏ సాధించి స్కూల్ టాపర్ గా నిలిచారు. ఏ. వర్షిత్ 9.5, జి దుహిత 9.2, పూజిత 9.2 , శివ శంకర్ 8.5, నాగవేణి8.3, చరణ్, ఎం నాగసాయి, జి శివ సూర్య, విశాల్ 8.0 జీపీఏ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అంజనీ కుమార్ అభినందించారు. అదేవిధంగా ఉత్తమ ర్యాంకులు సాధించుటకు కృషి చేసిన అధ్యాపకులను, పిల్లల తల్లిదండ్రులను అభినందించారు.

పది ఫలితాల్లో లిటిల్ ఫ్లవర్ సత్తా



నవతెలంగాణ-ఓయూ
విద్యార్థులు విద్యా ద్వారానే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల చైర్మెన్ డా.కె.సదానంద్, ప్రిన్సిపాల్ జ్యోతి సదానంద్, అన్నారు. బుధవారం 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థ(అల్వాల్)లో తమ విద్యార్థులు 100 కి 100 శాతం మంది విద్యార్థులు పాస్ కావడం తాము అందిస్తున్న విద్యకు నిదర్శనం అన్నారు. 10 గ్రేడ్ పాయింట్ ఎవరేజ్ (జీపీఏ) సాధించిన మల్లె మాదిరి మేఘవిని, ఆర్డి వర్ష ఇరువురును అధ్యాపకుల తల్లి దండ్రుల సమక్షంలో ఆయన బుధవారం ఘనంగా సన్మానించారు. వారికి పుష్ప గుచ్ఛము ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి సదానంద్,వైస్ ప్రిన్సిపాల్ షావిలి రాయ్, హెడ్ మాస్టర్ లక్కీ శ్యాముల్ అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

జగమంత కుటుంబం నాది : పల్లపు గోవర్ధన్ రాజ్



నవతెలంగాణ-బంజారా హిల్స్
జగమంత కుటుంబం నాది.. అట్టడుగు వర్గాల అభివృద్ధి నా ఆకాంక్ష.. ప్రజాక్షేత్రంలో ప్రజల సమస్యల పరిష్కారానికి అనునిత్యం పర్యవేక్షణ కొనసాగిస్తానని పల్లపు గోవర్ధన్ రాజ్ అన్నారు. బుధవారం ఆయన జన్మదిన వేడుకలు అతి సాధారణంగా స్టేట్ హెూంలో దివ్యాం గులతో కలిసి భోజనం చేస్తూ నిర్వహించుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో పరిధిలో పార్టీలకు అతీతంగా ప్రధాన ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు రక్త దాన కార్యక్రమాలు ఆయన అభిమానులు నిర్వహించారు. నిమ్స్ ఆస్పత్రి వద్ద, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద



అలాగే ఒమేగా,విరంచి ప్రధాన కూడలిల వద్ద అన్నదానాలు నిర్వహించారు. సేవే తమ అభిమతమని.. ప్రజాక్షేత్రంలో సేవకు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని పల్లపు గోవర్ధన్ రాజ్ తెలిపారు. ప్రజలు కూడా ఆ శ్రద్ధ మనపై తప్పక చూపిస్తారని తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు.

కొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్ సెట్ చేసిన హీరో కార్ప్

నవతెలంగాణ-హైదరాబాద్
విదా, హీరో ద్వారా పవర్ చేయబడి, పైకి వస్తున్న హీరో మోటోకార్ప్ మొబిలిటి బ్రాండ్ - ప్రపంచంలోని అతిపెద్ద మోటార్ సైకిల్స్, స్కూటర్ల తయారీదారు - కొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్ని సెట్ చేసింది. దీంతో ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమకి ఇంకో ఫిల్లిప్పి అందించింది. ఈసందర్భంగా హీరో కార్ప్ ఎమర్జింగ్ మొబిలిటీ బిజినెస్ యూనిట్ హెడ్ డా.స్వదేశ్ శ్రీవాత్సవ మాట్లాడుతూ... ఈ కొత్త రికార్ సెట్ చేసినందుకు తాము చాలా సంతోషంగా ఉన్నామన్నారు. విదా వీఐని చేయడంలోని కఠినమైన పరీక్షని ఇది స్పష్టంగా ఎత్తి చూపిస్తోందన్నారు. తమ విషన్ ఈవీ వర్గాన్ని భౌగోళికంగా ప్రచారం చేయాలని, ఈ విదా వీఐ పనితీరు, ఎండ్యూరెన్స్-ఓరియంటెడ్ ప్రపంచ రికార్డ్ తెచ్చుకోవడం ఈవీ పరిశ్రమకి ఉత్సాహన్ని అందించాలన్నారు. దీంతో వర్గం పరిపక్వత ఉన్న, అధిక-పనితీరు కలిగిన ఉత్పత్తులతో సిద్ధంగా ఉందని నిర్ధారించుకోవచ్చన్నారు. హీరో మోటోకార్ప్, దాని ఉత్పత్తులు నమ్మకాన్ని తమ విలువైన వినియోగదారుల్లో లేపుతుందన్నారు. తాము తమ ఈవీలు కూడా అదే ధైర్యాన్ని లేపుతాయని స్థాపించుకున్నామన్నారు. ప్రపంచ-శ్రేణి విదా వీఐని అభివృద్ధి చేసినందుకు జైపూర్, జర్మనీలోని ఆర్ అండ్ డీ బృందాన్ని తాను అభినందిస్తున్నానన్నారు.

పదిలో ప్రభుత్వ పాఠశాలల హవా



నవతెలంగాణ - బంజారా హిల్స్..
పదిలో రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రభంజనం సష్టించారు. 65 మంది విద్యార్థులకు గాను 60 మంది విద్యార్థులు పాస్ అయినట్టు ప్రిన్సిపాల్ వెల్లడించారు. 11 మంది 9.7 నుండి 9.0 వరకు జీపీఏ సాధించారని తెలిపారు. సీహెచ్. లహరి 9.7, సామ రేవంత్ 9.5 సాధించరాన్నారు.

షంషేర్ గంజ్ శ్రీ చైతన్య హై స్కూల్లో 100 శాతం ఉత్తీర్ణత



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట
పాతబస్తీలో షంషేర్ గంజ్ శ్రీ చైతన్య హైస్కూల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. 10/10 ఏడుగురు, 9.5 / 10 40 మంది విద్యార్థులు సాధించారు. తనీషిక.పట్నం, సహస్ర, సుదీపిక, అక్షిత, వసంత లక్ష్మీ, అమాన్ ముస్తఫా, ఈసానుల్లాలు 10/10 స్కోర్ చేశారు. ఈ సంవత్సరానికి గాను తెలంగాణలోని శ్రీ చైతన్య హై స్కూల్‌లలో రెండవ స్థానంలో షంషేర్ గంజ్ శ్రీ చైతన్య స్కూల్ నిలిచింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ పదో తరగతిలో తమ స్కూల్ విద్యార్థులు 100కు 100% పాస్ కావడమే కాకుండా 10/10 సాధించిన విద్యార్థులు ఏడుగురు ఉన్నారన్నారు. దీనికి కారణం స్కూల్ విద్యార్థులు చాలా కష్టపడి చదివారని తెలిపారు. గత సంవత్సరాలకు కరోనా కారణంగా సరైన విద్యను అందించలేకపోయామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థుల ఆరోగ్యాల పట్ల అధిక శ్రద్ధ వహించి కొంచెం వెనుక ముందు జరిగినా ఉత్తీర్ణతలో మాత్రం ఎప్పుడూ తేడా లేకుండా ఉందన్నారు. దమ్మాయిగూడ బ్రాంచ్ మొదటి స్థానంలో నిలువగా షంషీర్ గంజ్ బ్రాంచ్ ద్వితీయ స్థానంలో ఉంది అన్నారు. ఈ సందర్భంగా 10/10 సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. స్కూల్ ఆవరణలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.స్కూల్ ప్రిన్సిపల్ శ్రవణ్ కుమార్ తో పాటు ఏజీఎం కృష్ణ, డీసీ పుల్లారెడ్డి, స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు .

దేశానికి బీజేపీ పెను ప్రమాదం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ



నవతెలంగాణ-ఓయూ
దేశానికి బీజేపీ పెను ప్రమాదం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఈటీ నరసింహ అన్నారు. తార్నాక డివిజన్ మాణికేశ్వరినగర్ బస్తీలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతి రేక విధానాల వల్ల క్షేత్రస్థాయిలో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ గద్దె దిగడం తప్ప దన్నారు. లౌకిక దేశమైన ఈ దేశాన్ని మతం పేరుతో విభజన చేస్తూ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని ఇట్లాంటి దుశ్చర్య ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమన్నారు. ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు మతతత్వ విధానాలను ఖండించి బీజేపీకి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు .మాణికేశ్వర్ నగర్ బస్తి వాసుల పోరాటం న్యాయమైనదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఛాయాదేవి మాట్లాడుతూ.. సుమారు నెలరోజులకు పైగా మాణికేశ్వర్ నగర్ బస్తీలో హాస్పిటల్ నిర్మించాలని బస్తి వాసులు చేస్తున్న పోరాటం న్యాయమైనదని , కావున హాస్పిటల్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పద్మారావు చొరవ తీసుకొని హాస్పిటల్ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా బస్తీ వాసుల కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్ష కు సంఘీభావం తెలియజేసి మీ పోరాటానికి పూర్తిగా సిపిఐ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కామ్రేడ్ స్టాలిన్, కమతం యాదగిరి, సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్,జిల్లా కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్, సికింద్రాబాద్ సహాయ కార్యదర్శిలు ఉమర్ఖాన్ ,కొమురెల్లి బాబు, డీహెచ్‌పీఎస్ జిల్లాకార్యదర్శి జేరిపోతుల కుమార్, తార్నాక డివిజన్ సెక్రెటరీ షేక్ లతీఫ్, గువ్వల మల్లేష్, యాదగిరి, గడ్డం చందర్, నారాయణ, ఖదీర్, లక్ష్మణ్, పరశురాం, కుమార్, కళ్యాణ్,అరిఫ్, శివప్ప పాల్గొన్నారు.

మదర్స్ డే వేళ ఆదర్శవంతమైన బహుమతిగా బాదం

నవతెలంగాణ-హైదరాబాద్
మదర్స్ డే వేళ ఆదర్శవంతమైన బహుమతిగా బాదం నిలుస్తుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడే సామర్థం దీనిలో ఉంది. దీనితో పాటు బాదం, మధుమేహం, బరువు నిర్వహణ నుండి చర్మ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం వరకు ఇతర ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ఈసందర్భంగా న్యూట్రిషన్ - వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి మాట్లాడుతూ... తమ కుటుంబాల సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చే తల్లులు తరచుగా తమ ఆరోగ్యాన్ని పట్టించుకోరన్నారు. అందువల్ల, బాదం వంటి సులభమైన, పోషకమైన ఆహారాలను వారి ఆహారంలో చేర్చడం చాలా ముఖ్యమన్నారు. బాదంపప్పును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల హానికరమైన ఎల్డీఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన ఆహారంతో కలిపి రక్షిత హెచ్ డీఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించవచ్చని అధ్యయనాలు చూపిస్తున్నాయన్నారు. ప్రఖ్యాత భారతీయ టెలివిజన్ అండ్ చలనచిత్ర నటి నిషా గణేష్ మాట్లాడుతూ... తల్లిగా మంచి ఆరోగ్యం, ఫిట్నెస్ ను కాపాడుకోవడం చాలా అవసరమన్నారు. తన చిన్నతనంలో తాను ప్రతిరోజూ ఉదయం నానబెట్టిన బాదంపప్పులను తినాలని అమ్మ ఎప్పుడూ ఒక పనిగా పెట్టుకునేదన్నారు. ఒక తల్లిగా, తాను ఈ అలవాటును అలవర్చుకున్నానన్నారు. సుప్రసిద్ధ దక్షిణ భారత నటి ప్రణీత సుభాష్ మాట్లాడుతూ... తన పాఠశాల విద్య, కెరీర్ లో తమ అమ్మ తనకు తిరుగులేని మద్దతు వ్యవస్థగా ఉందని, ఆమె నిస్వార్థ త్యాగాలు తనను ఈ రోజు వ్యక్తిగా తీర్చిదిద్దాయన్నారు. ఆమె రోజువారీ ఆహారంలో కొన్ని బాదంపప్పులను చేర్చడం ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఒక మార్గమన్నారు. కాస్మోటాలజిస్ట్, స్కిన్ ఎక్సపర్ట్ డాక్టర్ గీతికా మిట్టల్ గుప్తా మాట్లాడుతూ... చర్మ సంరక్షణలో స్థిరత్వం కీలకమన్నారు. ఆరోగ్యకరంగా కనిపించే చర్మానికి సులభమైన, ప్రాథమిక దశ అవసరమైన విటమిన్లు, మినరల్స్‌తో కూడిన పోషకమైన ఆహారాన్ని నిర్వహించడం ముఖ్యమన్నారు. బాదం వంటి గింజలను తీసుకోవడం చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు.

'ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేర్చాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్
ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడి అభివద్ధికి నోచుకోని బీసీ(డీ)లో ఉన్న ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణ ఆరెకటిక సేవా సమితి అధ్యక్షులు కళ్యాణ్ కార్ ఈశ్వర్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తమ కులస్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేరుస్తామని 2014లో బాల్కొండ ఎన్నికల బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని మార్చిపోవడం బాధకరమన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గతంలో ఆరెకటికలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు.ఇటీవల అనేక మార్లు ప్రధాని తెలంగాణకు వచ్చినప్పటికి తమపై ఊసెత్తకపోవడం దారుణమన్నారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో తమ కులం ఎస్సీ జాబితాలో, కర్ణాటక రాష్ట్రంలో బిసి-ఎలో ఉందని, తెలంగాణలో బీసీ-డీ కింద గుర్తించడంతో రిజర్వేషన్లకు నోచుకోలేక దయనీయమైన బతుకులు వెళ్లదీస్తున్నమని తెలిపారు. గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు వెంటనే తమ కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రానున్న ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. జనాభా దమాష ప్రకారం తమ కులస్తులకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ లో 3 స్థానాలు, ఆదిలాబాద్, కరీంనగర్ లో ఒక్కో స్థానంలో అన్ని రాజకీయ పార్టీలు టికెట్ లు ఇచ్చి సముచిత న్యాయం చేయాలని ఆయన కోరారు.



తెలంగాణ రాష్ట్ర కల్లు గీత పారిశ్రామిక సహకార సంస్థ చైర్మెన్ గా పల్లె రవికుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ వి మహేందర్ కుమార్, వి.యాదగిరి నరేందర్ తదితరులు ఆయనకు పూల బొకే అందించి ఘనంగా సన్మానించారు.

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం 173 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఇతర రాష్ట్రాల్లో పాలిస్తున్న కాంగ్రెస్, బీజేపీలు కల్యాణ లక్ష్మి పథకం ఇస్తుందా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు పెద్దపీట వేసే రాష్ట్రం తెలంగాణ అన్నారు. రాబోయే రోజుల్లో మంచి పని చేసే పార్టీనే ఆశీర్వదించాలని కోరారు. కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్‌కు చెందిన సయద్ మౌలానా అనారోగ్యంతో భాద పడుతున్న దృష్ట్యా సర్జరీ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2లక్షలా 50 వేల ఎల్‌ఓసీ చెక్కును బాధితుడికి అందజేశారు. ఈ కార్య క్రమంలో కార్పొరేటర్లు శిరీష బాబురావు, సబీహ గౌసుద్దిన్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.



మాల బ్యాగరి, కాటికాపారులు ఐక్యత చాటాలి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మాల బ్యాగరి, కాటికాపరులు ఐక్యత చాటాలని తెలంగాణ కాటికాపర్ల, స్మశాన వాటికల సంఘం గ్రేటర్ అధ్యక్షులు కత్తుల దుర్గయ్య పిలుపునిచ్చారు. బుధవారం గాంధీనగర్ శ్మశాన వాటికల సంఘం కార్యాలయంలో సతెమ్మ అధ్యక్షతన కాటికాపారుల సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు నాయకులు రాజు హాజరయ్యారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మశాన వాటికలను ప్రభుత్వం సుందనీకరణ చేస్తున్న సందర్భంగా స్మశాన వాటికలను శుభ్రంగా ఉంచడం వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచడం మన బాధ్యత అన్నారు. స్మశాన వాటికలను ప్రభుత్వం ప్రయివేటు పరం చేయకుండా మన కులవృతిని మనమే నిర్వహించాలని అందుకు బ్యాగురులందరు ఐకమత్యంతో సంఘటితంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో పి.వెంకటస్వామి, కందుకూరి సత్తయ్య, రవి, దాసు, రాజయ్య, లింగమ్మ, రాజయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



'పది'లో మేడ్చల్ 14, హైదరాబాద్‌కు 28వ స్థానం

- మేడ్చల్ 90.72శాతం, హైదరాబాద్ 80.29 శాతం ఉత్తీర్ణత
- రెండు జిల్లాలోనూ అమ్మాయిలదే పైచేయి
- గతేడాది కంటే మెరుగైన ఫలితాలు
- 17,517 మంది విద్యార్థులు ఫెయిల్!
- సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలలు

నవతెలంగాణ-సిటీబ్యూరో/మేడ్చల్‌కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు 14వ స్థానం దక్కగా.. హైదరాబాద్ జిల్లా 28వ స్థానంలో నిలిచింది. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఈఏడాది 1,16,154 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా..94,270 మంది పాసయ్యారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలో 68,468 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 54,971 మంది ఉత్తీర్ణత సాధించి, 80.29 శాతంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాలో 28వ స్థానంలో నిలబెట్టారు. అయితే గత ఏడాది కంటే దాదాపు ఒక శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ జిల్లాలో బాలికలు 35,376 మంది పరీక్షలకు హాజరు కాగా, 29,638 మంది ఉత్తీర్ణత సాధించి 83.78 శాతం నమోదు చేశారు. 33,092 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా, 25,333 మంది ఉత్తీర్ణత సాధించి 76.55 శాతం నమోదు చేసి, బాలికల కంటే 7.23 తక్కువ శాతం వెనుకంజలో నిల్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో బాలికలు 21,095 మంది పరీక్షలకు హాజరు కాగా, 19497 మంది ఉత్తీర్ణత సాధించి 92.42 శాతం నమోదు చేశారు. 22,224 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా, 19,802 మంది ఉత్తీర్ణత సాధించి 89.1 శాతం నమోదు చేసి, బాలికల కంటే 3శాతం తక్కువ శాతం నమోదు చేశారు. మొత్తంగా పదోతరగతి ఫలితాల్లో బాలికలే తమ హవా కొనసాగించారు. కాగా రెండు జిల్లాల్లో ఈ పరీక్షల్లో బాల, బాలికలు కలిపి మొత్తం 17,517 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 13 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం నాంపల్లిలోని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ) ప్రాంగణంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆశాఖ ఉన్నతాధికారులతో కలిసి ఫలితాలు విడుదల చేశారు.



ప్రభుత్వ బడుల్లో ప్రతిభ పదిలం..

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో హైదరాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ధీటుగా మార్కులు సాధించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఫలితాలు ఒకశాతం మెరుగుపడడం విశేషం. జిల్లా అధికారి నుంచి మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, టీచర్ల కృషి, విద్యార్థుల కఠోర శ్రమే ఈ ఉత్తమ ఫలితాలకు కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో 182 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వీటి నుంచి 7,244 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 5,235 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 72.27శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాదిలాగే ఈసారి కూడా 9 ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో కలిపి మొత్తం 577 మంది విద్యార్థులు 10కి10 జీపీఏ సాధించారు. హిమాయత్‌నగర్ జోన్ పరిధిలో 13 ప్రభుత్వ పాఠశాలల్లో.. రెండు సర్కారు బడులు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో ఒకటి అంబర్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాగా.. మరోకటి మలక్‌పేట బదిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలు. ఇదిలావుంటే హిమాయత్‌నగర్ మండంలోని ప్రభుత్వ సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల విద్యార్థి మానవ్ మిశ్రా 9.8 జీపీఏ సాధించగా.. భవిత 9.3జీపీఏ సాధించింది. అలాగే కాచిగూడ ప్రభుత్వ పాఠశాలకు చెందిన సుప్రియ 9.7, జి.తరుక్ 9.2 జీపీఏ సాధించారు. హైదరాగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీవిద్య 9.3 జీపీఏ, ప్రభుత్వ పాఠశాల సీపీఎల్ హిమాయత్‌నగర్‌కు చెందిన చందన 9.7 జీపీఏ, రూప 9.7 జీపీఏ, జీనాపబాగ్, చరణ్ 9.2జీపీఏ, ప్రసన్న, కోటేశ్వరామ 9.3జీపీఏ సాధించి రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి విజయలక్ష్మి అభినందనలు తెలిపారు. ఇదిలావుంటే జిల్లాలోని పలు మండలాల్లో చాలామంది విద్యార్థులు 9 నుంచి 9.5జీపీఏ సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఓవరాల్‌గా హైదరాబాద్ 80.29శాతం ఉత్తీర్ణత సాధించి 28వ స్థానంలో నిలిచింది. మొత్తం 68,468 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా..54,971 మంది పాసయ్యారు. మేడ్చల్ జిల్లా 90.72శాతం ఉత్తీర్ణతో 14వ స్థానంలో నిలిచింది. ఇక రెండు జిల్లాల్లోనూ బాలికలదే పైచేయిగా నిలిచింది.

సత్తా చాటిన బీసీ హాస్టల్స్ విద్యార్థులు

బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో నడుస్తున్న పది ప్రీ-మెట్రిక్ వసతి గృహాలు సత్తాచాటాయి. వీటి పరిధిలో 2022-23 సంవత్సరానికి మొత్తం 51 విద్యార్థులకుగాను 47 మంది ఉత్తీర్ణత సాధించగా.. 8 మంది విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత పొందినారు. దీంతో 82.29శాతం ఉత్తీర్ణత నమోదైంది. జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోనే పది పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం జరిగిందని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి జి.ఆశన్న తెలిపారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు బీసీ సంక్షేమ శాఖ అధికారులకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జూన్ 14 నుంచి 22 వరకు సప్లిమెంటరీ

వచ్చే నెల 14 నుంచి 22 వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారులు ఆర్.రోహిణి, విజయకుమారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26లోపు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు విధించినట్టు వెల్లడించారు. జవాబు పత్రాల రీకౌంటింగ్, రీవాల్యుయేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్టు వారు తెలిపారు.

ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 'కృషి స్కూల్' విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఎస్ఎస్‌సీ ఫలితాల్లో సూరారం కాలనీ "కృషి హై స్కూల్ " విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన జి.సంతోషి 10/10, పి.సుధీర్ కుమార్ 10/10, వై.మనీష్‌రెడ్డి 10/10 జీపీఏ సాధించి ముగ్గురు విద్యార్థులు పాఠశాల టాపర్లుగా నిలిచారు. ఎం.కావ్య 9.8/10, సిహెచ్ సాయి అనూష 9.8/10, వి.అంజని 9.8/10, షేక్ పర్వీన్ 9.7/10, ఎస్.హర్షిత 9.7/10, ఎం.లక్ష్మి ప్రసన్న 9.7/10, వై.కీర్తన గ్రాస్ 9.7/10, సిహెచ్ నాగిరెడ్డి 9.7/10 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థును ప్రిన్సిపాల్ శ్యామ్‌ప్రసాద్ అభినందించారు. 10/10 ముగ్గురు విద్యార్థులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇంతటి ఘనమైన ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవరోధాలు అధిగమించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించ డానికి అహర్నిశలు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రశంసించారు. బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎన్ఎస్ఆర్ విద్యార్థుల హవా

నవతెలంగాణ-మేడ్చల్

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మేడ్చల్ పట్టణంలోని ఎన్ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రథమ సంవత్సరంలో బైపీసీ గ్రూపులో సుమయ్య సుల్తానా 440 మార్కులకు గాను 434 మార్కులు, ఎంపీసీ గ్రూపులో సునీత 470 మార్కులకు గాను 461 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం 1000 మార్కులకు బైపీసీ గ్రూపులో సంగీత 983, సాయి గీతిక 983, ఎంపీసీ గ్రూపులో యశ్వంత్ యాదవ్ 981 మార్కులతో మేడ్చల్ మండలంలో ఉత్తమ ఫలితాలను సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, కరెస్పాండెంట్ నారెడ్డి శశిధర్ రెడ్డి, యాజమాన్య బృందం చంద్రశేఖర్ రెడ్డి, ఎల్మరి రమేష్, విపిచారి, సామ్సన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.



ఎస్ఎస్‌సీ ఫలితాల్లో త్రివేణి విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తమ పాఠశాల విద్యార్థులు అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలరనీ, అందుకు ఇప్పుడు వెలువడిన పదో తరగతి ఫలితాలే నిదర్శనమని అద్భుత ఫలితాలతో ప్రభంజనం సృష్టించి ఈ ప్రాంతానికే తలమానికంగా నిలిచారని త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి అన్నారు. బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో త్రివేణి పాఠశాల చింతల్ బ్రాంచ్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని జిపిఏ 10/10, 7 మంది విద్యార్థులు, జిపిఏ. 9.7 పైగా 26 మంది విద్యార్థులు, జిపిఏ. 9.0, 52 మంది విద్యార్థులు, ఫలితాలు సాధించారన్నారు. మ్యాథమెటిక్స్ విభాగంలో ఏ గ్రేడ్ 16 మంది విద్యార్థులు, సైన్స్ విభాగంలో 35, సోషల్ విభాగం లో 29 విద్యార్థులు సత్తా చాటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ త్రివేణి విద్యార్థులు 80 మందికి పైగా (ఏ) గ్రేడ్ లు సాధించి నంబర్ వన్‌గా నిలిచి విజయకేతనం ఎగరేశారని ఆయన తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ కనబరిచి ఇంతటి అద్భుత ఫలితాలు సాధించామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ చక్రి, సీఆర్వో వెంకటరావు, ఇన్‌చార్జి క్రాంతి, అధ్యాపక బృందం, సిబ్బంది, పాఠశాల క్యాంపస్‌లో పుష్ప గుచ్చాలు అందజేసి అభినందించారు. పాఠశాల ప్రాంగణంలో బాణాసంచా కాలుస్తూ స్వీట్లు పంచుకున్నారు.

దీక్ష స్కూల్‌లో 100శాతం ఉత్తీర్ణత



కుత్బుల్లాపూర్ : పదో తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించి దీక్ష స్కూల్ విజయ దుందుభి మోగించారు. పాఠశాలకు చెందిన సుమంత్ శర్మ 9.3 జీపీఏ సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా 100శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ మోహన్ అన్నారు. ఈ సందర్భంగా సీట్లు పంచి, సంబురాలు చేసుకున్నారు. పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ... పటిష్టమైన ప్రణాళిక, విద్యార్థులు నిర్విరామ కృషి, తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహం వల్ల 100శాతం ఫలితాలు సాధ్యమయ్యాయని స్కూల్ చైర్మన్ పి.శివయ్య తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన 'సీఎంఆర్'



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గాజులరామారం డివిజన్ పరిధిలోని సీఎంఆర్ హైస్కూల్ విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. ఎం.తేజస్వి రెడ్డి జీపిఏ 10/10, సుచిత్ర నాయుడు 10/10, ఎస్.స్ఫూర్తి 10/10, సాధించగా, టి.వెంకట సాయి జీపిఏ 9.8 సాధించారన్నారు. ఆరుగురు విద్యార్థులు 9.7, ముగ్గురు విద్యార్థులు 9,5, ఏడుగురు విద్యార్థులు 9.3, నలుగురు విద్యార్థులు 9.2, ఏడుగురు విద్యార్థులు 9.0 పైగా సాధించారన్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఎం.గోపాల్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ హరిశంకర్, పాఠశాల ఏఓ సత్తిబాబు, విద్యార్థులను అభినందించారు. ఇంతటి విజయానికి అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల పట్టుదలతో ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని హజ్రత్ సయ్యద్ రహ్మతుల్లా షా ఖాద్రి ఉర్ఫ్ జీతే ఫీర్ దర్గాలో జరుగుతున్న చివరి రోజు బుధవారం ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్లు, దర్గా అధ్యక్షులు సయ్యద్ ఫరూక్ అలీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ సలీం, కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రార్థనలు చేశారు.
నవతెలంగాణ-దుండిగల్

ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 10/10 గ్రేడ్ పాయింట్లతో సత్ జ్ఞాన్ హై స్కూల్ విజయ దుందుభి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



సత్ జ్ఞాన్ హై స్కూల్ వెంకటేశ్వరనగర్ ఎస్ఎస్‌సీ ఫలితాల్లో అత్యుత్తమమైన ఫలితాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. 10/10 జీపీఏ ఐదుగురు విద్యార్థులు సాధించారు. 9.8/10 జీపీఏ ఐదుగురు, 9.7/10 జీపీఏ ఏడుగురు, 9.5/10 జీపీఏ ఎనిమిది మంది, 9.3/10 జీపీఏ 12 మంది, 9.2/10 జీపీఏ 12 మంది, 9.0/10 జీపీఏ పదిమంది విద్యార్థులు సాధించారు. మొత్తం 59 మంది విద్యార్థులు 9.0/10 జీపీఏ కు పైగా సాధించి తమకు తామే సాటి అని నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండ్ లయన్ చింతల మల్లేశం మాట్లాడుతూ కరోనా పరిస్థితిల వల్ల తలెత్తిన ఇబ్బందులను అధిగమించి ఎస్-ఎస్‌సీ విద్యార్థులు సాధించిన ఘనవిజయం తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల బృంద సహకారం, విద్యార్థుల క్రమశిక్షణాయుతమైన నిరంతరం అధ్యయనం వల్ల మాత్రమే ఈ ఫలితాలు సాధించినట్టు తెలిపారు. ఈ ర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పూల బొకేలు ఇచ్చి, సీట్లు తినపెట్టి అభినందించారు.

ఆలయ నిర్మాణ ప్రయోజనాలకే తప్ప కబ్జాలకు ఎవరూ పాల్పడలేదు

నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప పోచమ్మ గుడి పక్కన సర్వే నెంబర్ 186 లో శ్రీ అభయ ఆంజనేయ స్వామి గుడి నిర్మాణం జరుగుచున్న విషయం ప్రజలందరికీ విధితమే. ఆలయానికి ఎదురుగా ఉన్న గుండ్లు, గుంతలు నిర్మాణ కమిటీ దాన్ని కళ్యాణ మండపం కోసం ఆలయ అభివృద్ధి కోసం చదును చేశారే తప్ప భూ ఆక్రమనకు పాల్పడలేదని రాజీవ్ గృహకల్ప బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్మాణంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ హౌసింగ్ బోర్డ్‌కు చెందిన ఈ స్థలంలో ఇప్పటికే గుట్ట పైన కొందరు చుట్టూ పక్కల కబ్జాలకు గురైందనీ, ఇటీవల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం అందరికీ తెలిసిందేననీ, అందులో భాగంగానే ఆలయ కమ్యూనిటీ హాల్ కోసం ఇటీవల దాతలను కోరగా కొంత ఇటుక ఇసుకను పోసినట్టు తెలిపారు. కొందరు బీజేపీ నాయకులు ఈ విషయాన్ని బీఆర్ఎస్ నాయకులపై ప్రజాప్రతినిధులపై బురద చల్లేందుకు రెండు రోజులుగా విశ్వ ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీజేపీ నాయకుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామనీ, బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. రాజీవ్ గృహకల్పలో ఇప్పటివరకు ప్రజలందరూ ఏండ్లుగా కలిసిమెలిసి జీవిస్తున్నామనీ, అందరూ ఇక్కడ మొత్తంగా బీఆర్ఎస్ పార్టీతో ఉండటంతో ఈ ప్రాంతంలో బీజేపీ ఉనికి కోసం తాపత్రయ పడుతూ వారు ఎలా ప్రజల మధ్య లేనిపోనీ అపోహలు సృష్టిస్తూ బీఆర్ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని చెప్పడం ఎంతవరకు సమంజసమని తెలిపారు. ప్రజల మధ్య చిచ్చు రేపేందుకే సేవాలాల్ జెండాలు పాతింపజేస్తూ కాలనీలో ఎన్నడూ లేని కులాల వాతావరణం సృష్టిస్తున్న విషయం ప్రజలందరూ నిశితంగా గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాలులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో నవజ్యోతి విద్యార్థుల విజయ దుందుభి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తమ నవజ్యోతి పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో అద్భుత ఫలితాలు సాధించి కుత్బుల్లాపూర్ మండలానికే తలమానికంగా నిలిచారని నవజ్యోతి హై స్కూల్ (విద్యాసంస్థల) చైర్మన్ కరస్పాండెంట్ మలిరెడ్డి ఇందిరా రెడ్డి అన్నారు. బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో పాఠశాల ఆదర్శనగర్, పట్వారి నగర్ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు 99.1శాతంతో జీపీఏ 10/10, 10 మంది విద్యార్థులు, జీపీఏ 9.0, 92 మంది విద్యార్థులు అద్భుత ప్రతిభతో మంచి ఫలితాలు సాధించి అదరహో అనిపించారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాల క్రితం పాఠశాల స్థాపించి ఎంతో మంది విద్యార్థులు ఉత్తములుగా తీర్చిదిద్దామని తెలిపారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా అంకిత భావం గల అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ కనబరిచి ఇంతటి అద్భుత ఫలితాలు సృష్టించామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందం, సిబ్బంది పాఠశాల క్యాంపస్‌లో పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో బాణసంచా కాలుస్తూ స్వీట్లు పంచుకుంటూ సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణ, ప్రిన్సిపాల్ రూపాంజలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'టెన్త్' ఫలితాల్లో వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ ప్రభంజనం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సుభాష్ నగర్ " వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ " ప్రభంజనం సృష్టించింది. నూటికి 99 శాతం ఉత్తీర్ణత సాధించి విజయఢంకా మోగించారు. పాఠశాలకు చెందిన జి.మేఘన 9.5/10, పి.వినయ్ కుమార్ 9.5/10, డింపల్ భాటి 9.5/10, పి.అమూల్య 9.3/10 బాప్పి బర్మన్, జి.గణేష్, ఎ.మౌనిక, జే.నికిత, డి.శ్రీలక్ష్మి, ఎం.వెంకట్ సాయి, జి.యశ్వంత్ 9.2/10 గ్రేట్ పాయింట్లు ఏడుగురు విద్యార్థులు సాధించారు. 8.8/10 గ్రేట్ పాయింట్లు ఆరుగురు సాధించారు. 63 మంది విద్యార్థులు 6.0 జీపీఏ పైగా మార్కులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఇంతటి ఘనమైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఆర్నిశలు కృషి చేసిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల బృందానికి ఆయన అభినందించారు. విద్యార్థులకు పూల బొకేలు అందించి సీట్లు పంచిపెట్టారు. బాణసంచా కాల్చి విద్యార్థులతో సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సునీత, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

64వ రోజుకు 'హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర'


నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ నందిని మెడికల్ షాప్ పరిధిలో జండా ఎగరవేసి, వివేకానంద నగర్, ఎమ్ ఎన్ రెడ్డి నగర్ ఫేస్ -1, ఎమ్ ఎన్ రెడ్డి నగర్ ఫేస్ -2 వరకు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి గడపగడపకు హాత్ సే హత్ జోడో అభియాన్ యాత్ర చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ కరపత్రాలను అందజేస్తూ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల ద్వందనీతిని, అధికారం కోసం మోసపూరి హామీలతో ప్రజలకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, నెలకు రూ.25వేల అమరవీరుల గౌరవ పింఛన్ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బేకు శ్రీనివాస్, సుద్దాల ప్రతాప్ గౌడ్, పుల్లెం రాజు, ఏవీజే జెమ్స్, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, పండరి, నర్సింగ్, మధుసూదన్ రెడ్డి, శివారెడ్డి, కిరణ్, మోహన్ రాజు, ఎండి ఆజాద్, ప్రశాంత్, మహిళా నాయకులు పల్లవి, కౌసల్య, లలిత, తదితరులు పాల్గొన్నారు.


నవచిత్రం

మెప్పించే కెప్టెన్ మిల్లర్


ధనుష్

ధనుష్ నటిస్తున్న భారీ పీరియాడికల్ చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. 1930-40 నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ధనుష్ కెరీర్‌లోనే హయ్యస్ట్ బడ్జెట్ మూవీగా రూపొందుతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సత్యజ్యోతి ఫిలింస్ పతాకంపై టి.జి.త్యాగరాజన్ సమర్పణలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కన్నడ నటుడు శివరాజ్ కుమార్, సందీప్ కిషన్, ప్రియాంక అరుళ్ మోహన్, నివేదితా సతీష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక నిపుణులు పనిచేస్తున్న ఈ చిత్రం ఇప్పటికే స్టన్నింగ్ మేకింగ్ విజువల్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా మేకర్స్ ఎక్సైటింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని జూన్‌లో, టీజర్‌ని జూలైలో రిలీజ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.

నాగార్జునకి శివ.. చైతూకి కస్టడీ..


శ్రీనివాస చిట్టూరి

నాగచైతన్య, వెంకట్‌ప్రభు కాంబోలో రూపొందిన తెలుగు-తమిళ ద్విభాషా ప్రాజెక్ట్ 'కస్టడీ'. కృతి శెట్టి కథానాయికగా శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాస చిట్టూరి ఈ సినిమాని నిర్మించారు. పవన్‌కుమార్ సమర్పిస్తున్న ఈ చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత శ్రీనివాస చిట్టూరి మీడియాతో ఈ చిత్ర విశేషాలను షేర్ చేసుకున్నారు.


'ఒక నిర్మాతగా కథ, మంచి స్క్రీన్‌ప్లే నన్ను ఎంతో ఇంప్రెస్ చేశాయి. తెలుగు ప్రేక్షకులకు నచ్చే ఎమోషన్స్, ఎంటర్టైన్మెంట్‌తో సీరియస్ కథ జరుగుతుంటుంది. సీరియస్‌లో కూడా వినోదం ఉంటుంది. ఈ రెండింటిని దర్శకుడు మిక్స్ చేసిన విధానం నాకు చాలా నచ్చింది. తెలుగు ఎమోషన్స్‌తో ఒక హాలీవుడ్ సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. పోలీస్ కథ అంటే యూనివర్సల్ అప్పీల్ ఉంటుంది. అయితే మొదట్నుంచీ దీన్ని బైలింగ్వెల్ చిత్రం అనుకున్నాం. బైలింగ్వెల్‌కి కూడా తెలుగుకి ప్రత్యేకమైన షాట్, తమిళ్‌కి ప్రత్యేకమైన షాట్ తీశాం. రెండు సినిమాలు తీసినట్లే (నవ్వుతూ). హిందీలో తర్వాత ఉంటుంది. అలాగే తెలుగులో వెన్నెల కిషోర్ చేసిన పాత్రని, తమిళ్‌లో ప్రేమ్ జీ చేశారు. ఈ ఒక్క పాత్రలో మాత్రమే మార్పు ఉంటుంది. మిగిలినవి ఒకేలా ఉంటాయి. ఇదొక నిజాయితీ గల కానిస్టేబుల్ కథ. రూరల్ పోలీస్ స్టేషన్‌లోని ఒక కానిస్టేబుల్ కథ. యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి. పైగా ఇది 90లో జరిగే కథ. ఇలాంటి సినిమాకి నేపథ్య సంగీతం ఇళయరాజా చేస్తే బావుంటుందని అనుకున్నాం. అయితే కథ వినగానే ఇళయరాజా, ఆయన తనయుడు యువన్ మేం చేస్తామని ముందుకు రావడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది.

ఇందులో సాధారణ కానిస్టేబుల్‌గా చైతూ అద్భుతంగా నటించారు. మా దర్శకుడు చెప్పినట్టు ఈ సినిమాలో కొత్త చైతూని చూస్తారు. అలాగే నాయిక కృతిశెట్టి తన పాత్రకు పూర్తి న్యాయం చేసింది. ఆమె పాత్ర అందర్నీ కచ్చితంగా అలరిస్తుంది. అరవింద్ స్వామి కథ వినగానే మరో ఆలోచన లేకుండా ఈ పాత్ర చేస్తానని చెప్పారు. థియేటర్‌లో ఆయన పాత్రని ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. టెర్రిఫిక్‌గా అదే సమయంలో చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుందీ ఆయన పాత్ర. శరత్ కుమార్ పాత్ర కూడా చాలా పవర్ ఫుల్‌గా ఉంటుంది. రెండు కొండల మధ్య చిట్టెలుక ఉంటే ఎలా ఉంటుందో అరవింద్ స్వామి, శరత్ కుమార్ మధ్య నాగచైతన్య పాత్ర అలా కనిపిస్తుంది. ప్రియమణి ముఖ్యమంత్రి పాత్రలో కనిపిస్తారు. ఈ సినిమా కోసం అండర్ వాటర్ సీక్వెన్స్ చేశాం. తెలుగు స్క్రీన్ మీద ఇలాంటి అండర్ వాటర్ సీక్వెన్స్ చూసి ఉండరు. దీంతోపాటు ఇందులో ఉన్న నాలుగు యాక్షన్ సీక్వెన్స్‌లు అద్భుతంగా ఉంటాయి. ఈ సక్సెస్ అవుతుందనే నమ్మకంతోనే దీనికి సీక్వెల్‌గా 'కస్టడీ 2' చేయాలనుకుంటున్నాం. తెలుగులో నాగచైతన్య కెరీర్‌లోనే హయ్యస్ట్ థియేటర్స్‌లో ఈ సినిమా రిలీజ్ అవుతుంది. తమిళనాడులో 200 థియేటర్స్ పైగా విడుదల చేస్తున్నాం.

రామ్, బోయపాటి సినిమా షూటింగ్ కంటిన్యూగా జరుగుతోంది. రామ్ బర్త్‌డేకి టీజర్ రిలీజ్ చేస్తాం. నాగార్జున సినిమా జూన్ నుంచి షూటింగ్ ఉంటుంది. అలాగే చైతో మరో సినిమా చేయబోతున్నాం.

> ఈ సినిమా అవుట్‌పుట్ చూసిన తర్వాత చైతన్య కెరీర్‌లోనే హయ్యస్ట్ ఫిల్మ్ అవుతుందనిపించింది. ఒక్కమాటలో చెప్పాలంటే నాగార్జున కెరీర్‌లో 'శివ' ఎలా గుర్తుండి పోయిందో, నాగచైతన్య కెరీర్‌లో ఈ సినిమా అలా గుర్తుండిపోతుంది. 'శివ' సినిమానే కాదు అందులో పాత్రలు ఎలా గుర్తుండి పోయాయో.. ఇందులో అరవింద్ స్వామి, శరత్ కుమార్, ప్రియ మణి.. పాత్రలు అలా గుర్తుండి పోతాయి. ప్రతి పాత్ర యూనిక్‌గా ఉంటుంది.

బాలయ్యతో ఢీ అంటే ఢీ..


అర్జున్ రాంపాల్

నందమూరి బాలకృష్ణ, అనిల్ రావిపూడి వంటి క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఎన్‌బికే108లో పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటించనున్నట్టు తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌ను షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. కాజల్ అగర్వాల్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కీలక పాత్రలో కనిపించనుంది. ఇందులోని ఓ పవర్ ఫుల్ పాత్ర కోసం బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్‌ని ఎంపిక చేశారు. అనౌన్స్‌మెంట్ వీడియోలో బాలకృష్ణ 'లెజెండ్' చిత్రంలోని 'ఫ్లూటు జింక ముందు ఊదు.. సింహం ముందు కాదు 'అనే పాపులర్ డైలాగ్‌ను అర్జున్ రాంపాల్ చెప్పారు. అలాగే దర్శకుడు అనిల్‌రావిపూడితో ఆయన చేసిన సంభాషణ కూడా ఉంది. ఈ సినిమాతో ఆయన టాలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తున్నారు. విజయదశమి (దసరా)కి ఈ సినిమా థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

హరోం హర.. ఫస్ట్ ట్రిగ్గర్ అదుర్స్

సుధీర్ బాబు హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో ఎస్‌ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్నారు. 'ది రివోల్ట్' అనేది సినిమా ట్యాగ్‌లైన్. నేడు (గురువారం) సుధీర్ బాబు పుట్టినరోజు. ఆయనకు అడ్వాన్స్ విషెస్ తెలియజేస్తూ మేకర్స్- ఫస్ట్ ట్రిగ్గర్ వీడియోను విడుదల చేశారు.

రేడియోలో వాతావరణ రిపోర్ట్‌తో వీడియో ప్రారంభమవుతుంది. కొంతమంది వ్యక్తులు తమ చేతుల్లో ఆయుధాలతో వస్తారు. అతని ముఖం కనిపించనప్పటికీ సుధీర్‌బాబు కుర్చీలో కూర్చుని చేతిలో తుపాకీ పట్టుకుని కనిపిస్తారు. చివరగా అతని తుపాకీ నుండి ఫస్ట్ ట్రిగ్గర్ విడుదలౌతుంది. 'అందరు పవర్ కోసం గన్ పట్టుకుంటారు... కానీ ఇది యాడాడో తిరిగి నన్ను పట్టుకుంది... ఇది నాకేమో సెప్తావుంది...' అని సుధీర్ బాబు కుప్పం యాసలో అదరగొట్టడం విశేషం. మాండలికం, ఆయన వాయిస్ బేస్ పాత్రకు ఇంటెన్స్ తెచ్చింది. సుధీర్ బాబు ఈ సినిమా కోసం పూర్తిగా మేక్ ఓవర్ అయ్యారు. ఫస్ట్ ట్రిగ్గర్ యాక్షన్‌తో ఉండి, సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. 'హరోం హర' కథ 1989లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరుగుతుంది. గ్లింప్స్ ద్వారా ఈ ఏడాది డిసెంబర్ 22న క్రిస్మస్ సెలవుల సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు. అరవింద్ విశ్వనాథన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. గ్లింప్స్‌లో విజువల్స్ అద్భుతంగా కనిపించాయి. చైతన్ భరద్వాజ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఎలివేషన్స్ ఇచ్చింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా పాన్-ఇండియా విడుదల కానుంది. భిన్న కథ, కథనాలతో సాగే ఈ సినిమా, సుధీర్‌బాబు నటన ప్రేక్షకులను కచ్చితంగా మెస్మరైజ్ చేస్తాయనే ధీమాతో మేకర్స్ ఉన్నారు. అలాగే సుధీర్‌బాబు కెరీర్‌లో గుర్తిండిపోయే సినిమాగా దీన్ని భావిస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం - జ్ఞానసాగర్ ద్వారక, నిర్మాత - సుమంత్ జి నాయుడు, సంగీతం - చైతన్ భరద్వాజ్, డీఓపీ - అరవింద్ విశ్వనాథన్, ఎడిటర్ - రవితేజ గిరిజాల.


సుమంత్ జి.నాయుడు, సుధీర్‌బాబు, జ్ఞానసాగర్ ద్వారక

వజ్ర కాళేశ్వరి దేవిగా..

'స్టన్ ప్రకాశన్, మనోహరం, బీస్ట్' వంటి సినిమాలతో మలయాళ, తమిళ సినీ పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాయిక అపర్ణాదాస్. 'విటి04' చిత్రంతో తెలుగు సినీరంగ ప్రవేశం చేస్తున్నారు. ఎంతో ప్రతిభ గల అపర్ణాదాస్‌ని తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తుండటం పట్ల చిత్ర బృందం సంతోషం వ్యక్తం చేసింది. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి సితార ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్.నాగ వంశీ, ఎస్.సాయి సౌజన్య ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పంజా వైష్ణవ్ తేజ్, శ్రీలీల, జోజు జార్జ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంతో శ్రీకాంత్ ఎన్.రెడ్డి దర్శకుడిగా పరిచయమవు తున్నారు. వైష్ణవ్ తేజ్ కెరీర్‌లో నాలుగో చిత్రంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో అపర్ణా దాస్ వజ్ర కాళేశ్వరి దేవి పాత్రను పోషిస్తున్నారు. సినిమాకి ఎంతో కీలకమైన పాత్రలో నటిస్తున్న అపర్ణ తన అద్భుతమైన నటనా నైపుణ్యంతో పాత్రకు కచ్చితంగా న్యాయం చేస్తుందని చిత్ర బృందం విశ్వసిస్తోంది. ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా చిత్రబృందం పక్కా ప్రణాళికతో ఈ చిత్రాన్ని రూపొందిస్తోంది.

అపర్ణ ఇటీవల తమిళంలో నటించిన 'దాదా' చిత్రం ప్రేక్షకులను మెప్పించడంతో పాటు విమర్శకుల ప్రశంసలూ అందుకుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని విశేషాలను, అప్‌డేట్లను మేకర్స్ త్వరలోనే తెలియజేయనున్నారు.


అపర్ణా దాస్

వాస్తవ సంఘటన ఆధారంగా అంతం కాదిది ఆరంభం

క్రసెంట్ సినిమాస్, కృష్ణ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నూతన దర్శకుడు ఇషాన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'అంతం కాదిది ఆరంభం'. పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ని దర్శకుడు దశరథ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'తమిళ నాడులోని పొల్లాచ్చిలో జరిగిన ఓ వాస్తవ సంఘటన ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. అమ్మాయిలను ట్రాప్ చేసి, వాళ్ల నగ్న వీడియోలను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యక్తిని బాధిత అమ్మాయిలు ఎలా పట్టుకున్నారు అనేదే ఈ చిత్ర కథ. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న కరెంట్ ఇన్సిడెంట్స్‌ని బేస్ చేసుకుని తీశారు. టైటిల్ బాగుంది. సినిమా పెద్ద విజయం సాధించాలి' అని చెప్పారు.

'కృష్ణ మీద అభిమానంతో మా సినిమాకి ఈ టైటిల్ పెట్టాం. ఎక్కడా రాజీ పడకుండా తీశాం. మహిళలపై అత్యాచారాలకి పాల్పడే వారికి ఈ చిత్రం ఓ మేసేజ్ ఇస్తుంది. సమాజంలో జరుగుతున్న వాస్తవ సంఘటనల ఆధారంగా హీరో, దర్శకుడు ఇషాన్ ఈ చిత్రాన్ని చాలా చక్కగా తెరకెక్కించారు' అని నిర్మాత సిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య, లిరిక్ రైటర్ రాంబాబు గోసాల, హీరోయిన్స్ శక్తి మహీంద్రా, నిష్మా, షేర్ స్టూడియో అధినేత దేవీ ప్రసాద్, గీతా సింగ్, ఖాదర్ గౌరీ, వైష్ణవి, నాగ మధు తదితరులు పాల్గొన్నారు.


నిష్మా, శక్తి మహీంద్రా

అత్యున్నత పోలీస్ శాఖగా తెలంగాణ పోలీస్

- హోంమంత్రి మహమూద్ అలీ
- 281 మందికి పోలీస్ మెడల్స్ ప్రదానం

నవతెలంగాణ-సిటీబ్యూరో/కల్చరల్

ఫ్రెండ్లీ పోలీసింగ్, మహిళా భద్రతా విభాగం, భరోసా కేంద్రాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, మాదక ద్రవ్యాల నివారణ తదితర చర్యలతో తెలంగాణా పోలీస్‌శాఖ దేశంలోనే అత్యున్నతంగా హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పలు సేవా పతకాలను బుధవారం ప్రదానం చేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో 281 మంది పోలీస్ అధికారులకు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడారు. శాంతి భద్రతల పరిస్థితి మెరుగ్గా ఉంటేనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు సక్రమంగా జరిగి రాష్ట్రం పురోభివృద్ధిలో పయనిస్తుందన్నారు. ముఖ్యమంత్రి పోలీస్ శాఖకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఇటీవల ప్రారంభించిన రామగుండం పోలీస్ కమిషనరేట్ లాంటి భవనం మరెక్కడా లేదన్నారు. కొత్త పోలీస్ జోన్లు ఏర్పాటు చేయడం, పోలీస్ డివిజన్లు, పోలీస్ స్టేషన్లు కొత్తగా ఏర్పాటు చేయడంతోపాటు నార్కోటిక్స్ కంట్రోల్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తున్నారని చెప్పారు. అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో కూడిన కమాండ్ కంట్రోల్ టవర్‌ను కూడా ప్రారంభించుకున్నామని తెలిపారు.



పది ఫలితాల్లో గురుకులాల ప్రభంజనం

- మంత్రులు కొప్పుల, గంగుల హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ఫలితాల్లో గురుకులాల్లోని విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. అత్యుత్తమ ఫలితాలతోపాటు విద్యార్థులు మంచి మార్కులు సాధించి సత్తాచాటారు. బీసీ గురుకులంలో పది జీపీఏ సాధించిన విద్యార్థులు 214 మంది ఉన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన బీసీ గురుకులాలు 89 ఉన్నాయి. సిద్దిపేట, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. బీసీ గురుకులంలో 18,404 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 17,507 (95.03 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్య బట్టు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ గురుకులంలో 95.50 శాతం ఉత్తీర్ణత

రాష్ట్రంలోని ఎస్సీ గురుకులంలో 17,709 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరైతే వారిలో 16,915 (95.50 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 82 ఎస్సీ గురుకులాలు వంద శాతం ఉత్తీర్ణతను నమోదు చేశాయి. 126 మంది విద్యార్థులకు పదికి పది జీపీఏ వచ్చింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎస్సీ గురుకులాల కార్యదర్శి రోనాల్డ్ రోస్ బుధవారం ఒక ప్రకటనలో అభినందించారు.

60 మైనార్టీ గురుకులాల్లో వందశాతం ఉత్తీర్ణత

రాష్ట్రంలో 60 మైనార్టీ గురుకులాల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 204 మైనార్టీ గురుకులాల నుంచి 10,638 మంది పరీక్ష రాస్తే, 10,090 (95 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని మైనార్టీ గురుకులాల కార్యదర్శి బి షఫీఉల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 82.4 శాతం, సెకండియర్‌లో 86.5 శాతం ఉత్తీర్ణత వచ్చిందని పేర్కొన్నారు.

గిరిజన గురుకులాల్లో 92.76 శాతం ఉత్తీర్ణత

రాష్ట్రంలో 21 గిరిజన గురుకులాలు వంద శాతం ఉత్తీర్ణతను నమోదు చేశాయి. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, గిరిజన గురుకులాల కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 6,383 మంది పరీక్షలు రాస్తే 5,921 (92.76 శాతం) మంది విద్యార్థులు పాసయ్యారని వివరించారు.



38 మోడల్ స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత

రాష్ట్రంలో 38 మోడల్ స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 18,213 మంది పరీక్షలు రాస్తే, 16,629 (91.30 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారని వివరించారు. 101 మంది విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించారని తెలిపారు.

కేజీబీవీల్లో 83.86 శాతం ఉత్తీర్ణత

రాష్ట్రంలోని 475 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ల్లో 16,702 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే, 14,006 (83.86 శాతం) మంది పాసయ్యారని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. 91 కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైందని వివరించారు. పదికి పది జీపీఏ సాధించిన విద్యార్థులు 23 మంది ఉన్నారని పేర్కొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నాణ్యతలేని హోటల్స్... అధికారుల పర్యవేక్షణ కరువు

హోటళ్లలో నాణ్యత ఉండటం లేదు. దీనిపై అధికారుల నియంత్రణ ఉండటం లేదు. చాలాచోట్ల హోటళ్లు, లాడ్జిలు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నాయి. పట్టించుకునే నాథుడే లేడనే ధీమాతో వారు యథావిధిగా నాణ్యత పాటించడం లేదు. వాస్తవానికి బ్రిటిష్ హయాం 1800లో ఏర్పడిన ఇండియన్ సరైస్ చట్టంలో హోటళ్లు, లాడ్జీలు, టాయిలెట్లకు అనుమతి ఇవ్వాలని, బాటసారులకు ఉచిత నీటిని అందించాలని ఉంది. దీని అర్థం కస్టమర్ అయినా కాకున్నా యాక్సెస్ ఉచితం. ఈ చట్టం ప్రకారం మీరు హోటళ్లలో నీటిని ఉచితంగా అడగవచ్చు. నేరుగా వాష్‌రూమ్‌ను ఉపయోగించవచ్చు. కానీ అది రాష్ట్రంలో అమలవుతుందా? ఎక్కడా కానరావడం లేదు. గుక్కెటు నీటికోసం వాటర్‌బాటిల్‌ను కొనుక్కోవాల్సిన పరిస్థితి. దేశంలోని అనేక రాష్ట్రాలు జిల్లాలు సరైస్ చట్టం, 1867 కింద హోటళ్ల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేశాయి. ఈ చట్టం ప్రకారం మీ పెంపుడు జంతువులకు నీటిని కూడా అడగవచ్చు. కాబట్టి, హోటళ్లలో ఉచితంగా నీరు తాగడానికి, వాష్‌రూమ్ సౌకర్యాలను ఉపయోగించుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉంది. మహిళలు, పిల్లలు హోటళ్లలో మంచినీరు, మరుగుదొడ్లు వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. హోటల్ రెస్టారెంట్ బార్ వారు తిరస్కరించినట్లయితే, వారి ఆరోగ్య లైసెన్స్ రద్దు చేయబడే ప్రమాదం ఉందని వారి ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరించబడదని ఈ చట్టంలో పేర్కొంది. ఈ చొరవ కింద కొన్ని రాష్ట్రాల్లో, హోటళ్లలోనే కాదు, పబ్బులు, బార్‌లలో కూడా వాష్‌రూమ్‌లను ఉచితంగా ఉపయోగించవచ్చు. కొన్ని రాష్ట్రాల్లో అలాంటి ప్రణాళికలు లేకపోయినా, టాయిలెట్లను ఉపయోగించవచ్చు, ఉచిత నీటి కోసం అడగవచ్చు. గేట్‌వే ఆఫ్ ఇండియాను సందర్శించిన ప్రజలు సమీపంలోని ఫైవ్‌స్టార్ హోటల్‌లో టాయిలెట్లను ఉపయోగించా లని డిమాండ్ చేశారు. దీనిపై హోటల్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో పిల్ దాఖలైంది. హోటల్ బయట పబ్లిక్ టాయిలెట్ నిర్మించాల్సి వచ్చింది. పౌరులందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఉంది. మన జీవితాలను సులభతరం చేయడానికి ఇటువంటి హక్కులు ఉన్నాయి. దానిని సరైన మార్గంలో ఉపయోగించుకునే బాధ్యత కూడా మనదే. హైవేల వెంబడి హోటళ్ల వ్యాపారుల చేతిలో కస్టమర్లు మోసపోవడం సాధారణమైంది.

ప్రభుత్వ నియమం ప్రకారం, హోటల్ యజమానులు వారు అందించే ఉత్పత్తులు సేవ, మెనూ, ధర ట్యాగ్‌ను పోస్ట్ చేయాలి. అయినప్పటికీ ఇది సక్రమంగా అమలు చేయబడటం లేదు. వారు అందించే ఆహార నాణ్యతలో కూడా ఎటువంటి మెరుగుదల లేదు. చాలా మంది ప్రయాణికులు గత్యంతరం లేక హోటళ్లకు వెళుతున్నారు. రహదారి వెంట ఉన్న హోటళ్లలో నాణ్యత ఏమాత్రం ఉండదు. మంచినీరు అందుబాటులో ఉంచడం లేదు. కస్టమర్లు ఎక్కువమంది ఉన్నప్పుడు రెండు లీటర్ల బాటిల్స్ కూడా ఉండవు. మంచి నీరు ఉండదు కానీ ఫౌంటెన్ నుండి నీరు పడుతుంటుంది. టర్కీ కోళ్లు, ఫారం కోళ్లు, కుందేళ్లు, బాతులు కృత్రిమ వాతావరణంలో పెంచుతుంటారు. కస్టమర్లను దోచుకోవడం పరమావధిగా ప్రవర్తిస్తుంటారు. కస్టమర్లు బిల్లు కూడా చూడకుండా డబ్బులు కడుతున్నారు. నగరాల్లో ఉండే రద్దీ హోటల్స్ లోనే వారం రోజుల క్రిందటి చికెన్, మటన్



దర్శనమిస్తుంది, ఎక్కడో అడవిలో ఉండే హోటల్స్‌లోని తిండిపదార్థాల గురించి చెప్పక్కర్లేదు. వీటిని నియంత్రించడానికి ఎవరూ ఉండరు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది ఎవరూ పట్టించుకోరు. ఒక్క హోటల్ లోను ధరల పట్టిక ఉండదు. టీ, వాటర్ బాటిల్ కొని వంద రూపాయలు ఇస్తే చిల్లర రాదు. ఇద్దరు టిఫిన్ చేస్తే ఐదువందల రూపాయలు. మరిన్ని హోటళ్లు థర్మల్ స్టేషన్‌లో ఉత్పత్తి అయ్యే విద్యుత్ కేవలం వీరి వెలుగు కోసం అన్నట్లు జిగేల్ జిగేలమని వెలుగుతుంటాయి. ఎవడెట్లాపోతే నాకేంటి అని కస్టమర్లు నోరు మెదపక ఉన్నారు. తరచూ ప్రయాణాలు చేసే వారికి వేరే మార్గం లేదు. వినియోగదారులు తక్కువ నాణ్యత గల ఆహారం కోసం ఎక్కువ ధర చెల్లించవలసి ఉంటుంది. బస్సు ప్రయాణం చేసే వారికి మధ్యస్థంగా ఉండే హోటల్స్ దగ్గర బస్సులు నిలుపుతున్నారు. అక్కడ రుచి శుచి శుభ్రత ఏమాత్రం ఉండదు. టాయిలెట్స్ చాలా అధ్వానంగా ఉంటున్నాయి, హోటల్ పరిసర ప్రాంతాలల్లో మూత్ర విసర్జన చేయడంతో దుర్గంధం వెదజల్లుతుంటుంది. సిగరెట్లు, బీడీలు బహిరంగంగా తాగడం వలన మహిళలు, పిల్లలు కూర్చోవడానికి ఇష్టపడరు.

డ్రైవర్లకు హెల్పర్లకు కొంతమేర బెనిఫిట్స్ చెల్లించాలని, డ్రైవర్, హెల్పర్లకు కూడా ఉచితంగా భోజనం అందించాలి. కావున కస్టమర్ల నుంచి డబ్బు గుంజుతున్నారు. ఆహార కల్తీని నిరోధించలేకపోతున్నారు. కల్తీ ఆహారం తిని ప్రయాణికులు జబ్బులు పాలవుతున్నారు. కల్తీ నూనెలు, వంట నూనెలు కందెనని తలపిస్తుంటుంది. ఈ మధ్యకాలంలో చికెన్ లాలీ పాప్, పకోడాలలో చికెన్ వేస్ట్ కాళ్ళు, స్కిన్, పేగులు కలపడం సాధారణం. హైవే దాబాలో కుళ్ళిన మాంసం పెడుతున్నారని, చికెన్ బిర్యానీ బదులు కుక్క బిర్యానీ పెడుతున్నారని చాల వార్తలు చదువుతూనే ఉన్నాం. ఒక్క మాంసమే కాదు, బయట చేసే ఫాస్ట్ ఫుడ్స్ అన్నింటిలో ఆహార కల్తీ ఉంటుంది. అన్ని కూడా ఆహారంలో కల్తీ అవుతూనే ఉంటున్నాయి. పరిమితికి మించి రంగులు వాడకం ఎక్కువగా ఉంటున్నది. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ కాఫీ, టీ స్టాల్స్‌లో సింథటిక్ పాలు వినియోగం ఎక్కువగా ఉంటున్నది. ఇక ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లలో కల్తీ నూనెలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. పానీపూరి చేసే ఇళ్లల్లో పందులు కూడా నివసించవు. ఫ్రూట్ సలాడ్, ఐస్ క్రీమ్, ఐస్, నూడుల్స్ తయారు చేసే ప్రదేశాలలో శుచి శుభ్రత పాటించక అవి తిన్నవారు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. రంగు రంగుల కూల్ డ్రింక్ బాటిల్స్ కొన్ని వాటికి ఊరు పేరు ఉండదు, కుర్ కురే, లేస్, చిప్స్, బిస్కెట్, ముంగ్ దాల్, బాదాం మిల్క్, రోజ్ మిల్క్ అన్నీ నకిలీ ఉత్పత్తులే. ఎప్పుడో వండి పెట్టిన సమోసా, బజ్జీలు దుమ్ము పట్టి ఉంటాయి. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ప్రతి రోజు తనిఖీ చేయాలి, తయారీ కేంద్రాలను పరిశీలించాలి, ఎక్కువ మోతాదులో రంగుల వాడకాన్ని, కల్తీ పాల వాడకాన్ని నియంత్రించి తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఇలాంటి విషయాల పట్ల ఉదాసీనంగా ఉండటం బాధాకరం. వినియోగదారులు, ప్రజలకు అప్రమత్తత అవసరం. సామాజిక మాధ్యమాలలో హైవే దోపిడీ గురించి పోస్ట్ చేయాలి. అశుభ్రత, కనీస వసతులు కల్పించలేని హోటల్స్‌పై ఫిర్యాదు చేయడానికి టోల్ నెంబర్లు ప్రకటించాలి.

- డా. ఎం.సురేష్ బాబు

సామన్యులకు భారంగా 'వందే భారత్'



ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే వ్యవస్థగా భారత్ పేరొందింది. అనేక లక్షల మంది ఉపాధి పొందుతూ గత దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్నారు. ఇక దీనికి అనుసంధానంగా అనేక లక్షల మంది తినుబండారాలు, ఇతర వ్యాపారాలు చేసుకుంటూ జీవనయానం కొనసాగిస్తున్నారు. బ్రిటిష్‌వారు మొదట్లో మనదేశ సంపద, ప్రకృతి వనరులు, ఖనిజాలు వంటివి దోపిడీ చేసే నిమిత్తం ఈ రైల్వే వ్యవస్థ నిర్మాణం చేసినా, తరువాత కాలంలో మనదేశంలో వివిధ ప్రాంతాల ప్రజలకు ప్రయాణసాధనంగా ఆనాటి నుంచి నేటి వరకూ ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా చౌకగా ప్రయాణం చేయడానికి, సురక్షితంగా దూర ప్రాంతాలకు వెళ్ళేందుకు రైల్వేకు మించిన వేరొక ప్రయాణ సాధనం లేదంటే అతిశయోక్తి కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రైల్వేశాఖలో అనేక ఆధునీకరణ పనులు చేపట్టారు. ముఖ్యంగా బొగ్గుతో నడిచే ఇంజన్లు స్థానంలో డీసిల్ ఇంజన్లు, తదుపరి ప్రస్తుతం చాలా రైళ్లు విద్యుత్‌తో నడుస్తూ దూరప్రాంతాలను అతి తక్కువ సమయంలో చేరవేయుట జరుగుతుంది. ముఖ్యంగా మీటర్ గేజ్, బ్రాడ్ గేజ్‌గా మార్చుట, సింగిల్ లైన్ వ్యవస్థను డబుల్ లైన్ ఏర్పాటు చేయుట, రైల్లు నడిచే వేగం పెంచుట, కొన్ని రైళ్లను పొడిగిస్తోంది. ఇక వస్తు రవాణా చేసే "గూడ్స్" రైళ్ల ద్వారా అనేక ప్రాంతాలకు వివిధ వస్తువులను ఎగుమతి, దిగుమతి చేయుట ద్వారా అధిక ఆదాయం సమకూర్చుకుంటూ దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా రైల్వే దినదినాభివృద్ధి చెందుతూ ఉంది. ఇక గత మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా అమలు అవుతున్న సరళీకరణ విధానాలు, రైల్వే వ్యవస్థపైన ప్రభావం చూపుతూ లాభాల్లో నడుస్తున్న రూట్లో కూడా ప్రస్తుత ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయడం వల్ల రైల్వే అస్తిత్వానికి ప్రమాదం ఉందని అందరూ గ్రహించాలి. ఇప్పటికే అనేక విభాగాల్లో కేటరింగ్, టికెట్స్, మెయింటైనెన్స్, కోచ్ తయారీ, లైన్లు, వర్క్‌షాప్ వంటివి ప్రయివేటీకరణ చేశారు. భవిష్యత్తులో మరెన్నో విభాగాల్లో చేయనున్నట్టు తెలుస్తోంది.

ఎంతో ప్రెస్టీజియస్‌గా, స్వదేశీ పరిజ్ఞానంతో తయారై ప్రవేశపెట్టిన, తరచూ మన ప్రధాని జెండా ఊపి ప్రారంభిస్తున్న 'వందే భారత్' రైల్ సామాన్య ప్రజలకు ఆమాటకొస్తే మధ్య తరగతి ప్రజలకు భారంగా ఉన్న మాట వాస్తవం. ఎక్కువ ధరలతో చాలామంది నడ్డివిరిచే ప్రయాణాలు. అనగా ధనికులు, భూస్వాములకు మాత్రమే ఈ ప్రయాణాలు అనుకూలం. అనగా అనాదిగా పేదలకు, అల్పాదాయ వర్గాలకు అనుకూలంగా, సౌకర్యంగా ఉండే రైలు ప్రయాణం బహుభారం కానుంది. కరోనా పుణ్యమా అని ఇప్పటికే "ప్యాసింజర్ రైళ్లు రద్దు" చేసి, పేదలకు చౌక ప్రయాణం దూరం చేశారు. వృద్ధులకు, ఇతర మినహాయింపు ఇచ్చే వారికి ఇచ్చే సౌకర్యాలు, ఆఖరుకు జర్నలిస్టులకు ఇచ్చే రాయితీలు కూడా రద్దు చేశారు. ఇదేనా నేటి పాలకులు, ప్రభుత్వాలు సామాన్య, వృద్ధులకు ఇచ్చే బహుమతి..!? ఆలోచన చేయాలి. స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ ఆశయాలు సామాన్య ప్రజలకు అన్ని వసతులు అనగా విద్య, వైద్యం, రవాణా, తాగునీరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షిస్తూ ఉంటే, వాటినే ఖరీదైన వాటిగా, అందుబాటులో లేకుండా చేయడమా నేటి పాలకుల విధానం..!? ప్రతీదీ ప్రయివేటీకరణ చేయడానికా ఈ ప్రభుత్వాలకు అధికారం కట్టబెట్టుతుంది. పౌర సమాజం కూడా నేటి ప్రభుత్వాల విధానాలు పై విశ్లేషణ చేయాలి. వాస్తవాలను గ్రహించాలి. భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలి.


ఇటీవల కాలంలో 2.40లక్షల కోట్ల రూపాయలు అనగా 25శాతం పైబడి లాభాలతో రైల్వే శాఖ ఉందని గణాంకాలు చెబుతున్నాయి. పేద ప్రజల నడ్డివిరిచి, సంపాదించే ఈ లాభాలు ఎవరి కోసం అనేది అందరూ ప్రశ్నించాలి. ఒక ప్రక్క "బుల్లెట్ ట్రెయిన్" అని, మరొక పక్క "వందే భారత్" అని నూతన రైల్లు ప్రస్తుతం ఆధునిక కాలంలో అవసరతలు రీత్యా అవసరమే కానీ అదే సమయంలో పేద, సామాన్య ప్రజలకు రైల్వే ప్రయాణం భారం చేయుట సమంజసమా..!? ఒకపక్క దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి, కానీ నేటికీ మనదేశంలో మూడు పూటలా తిండిలేని వారు 22కోట్ల మంది ఉన్నారు అనే విషయం మరువరాదు. అభివృద్ధి అంటూ జాతీయ రహదారులు, పెద్ద పెద్ద విగ్రహాలు భవనాలు నిర్మాణాలు విమానాశ్రయాలు వంటివి ప్రపంచానికి చూపెడుతూ, పేదరికాన్ని దాచి పెడుతూ పాలన సాగించటం వాస్తవ అభివృద్ధా... ప్రపంచ సూచికల్లో అనేక రంగాల్లో మనం వెనుకబడిన సంగతి మరువరాదు. అదనపు భారాన్ని ప్రజలపై మోపకుండా ఆధునిక విధానాలు అమలు చేయడం ద్వారా రైల్వేలకు లాభాలు సంపాదించవచ్చు. ఉదాహరణకు "మెట్రో రైలు" ప్రయాణించడానికి టికెట్ లేకుండా ప్రయాణించడం దాదాపు అసాధ్యం. ఆ విధంగా దాదాపు అన్ని రైల్వే స్టేషన్లో దశల వారీగా ఈ విధానం అమలు చేయడం ద్వారా ప్రతీ ఒక్కరూ టికెట్ కొని ప్రయాణం చేయడం ద్వారా లాభాలు వస్తాయి. సరుకు రవాణాపై అవకాశం మేరకు చార్జీలు పెంచాలి. నిత్యావసరాలపై తగ్గించాలి. ధనికులు, పెద్ద, పెద్ద వ్యాపార సంస్థలు, వేత్తలకు ఇచ్చే రాయితీలు ప్రోత్సాహకాలు తగ్గించాలి. ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు కలిగించే రీతిలో రైల్వే వ్యవస్థలో మార్పు చేస్తూ, మనదేశంలో అతిపెద్ద రవాణా వ్యవస్థ రైల్వేలు భారత దేశ ప్రజలకు మేలుచేసే విధంగా ఉంటుందని ఆశిద్దాం...

- ఐ.ప్రసాదరావు

'మూసీ' ప్రక్షాళన నేటి తక్షణ అవసరం

హైదరాబాద్ నగరం నడి మధ్య నుండి పాత, కొత్త నగరాలను వేరు చేస్తూ ఆహ్లాదంగా పారే ఒకప్పటి ముచుకుందా నది నేటి మూసీ నది రసాయన, వ్యర్థాల నిలయంగా మారింది. కృష్ణా నదికి ఉపనదైన మూసీ నది వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో 2,168 అడుగుల ఎత్తులో పుట్టి భాగ్యనగర వాసుల దాహార్తిని తీర్చిన జలాశయం. హుస్సేన్ సాగర్ సరస్సును మూసీ ఉపనదిపై నిర్మించారు అంటేనే మూసీ నీరు ఎంత స్వచ్ఛంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. మూసీనదిపై హైదరాబాద్ నగరంలో దాదాపు ఏడు వంతెనలు ఉన్నాయి. వీటిలో పురానాపూల్ అత్యంత పాత వంతెన. హైదరాబాద్ గుండా సుడుల సయ్యాటలు ఆడుతూ సందర్శకులను అలరిస్తూ వాడపల్లి వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన మూసీనది పట్ల అప్పటి ఉమ్మడి పాలకుల స్వార్థపూరిత వైఖరి వలన ప్రజల ఆరోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఏ ప్రభుత్వం వచ్చినా మాటలతో కాలం వెళ్ళబుచ్చడమే కానీ మూసీ శుద్ధి కార్యాచరణకి నడుం కట్టలేదు. విపరీతమైన పారిశ్రామిక కారిడార్లకు అనుమతులిచ్చి వాటి నుండి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలకు డంపింగ్ యార్డ్ లాగా మారింది.

1908 సెప్టెంబర్ 28న వచ్చిన వరదల వలన మూసీ ఉగ్రరూపాన్ని జంట నగరాల ప్రజలు చవి చూశారు. అప్పటి అనుభవాల నుండి కొంత మేరకు ఆధునీకరణ చేసినా ఎక్కడ కూడా ఈ నది ప్రక్షాళన కార్యక్రమం ఎంచుకొలేదు. ఫలితంగా ఇప్పటికీ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్వార్థమే పరమావధిగా భావిస్తున్న రాజకీయ నాయకులకు ప్రజల ఆరోగ్యం, ప్రకృతి గమనం గురించిన ధ్యాస ఉండదు అనేది కాలం నిరూపిస్తున్నది. ఈ నది పరివాహక ప్రాంతంలో ప్రజలు, పశుపక్ష్యాదులు అనేక అవస్థలు పడుతున్నారు. విషపు నీళ్ళతో, విషపు గాలితో పండిన పంటలు తినడంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటున్నది. గత పాలకుల వలనే స్వరాష్ట్ర పాలకులు కూడా మూసీ పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తూ కాలం వెళ్లబుచ్చు తున్నారు. తెలంగాణ వస్తే మూసీకి మునుపటి కళ వస్తుంది అనుకున్న నా లాంటి వాళ్లకు నిరాశ మిగిలింది. మూసీ అంటేనే దుర్గంధాలకు నెలవు అనే భావన నెలకొన్నది.



ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మన చరిత్ర సంస్కృతి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఉపన్యసించిన వారికి మూసీ నదీ హైదరాబాద్ చరిత్ర, సంస్కృతిలో విడదీయలేని అనుబంధం అనే యాది మరిచి గత పాలకుల వలనే పాలన కొనసాగిస్తున్నారు. 68శాతం ప్రజలు ఆర్థరైటిస్, 79శాతం ప్రజలు చర్మ వ్యాధులతో, 44శాతం ప్రజలు డయేరియా భారిన పడి అవస్థలు పడుతున్నారు.

మూసీ నరాల్లోకి లాభాల విషాన్ని నింపి చిక్కిశల్యమైంది. నవ యవ్వనంలా ఉరకలెత్తే మునుపటి మూసీ నది లాగా జలకళ ఉట్టిపడేలా ప్రక్షాళన చేసి స్వచ్ఛమైన గాలి, నీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైన ఉన్నది. ఉమ్మడి నల్లగొండ ప్రజల బాధలు వర్ణనాతీతం. ఫ్లోరిన్ భూతం పట్టి పీడిస్తుంది. భూగర్భ జలాలు విషపూరితం అయ్యి స్వచ్ఛమైన జలాలకు బదులు విషపు జల ఊటల ఉయాలలోనే ఊపిరి వదులుతున్నారు. ఈ విషాలన్నింటి మూలంగా పర్యావరణ కాలుష్యం పెరిగిపోయి శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. కిడ్నీ సమస్యలతో సతమతమై ఆర్థిక బాధలకు తాళలేక అటు అనారోగ్యం ఇటు ఆర్థిక కష్టాలతో తట్టుకోలేక ఆత్మహత్యల పాలవుతున్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజ అభివృద్ధి పురోగమిస్తోంది. ఆరోగ్యవంతమైన మానవుడు ఉత్పత్తిలో భాగం అయినప్పుడు ఉత్పాదకత పెరుగుతుంది. సగటు దేశ, వ్యక్తి ఆదాయం పెరుగుతుంది. ఆర్థిక వృద్ధి రేటు దూసుకెళ్తుంది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.

తరగతి గదిలో పాఠాలు చెప్పి తన జీతంతో సుఖంగా జీవించే అవకాశం ఉన్నా కానీ సామాజిక బాధ్యతతో, సాటి పౌరులను ప్రేమించే గుణం ఉన్న ప్రొఫెసర్ వెంకటదాస్ మూసీనది ద్వారా వస్తున్న ప్రమాదాన్ని గుర్తించి, ప్రజలు పడుతున్న అవస్థలు చూసి ప్రభుత్వాలు తాము ఇచ్చిన హామీల్లో ఒక్కటైన మూసీ సుందరీకరణను ప్రభుత్వం దృష్టికి తీసుకోచ్చేందుకు సుదీర్ఘ పాదయాత్ర ప్రారంభించారు. అడుగు అడుగు కదుపుతూ హైదరాబాద్ మహానగరం గుండా సాగు తున్న ఈ పాదయాత్ర చరిత్రలో లిఖించదగినది. తన వ్యక్తిగత పనులకు వెచ్చించే సమయాన్ని ప్రజా ప్రయోజనం కోసం వినియోగిస్తూ, ప్రజలను చైతన్య పరుస్తూ, ప్రభుత్వానికి తన బాధ్యతను గుర్తు చేస్తూ సాగు తున్న ఈ పాదయాత్రలో ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు భాగస్వామ్యం అవుతున్నందుకు వారిని అభినందించాలి. జీవ వైవిధ్యాన్ని కాపాడాలి. ప్రజలను, ఇతర జీవ జాతిని, ప్రకృతిని బతికించుకోవడం ఇప్పుడు మన ముందున్న తక్షణ కర్తవ్యం. మూసినీ శుద్ధి చేసి పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యాలు కాపాడాల్సిన బాధ్యత గుర్తెరిగి ప్రభుత్వం మూసీ నది సుందరీకరణ కార్యాచరణకు పూనుకోవాలి.

- డా.పి.నారాయణ

తెలుగు రాష్ట్రాల్లో 20 లక్షల 5జీ యూజర్లు

ఎయిర్‌టెల్ వెల్లడి

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తమ సంస్థ 20 లక్షల మంది 5జీ వినియోగదారుల మైలురాయిని దాటిందని భారతీ ఎయిర్‌టెల్ తెలిపింది. దేశంలో 5జీ సేవలు ప్రారంభించిన తొలి 8 నగరాల్లో హైదరాబాద్ ఒక్కటని పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో 150 నగరాలు, పట్టణాల్లో 5జీ సేవలను అందుబాటులోకి తెచ్చామని భారతీ ఎయిర్‌టెల్ ఏపీ, తెలంగాణ సీఈఓ శివన్ భార్గవా తెలిపారు.

కాగ్నిజెంట్, గూగుల్ క్లౌడ్ భాగస్వామ్య విస్తరణ

న్యూఢిల్లీ : ఎంటర్‌ప్రైజ్ క్లయింట్లకు ఎఐ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు తమ భాగస్వామ్యాన్ని విస్తరించామని కాగ్నిజెంట్, గూగుల్ క్లౌడ్ కంపెనీలు ప్రకటించాయి. బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు సిద్ధాంతంపై పని చేస్తున్న సంస్థలకు వినూత్న పరిష్కారాలను అందించేందుకు తాము దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నామని పేర్కొన్నాయి. ఇందుకోసం కాగ్నిజెంట్ బెంగుళూరులో, లండన్, శాన్ ఫ్రాన్సిస్కోలలో కొత్త గూగుల్ క్లౌడ్ ఎఐ ఇన్నోవేషన్ సెంటర్‌లను ప్రారంభించినట్లు తెలిపాయి. నూతన కాగ్నిజెంట్ గూగుల్ క్లౌడ్ ఎఐ విశ్వవిద్యాలయం 25,000 మంది కాగ్నిజెంట్ నిపుణులకు, క్లయింట్‌లకు శిక్షణనిస్తుందని వెల్లడించాయి.

గో ఫస్ట్ దివాలా ప్రక్రియకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం

న్యూఢిల్లీ : ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న గో ఫస్ట్ విమానయాన సంస్థ దాఖలు చేసిన స్వచ్ఛంద దివాలా పరిష్కార ప్రక్రియ పిటిషన్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) స్వీకరించింది. దివాలా పరిష్కారకర్తగా అభిలాష్ లాల్‌కు కంపెనీ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ జస్టిస్ రామలింగం సుధాకర్, జస్టిస్ ఎల్ఎన్ గుప్తా నేతృత్వంలోని ధరాస్మనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. గో ఫస్ట్ దివాలా ప్రక్రియ కేసును వేగంగా విచారణ జరిపించాలన్న ఆ కంపెనీ విజ్ఞప్తి మేరకు ఎన్‌సీఎల్‌టీ స్పందించినట్లయ్యింది. బోర్డు ఆఫ్ డైరెక్టర్లను సస్పెండ్ చేసింది. ఆ కంపెనీ చెల్లింపులపై మారటోరియం విధించింది.

గడువులోగా రా రైస్ ఎఫ్‌సీఐకి ఇవ్వాలి

కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రైతుల శ్రేయస్సుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి చెప్పారు. 2021-22 రబీ సీజన్‌కు 15లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ రైస్‌ను తెలంగాణ రైతుల నుంచి సేకరించేలా అనుమతులు మంజూరు చేయాలంటూ తాను కేంద్రానికి లేఖ రాసినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుకు కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పందించారని తెలిపారు. మొత్తం 13.73 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ రైస్ సేకరణకు, లక్ష్యానికి తగినట్టుగా మిగిలిన బియ్యాన్ని రా రైస్ రూపంలో నిర్దేశించిన గడువులోపు ఎఫ్‌సీఐకి అందజేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

'ముందస్తు జననాల'లో శిశు మరణాలు

న్యూఢిల్లీ : 2020లో అంతర్జాతీయంగా 1.34 కోట్ల మంది చిన్నారులు నిర్ధారిత 37 వారాల కంటే ముందుగానే ఈ లోకంలోకి అడుగు పెట్టారు. ఈ జననాలలో 45 శాతం ఐదు దేశాలు... భారత్, పాకిస్తాన్, నైజీరియా, ఇథియోపియా సహ పలు దేశాల్లో సంభవించాయి. అయితే ఇలా ముందుగా జన్మిస్తున్న శిశువులలో ఎక్కువ మంది అనారోగ్యం, ఇతర కారణాలతో మృత్యువాత పడుతున్నారు. ఐక్యరాజ్యసమితి సంస్థలు, వాటి భాగస్వాములు బుధవారం దీనికి సంబంధించిన నివేదికను విడుదల చేశారు. డబ్ల్యూహెచ్ఓ, యునిసెఫ్, పీఎంఎన్‌సీహెచ్ సంయుక్తంగా దీనిని రూపొందించాయి. 46 దేశాలకు చెందిన 140 మంది వ్యక్తులు దీనిలో భాగస్వాములయ్యారు.

ముందస్తు జననాలు 'నిశ్శబ్ద ఎమర్జెన్సీ'ని తలపిస్తున్నాయని ఈ నివేదిక హెచ్చరించింది. ముందుగానే పుట్టిన చిన్నారుల ఆరోగ్యం, వారి మనుగడ ప్రమాదంలో పడతాయని తెలిపింది. 2020లో ముందుగానే పుట్టిన నవజాత శిశువులలో సుమారు లక్ష మంది అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. అంటే ప్రతి పది మందిలో ఒకరు చనిపోయారన్న మాట. బంగ్లాదేశ్, మాలవి, పాకిస్తాన్, గ్రీస్, అమెరికా దేశాలలో ముందస్తు జననాలు ఎక్కువగా జరిగాయి. గర్భిణులు, శిశువుల ప్రాణాలకు ఘర్షణలు, వాతావరణ మార్పులు, కోవిడ్, జీవన వ్యయం ముప్పు కలిగిస్తున్నాయని నివేదిక తెలిపింది. ఈ సమస్యలను అధిగమించాలంటే ఆయా రంగాలలో మరిన్ని పెట్టుబడులు అవసరమని సూచించింది. ఉదాహరణకు వాయు కాలుష్యం కారణంగా ప్రతి సంవత్సరం 60 లక్షల మంది చిన్నారులు ముందుగానే జన్మిస్తున్నారు. వీరిలో 12 లక్షల మంది మరింత ముందుగానే పుట్టడం వల్ల వారిని, వారి తల్లులను కాపాడడం కష్టమవుతోంది. ముందుగా జన్మించిన శిశువులలో ఎక్కువ మంది ఐదేళ్ల వయసు వచ్చే లోగానే మృత్యువాత పడుతున్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వాలు, దాతలు, ప్రయివేటు రంగం, పౌర సమాజం, తల్లిదండ్రులు, వైద్య నిపుణులు కలిసికట్టుగా కృషి చేయాలని నివేదిక సూచించింది. ముందస్తు జననాలను నివారించాలంటే ప్రతి మహిళకు గర్భం ధరించడానికి ముందు, ఆ తర్వాత నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలని డబ్ల్యూహెచ్ఓ విభాగం డైరెక్టర్ డాక్టర్ అన్షు బెనర్జీ అభిప్రాయపడ్డారు.

సింప్లీబిజ్ ప్రొఫెషనల్ సేవల ప్రయోజనం

ఐదేండ్లలో రూ.100కోట్ల ఆదాయం

- టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు
- స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకు సవాళ్లు: రఘుబాబు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'వ్యాపారంలో అనుసరణలు చాలా ముఖ్యమైనవి. వృద్ధి దశలో ఉన్న స్టార్టప్‌లలో చట్టాల పాలన, అమలు, అకౌంటింగ్ మరింత ముఖ్యం. ఎందుకంటే అవి పాటించకపోతే జరిమానాలు, పని ఆగిపోవడం, చట్టపరమైన కేసులు ఇలా ఎన్నో సమస్యలు ఎదుర్కోవాలి. సింప్లీబిజ్ అందించే వృత్తిపరమైన సేవలతో టీ-హబ్‌లో ఉన్న 500కుపైగా స్టార్టప్‌లు ప్రయోజనం పొందుతాయి' అని టీ-హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు తెలిపారు. గోల్కొండకోటలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన సింప్లీబిజ్ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు.

సమ్మతి, అకౌంటింగ్, టాక్సేషన్ కంపెనీలు ఎక్కువ సమయం తీసుకుంటాయని, సగటున 70శాతం సమయాన్ని పెద్ద కంపెనీలు పన్ను, అకౌంటింగ్, సమ్మతి బృందాలు వెచ్చిస్తాయని వివరించారు. వృద్ధి దశలోని స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకు సింప్లీబిజ్ అందించే వత్తిపరమైన సేవలు ఎక్కువగా అవసరమవుతాయని తెలిపారు. సింప్లీబిజ్ వ్యవస్థాపకులు రఘుబాబు మాట్లాడుతూ వృద్ధి బాటలో ఉన్న స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు భారతదేశం వెలుపల ఉన్న విదేశీ ఎస్ఎంబీలు నిర్వహించనున్న సేవల కోసం విశ్వసనీయ భాగస్వాములను కనుగొనడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయని అన్నారు. నేటి ఎస్ఎంబీలు రేపటి ఎంఎన్‌సీలని అన్నారు.

ప్రస్తుతం, ఎంటీటీ మేనేజ్‌మెంట్ స్పేస్‌లోని ప్రొఫెషనల్ సర్వీస్ అందించే కొన్ని పెద్ద సంస్థలు ఉండగా, చిన్న సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి అసంఘటితంగా ఉంటున్నాయని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అకౌంటింగ్, ట్యాక్స్, లీగల్, పేరోల్, లావాదేవీ సలహా సంస్థల మేనేజ్‌మెంట్ స్పేస్‌లో ప్రారంభ దశ, వద్ధిదశలో ఉన్న కంపెనీలకు విశ్వసనీయ భాగస్వామిగా మారడంతో వచ్చే ఐదేండ్లలో రూ.100 కోట్ల ఆదాయాన్ని రాబట్టేందుకు ప్రణాళికలు రచించినట్టు తెలిపారు.

షష్టిపూర్తి కలాలకు నేడు సత్కారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తాధ్వర్యంలో గురువారం షష్టిపూర్తి కలాలలకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాతృవందనం పేరిట హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా మందిరంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఈ ఏడాదికిగాను 31 మంది తల్లులను సత్కరించనున్నారు.

వేల కోట్ల ఆస్తులెలా వచ్చాయి?

బీఆర్ఎస్ నేతలకు మహేష్‌కుమార్ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తొమ్మిదేండ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలకు వేల కోట్ల ఆస్తులెలా వచ్చాయని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన బీఆర్ఎస్ నేతలు...ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీపై పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గాంధీ కుటుంబం గురించి మాట్లాడే అర్హత లేదని బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. చిన్న, చిన్న పదవుల కోసం ఆరాటపడే బీఆర్ఎస్ నాయకులు... ప్రధాని పదవిని తృణప్రాయంగా తిరస్కరించిన సోనియగాంధీ గురించి మాట్లాడుతారా? అని ప్రశ్నించారు.

ప్రమాణ స్వీకారానికి విరుద్ధంగా మోడీ ప్రవర్తన : జి నిరంజన్

ప్రధాన నరేంద్రమోడీ ప్రవర్తన ప్రమాణ స్వీకారానికి విరుద్ధంగా ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షులు జి నిరంజన్ విమర్శించారు. రాజ్యాంగ పీఠికలోని సెక్యూలర్ విధానానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగానే మోడీ దేశంలో ఉద్రిక్త వాతావరణాన్ని సష్టిస్తున్నారని చెప్పారు. దేశంలో మతసామరస్య వాతావరణాన్ని కాపాడాలంటే మోడీ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

దళిత వరుడిపై అగ్రవర్ణాల దాష్టీకం

- ఊరేగింపుగా వెళ్లాడని దాడి

మీరట్ : ఆగ్రాలో ఓ దళిత వరుడిపై అగ్రవర్ణాలకు చెందిన వారు దాడి చేసి తీవ్రంగా హింసించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరుడు, మరి కొందరు కలిసి వివాహానికి ఊరేగింపుగా వెళుతుండగా ఈ నెల 4వ తేదీ రాత్రి అగ్రవర్ణాల వారు అటకాయించారు. వాహనం నుండి కిందికి లాగి చిత్రహింసలు పెట్టారు. పెళ్లికి వచ్చిన అతిథులు ప్రాణభయంతో వివాహం జరగాల్సిన హాలులోకి పరుగులు తీశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... అగ్రవర్ణాలకు చెందిన వారు కర్రలు, ఇనుప రాడ్లు పట్టుకొని యువకుడిని, అతనితో ఉన్న వారిని వెంబడించారు. వారిపై దాడికి తెగబడ్డారు. వేదిక వద్ద ఉన్న మహిళలను వేధించారు. పెళ్లి మండపం వద్ద విద్యుత్ సరఫరాను నిలిపివేసి కులం పేరుతో దూషించడం ప్రారంభించారు. పెళ్లి వేడుకకు ఆటంకం కలిగించారు.

ఈ ఘటనపై వరుడి అత్త గీతా జాతవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు కాబోయే అల్లుడు అజయ్ జాతవ్, మరికొందరు ఊరేగింపుగా సొహల్లా బస్తీ మీదుగా వెళుతుండగా 20-25 మంది వారిని అటకాయించారని, ఆగిపొమ్మని హెచ్చరించారని ఆమె తన ఫిర్యాదులో తెలిపారు. 'మా గ్రామంలో పెళ్లి చేసుకునే దళిత యువకులు ఊరేగింపుగా వెళ్లకూడదు. అలా వెళ్లేందుకు వారికి ఎంత ధైర్యం ?' అంటూ దూషించారని వాపోయారు. ఈ నెల 5న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించామని, కానీ వారు తీసుకోలేదని చెప్పారు. ఆగ్రా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు 8న ఫిర్యాదును స్వీకరించారని అన్నారు. తన కుమార్తె అంజన వివాహాన్ని అడ్డుకున్న వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు వివిధ సెక్షన్ల కింద 20 మంది గుర్తు తెలియని వ్యక్తులు సహా 25 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఇప్పటి వరకూ ఎవరినీ అరెస్ట్ చేయలేదు.

ప్రయివేటు రంగంలో 10వేల ఉద్యోగాలు

ఈ నెల 22న మెగా జాబ్ మేళా : పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'నిరుద్యోగులకు ప్రయివేటు రంగంలో 10వేల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం. 100కుపైగా పెద్ద కంపెనీలతో కుత్బుల్లాపూర్‌లో ఈనెల 22న మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేయనున్నాం' అని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖల మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన కార్యాలయంలో తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ నేతత్వంలో కుత్బుల్లాపూర్‌లో నిర్వహించనున్న మెగాజాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే వివేకానందతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌స్టెప్ ఆధ్వర్యంలో నడుస్తున్న తొమ్మిది ఆధునిక శిక్షణా కేంద్రాల ద్వారా శిక్షణను ఇచ్చి 45వేల మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రయివేటు రంగంలో వారి అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను కల్పించామని చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి వివిధ రంగాలలో యువతీ, యువకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మెగా జాబ్ మేళాలో ట్రాన్స్‌జెండర్‌లకు, చెవిటి, మూగ వారికి కూడా అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. ఏడో తరగతి నుంచి ఇంటర్మీడియట్, గ్రాడ్యుయేషన్, డిప్లమా హోల్డర్స్, బీఫార్మా, ఎంఫార్మా, హోటల్ మేనేజ్‌మెంట్, డ్రైవర్స్, బీఈ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, చదివినవారు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. హెచ్ఆర్ కోసం హెల్ప్ లైన్ నెంబర్ 7097655912ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ ఎండీ వేణుగోపాల్ తదతరులు పాల్గొన్నారు.